RNI.No.TELTEL/2013/52694

Estd.: 2000

www.voodayam.com /voodayam /Voodayam

# వుదయం

Simultaneously published from Adilabad, Hyderabad, Khammam, Karimnagar,Guntur & Warangal

సంపుటి : 12 ‖ సంచిక : 181 ‖ ఆదిలాబాద్ ‖ ఆదివారం, డిసెంబర్ 08, 2024 ‖ VOODAYAM Telugu Daily ‖ వెల : రూ. 3.00 ‖ పేజీలు : 12

## గ్రామాలలో అభివృద్ధికి కృషి చేస్తా

ఆదిలాబాద్, డిసెంబర్ 6(జి.ఎన్.ఎస్): ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ను బోథ్ మండలం నాగపూర్ గ్రామస్తులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామానికి రోడ్డు, గ్రామపంచాయతీ బిల్డింగ్ మంజూరు చేయించినందుకు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలోని గ్రామాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు శ్రీధర్ రెడ్డి, స్వామి, కోవ మంకు, ప్రభాకర్, భీంరావ్ తదితరులున్నారు.

## అదనపు తరగతి నిర్మాణ పనులకు బోథ్ ఎమ్మెల్యే భూమి పూజ

బోథ్, డిసెంబర్ 6(ఎ.ఎం.ఎస్): నెరడిగొండ మండలంలోని వెంకటపూర్ గ్రామంలో పాఠశాల మరమ్మతులు, నూతన అదనపు తరగతి గది కోసం 17. 70 లక్షలతో నిధులతో చేపట్టనున్న నిర్మాణ పనులకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ శుక్రవారం ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అంతకుముందు పాఠశాలకు వచ్చిన ఎమ్మెల్యేకు విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. విద్యార్థులు శ్రద్ధతో చదువుకోవుకొని గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొన్నారు.




ఫాం హౌస్ లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ని కలిసి ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలు కార్యక్రమంలో భాగంగా సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనాలని ఆహ్వానించిన హైదరాబాద్ ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రోటోకాల్ ప్రజా సంబంధాల సలహాదారు హర్కర వేణుగోపాల్ , ప్రోటోకాల్ డైరెక్టర్ వెంకట్ రావు



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన ఇండియన్ ఎయిర్ ఫోర్స్ గ్రూప్ కెప్టెన్ అజయ్ దాశరథి టీమ్

### కార్పోరేట్ విద్యాసంస్థలలో వరుస విద్యార్థుల ఆత్మహత్యలపై

# సమగ్ర విచారణ జరిపించాలి.

- తెలంగాణ రాష్ట్రంలో నారయణ, శ్రీచైతన్య విద్యాసంస్థలను రద్దు చేయాలి.
- కార్పోరేట్ విద్యాసంస్థలతో ఇంటర్ బోర్డు అధికారులు మిలాఖత్
- ఆంధ్రప్రదేశ్ మంత్రి నారయణ సమాధానం చెప్పాలి.
- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఇంటర్ బోర్డు ముందు ధర్నా




హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో కార్పోరేట్, శ్రీచైతన్య, నారయణ విద్యాసంస్థలలో వరుస విద్యార్థుల ఆత్మహత్యలు పై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, ఈ విద్యా సంస్థలపై విజిలెన్స్ దాడులు నిర్వహించాలని, అనుమతులు లేకుండా నడుస్తున్న కార్పోరేట్ శ్రీచైతన్య, నారయణ విద్యాసంస్థలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, ఇంటర్ బోర్డు అధికారులు కార్పోరేట్ విద్యాసంస్థలతో మిలాఖత్ కావడంపై విజిలెన్స్ దాడులు జరిపి ఇంటర్ అధికారుల అవినీతి పై చర్యలు తీసుకోవాలని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నాంపల్లి ఇంటర్ బోర్డు కార్యాలయం ముట్టడి నిర్వహించడం. జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్ష్య,కార్యదర్శులు ఆర్.ఎల్.మూర్తి, టి.నాగరాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కార్పోరేట్ నారయణ, శ్రీ చైతన్య విద్యాసంస్థలలో విద్యార్థులు వరుసగా ఆత్మహత్యలు చేసుకుంటున్న ఇంటర్ అధికారులు, ప్రభుత్వం స్పందించడం లేదు. రాష్ట్రంలో ఫీజులు వేధింపులు, ర్యాంకులు, మార్కులు కోసం తీవ్ర ఒత్తిడి కల్గించడం ఉదయం నుండి రాత్రి వరకు చదువులు, రివిజన్ పేరుతో ఒత్తిడి పెంచి మార్కెట్ మాయజాలం కోసం కోట్లు రూపాయలు ఫీజులను వసూళ్లు చేస్తున్నారని తెలిపారు. వరుసగా తీవ్ర ఒత్తిడి, లెక్చరర్ వేధింపులు చేయడం చేస్తున్నారని, అన్నారు. నారయణ, శ్రీచైతన్య విద్యాసంస్థలు ఇప్పటికే పదవ తరగతి పూర్తి కానీ విద్యార్థులు ను ఇప్పటికే రాయితీలు ఇచ్చి మరీ అడ్మిషన్లు చేస్తున్నారని ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న ఈ సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తోంది. పక్కా రాష్ట్రంలో మంత్రిగా ఉండి ,ప్రజా జీవితంలో ఉన్న మంత్రి నారయణ తన విద్యాసంస్థలలో విద్యార్థులు చనిపోతున్న కనీసం స్పందించడం లేదని ,తన సంస్థలలో చనిపోతున్న విద్యార్థుల మరణాలకు భాధ్యత వహించి రాజీనామా చేయాలని, ఒకవేళ తను రాజీనామా చేయకుంటే చంద్రబాబు తన క్యాబినెట్ నుండి భర్తరఫ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇంటర్ అధికారులు తక్షణమే హైలెవెల్ కమిటీని ఏర్పాటు చేసి ,అనుమతులు లేకుండా నడుస్తున్న క్యాంపస్ లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెసిడెన్షియల్ పద్ధతిలో ప్రభుత్వం అనుమతి ఇవ్వకుండానే హస్టల్స్ పెట్టి లక్షలాది రూపాయలు ఫీజులను వసూళ్లు చేస్తున్నారని ఈ ఫీజులపై తక్షణమే ఐటి దాడులు చేయాలని ఎస్ఎఫ్ఐ కోరుతుంది. అనంతరం తెలంగాణ రాష్ట్ర ఇంటర్ బోర్డు డైరెక్టర్ కృష్ణ ఆదిత్య, గారికి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ ఖచ్చితంగా కార్పోరేట్ కళాశాలలపై ఒక టీమ్ వేసి విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు దామెర కిరణ్, కె.అశోక్ రెడ్డి,

హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు లెనిన్ గువేరా, హైదరాబాద్ ఉపాధ్యాక్షురాలు చరణశ్రీ, శ్రీమాన్, నాగేందర్, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు గుండె శివ, స్టాలిన్, లిఖిత్ కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకత్వం విఘ్నేష్,మనోజ్, అరుణ్,లక్ష్మణ్, భగత్ తదితరులు పాల్గొన్నారు.



# రోదసిలో పుతిన్ రహస్య ఆయుధం


- ఏకంగా అణ్వాయుధాన్నే మోహరిస్తున్న రష్యా
- 'కాస్మోస్ 2553' ఉపగ్రహ సాయంతో సన్నాహాలు

మాస్కో డిసెంబర్ 7 : రష్యాకు చెందిన రహస్య ఉపగ్రహం 'కాస్మోస్ 2553' ప్రపంచ దేశాలను కలవరపెడుతున్నది. ప్రస్తుతం డమ్మీ వార్‌హెడ్ (ఆయుధం)తో భూకక్ష్య వెలుపలి హద్దుల్లో సంచరిస్తున్న ఈ ఉపగ్రహం సాయంతో ముమ్మందు క్షిపణులను, అణ్వాయుధాలను ప్రయోగించి శత్రు దేశాలకు చెందిన పలు కీలక ఉపగ్రహాలను నాశనం చేసేందుకు రోదసిలో రష్యా ఓ ప్లాట్‌ఫామ్‌ను అభివృద్ధి చేస్తున్నట్టు భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. అంతరిక్షంలో రష్యా మోహరించే ఆయుధానికి సంబంధించిన విడిభాగాలను ఈ ఉపగ్రహం పరీక్షిస్తున్నట్టు తాము భావిస్తున్నామని, దీని వల్ల ఎదురయ్యే ముప్పును తమ స్పేస్ కమాండ్ నిరంతరం పరిశీలిస్తున్నదని అమెరికా అధికారులు 'న్యూయార్క్ టైమ్స్' పత్రికకు తెలిపారు. రష్యా సైనిక బలగాలను ఉక్రెయిన్‌లోకి పంపడానికి కొన్ని రోజుల ముందు (2022 ఫిబ్రవరిలో) రష్యాలోని ప్లెసెట్స్ కాస్మోడ్రోమ్ నుంచి సూయజ్-2 రాకెట్ ద్వారా 'కాస్మోస్ 2553'ను నింగిలోకి పంపారు. అనంతరం ఆ ఉపగ్రహాన్ని దిగువ భూకక్ష్య చివరి అంచున (భూమికి దాదాపు 2 కి.మీ. ఎత్తున) చేర్చారు.

ఆ ప్రాంతమంతా వాన్ అలెన్ బెల్ట్స్ నుంచి వచ్చే రేడియో ధార్మికతతో సంతృప్తమై ఉంటుంది. ఇది ఉపగ్రహ భాగాలను నిర్వీర్యం చేస్తుంది. పనికిరాని లేదా నిలిపివేసిన ఉపగ్రహాలను నిశ్శబ్దంగా వాటంతట అవే నాశనమయ్యేలా చేసేందుకు దూరంగా ఆ ప్రాంతంలోకి పంపుతారు. దీంతో ఆ ప్రాంతాన్ని 'శ్మశాన కక్ష్య' అని పిలుస్తున్నారు. ఈ నేపథ్యంలో 'కాస్మోస్ 2553'ను ఆ కక్ష్యలో నిలపడం అమెరికా ఖగోళ పరిశీలకుల్లో అనుమానాలను పెంచుతున్నది.

# బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

## • తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం



ఫెంగల్ తుపాను ప్రభావం తగ్గక ముందే.. భారత వాతావరణ కేంద్రం షాకింగ్ ప్రకటన విడుదల చేసింది. బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడినట్లు ప్రకటించింది. ఈ అల్పపీడనం ప్రభావంతో తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. వరుసగా మూడు రోజుల పాటు వర్షాలు పడుతాయని ఐడీఎం ప్రకటించింది. ఇప్పటికే ఫెంగల్ తుపాను ధాటికి తమిళనాడు అతలాకుతలం అయ్యింది. ఇప్పుడు మరో అల్పపీడనం అని ప్రకటించడంతో.. అక్కడి ప్రజలు భయంతో వణికిపోతున్నారు. ఫెంగల్ ప్రభావం ఏపీ, తెలంగాణపై పెద్దగా లేకపోయినా.. తాజా అల్పపీడన ప్రభావం ఉంటుందని వాతావరణ కేంద్రం అధికారులు చెబుతున్నారు.

ఇదీ పరిస్థితి..

వాతావరణ శాఖ అధికారుల ప్రకారం.. ఆగ్నేయ బంగాళాఖాతంలో సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తుల్లో ఉపరితల ఆవర్తనం ఆవహించింది ఉంది. దీని కారణంగా దక్షిణ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. ఈ అల్పపీడనం పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ డిసెంబర్ 12వ తేదీ నాటికి వాయుగుండగా బలపడే అవకాశం ఉంది. దీని ప్రభావంతో.. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్, యానాం భారీ ఈదురు గాలులు వీస్తాయి. అలాగే.. దక్షిణ కోస్తాంధ్ర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయి. ఇప్పటికే రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో ఆకాశం నల్లటి మేఘాలతో నిండిపోయింది. ఆయా చోట్ల తేలికపాటి వర్షాలు కురుస్తున్నాయి. శనివారం నాడు పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, విశాఖపట్నం, ఉభయ గోదావరి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. ఇదిలాఉంటే.. రానున్న రెండు రోజుల్లో అల్లూరి సీతారామరాజు, తూర్పు గోదావరి, కాకినాడ, కోనసీమ, పల్నాడు, ఎన్టీఆర్, ప్రకాశం, పశ్చిమ గోదావరి, నెల్లూరు, చిత్తూరు, జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

తెలంగాణలోనూ భారీ వర్షాలు..

అల్పపీడనం ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలోనూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు. ఇప్పటికే ఆయా జిల్లాల్లో ఆకాశం మేఘావృతమై ఉంది. వాతావరణం చాలా చల్లగా ఉంది. హైదరాబాద్‌లో పలు చోట్ల చిరు జల్లులు కురిశాయి. రానున్న రెండు రోజుల్లో జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు చెప్పారు.

భారీగా పెరిగిన చలి తీవ్రత..

తెలుగు రాష్ట్రాల్లో చలి తీవ్రత భారీగా పెరిగింది. వాతావరణం చల్లగా మారింది. ఆకాశం మేఘాలతో నిండిపోయింది. దక్షిణ, నైరుతి దిశగా వీస్తున్న గాలుల కారణంగా ఉష్ణోగ్రతలు మరింత కనిష్టానికి పడిపోతున్నాయి. తెలంగాణలో నిర్మల్, ఆదిలాబాద్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నిజామాబాద్, నల్లగొండ, సూర్యాపేట, హైదరాబాద్, వికారాబాద్ సహా మరికొన్ని జిల్లాల్లో చలి తీవ్రత అధికంగా ఉంది. ఏపీలోనూ ఇదే పరిస్థితి ఉంది. పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, విశాఖపట్నం ప్రాంతాల్లో చలి తీవ్రత అధికంగా ఉంది.

# గంజాయి, డ్రగ్స్‌పై ఫోకస్ పెట్టాలి..

## -పోలీసులకు మంత్రి తుమ్మల కీలక ఆదేశాలు

ఖమ్మం డిసెంబర్ 7 : విద్యార్థులు గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడకుండా పోలీస్‌లు ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఖమ్మం నగరంలో మామిళ్ళగూడెం, సారథి నగర్ కాలనీలను అనుసంధానం చేసే రైల్వే అండర్ మినీ బ్రిడ్జిని ఇవాళ(శనివారం) మంత్రి తుమ్మల ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ....ఖమ్మం నగరంలో ట్రాఫిక్ కష్టాలు లేకుండా రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేగా ఉన్నపుడు అండర్ బ్రిడ్జిని తాను శాంక్షన్ చేశానని.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నపుడు శంకుస్థాపన చేశానని గుర్తుచేశారు. ప్రజా పాలన ఏడాదిలో అర్.యుబీ ప్రారంభోత్సవం చేశామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మం నగరంలో విశాలమైన రహదారులు, పార్క్‌లు ఏర్పాటు చేశామని చెప్పారు. 500 ఎకరాలు ఉన్న వెలుగుమట్ల పార్క్‌ను ఖమ్మం నగరానికి పర్యాటక ప్రదేశంగా ల్యాండ్ మార్క్‌గా అభివృద్ధి చేశానని తెలిపారు. ఖమ్మం చరిత్ర తెలిపేలా ఖిల్లాపై రోప్‌వే ఏర్పాటుతో పర్యాటక అభివృద్ధి చెందుతుందని అన్నారు. పెరుగుతున్న అర్బన్ పాపులేషన్‌కు తగ్గట్టుగా మాస్టర్ ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు. ఖమ్మం నగరం పరిశుభ్రంగా విశాలమైన రహదారులు పచ్చదనంతో ఇతర నగరాలకు ఆదర్శంగా ఉండాలని అన్నారు. నాలాలు పూడ్చి అక్రమ కట్టడాలు నిర్మించడం వల్లే మున్నేరుకు వరద ముంపు గండం వచ్చిందని చెప్పారు. అడవులను కొట్టడం వల్లే కోతులు జనావాసాల్లోకి వస్తున్నాయని తెలిపారు. ఖమ్మం విప్లవాల పురిటిగడ్డ అన్నారు. స్వాతంత్ర సంగ్రామంలో నైజాం రజాకార్లను తరిమి కొట్టిన జిల్లా ఖమ్మం జిల్లా అని ఉద్ఘాటించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో తనకు మంత్రిగా అవకాశం ఇచ్చిన ఖమ్మం ప్రజలకు తుమ్మల నాగేశ్వరరావు ధన్యవాదాలు తెలిపారు.

యాదాద్రి థర్మల్ స్టేషన్ లోని 800 మెగావాట్ల యూనిట్ 2 ని జాతికి అంకితం ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. థర్మల్ స్టేషన్ లోని పైలాన్ ను ఆవిష్కరించిన సీఎం. కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహా, తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రఘువీర్ రెడ్డి, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు.



## సంపాదకీయం

# చెరకు రైతుల రాయితీలపై వేటు!

రైతాంగ ప్రయోజనాలకు హరించే విధంగా మోడీ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నది. పంటలకు న్యాయమైన ధరలు ప్రకటించకపోవటం, విత్తనాలు, ఎరువుల, పురుగుమందుల ధరలు పెంచటం, ఎరువుల ధరల నిర్ణయ అధికారం ఎరువుల కంపెనీలకే ఇవ్వటం, పోషకాలను బట్టి ఎరువుల సబ్సిడీ ఇవ్వటం, ధాన్యం సేకరణ నుంచి ఎఫ్‌సిఐని తప్పించటం, వ్యవసాయ రంగంలోకి బహుళ జాతి సంస్థలకు అవకాశం కల్పించటం, ల్యాండ్ టైటిల్ యాక్ట్ పేరుతో భూముల సర్వే చేయించి కార్పొరేట్లకు భూములు కట్టబెట్టటం, రైతుల మోటార్లకు కరెంట్ మీటర్లు బిగించమని రాష్ట్రాలకు చెప్పటం లాంటి చర్యలు ఇప్పటికే అమలు చేసింది. తాజాగా చెరకు రైతులకు ప్రయోజనంగా ఉన్నవాటిని ఉపసంహరిస్తూ ఆర్డర్ జారీ చేసింది. మోడీ ప్రభుత్వ విధానాలవల్ల చెరకు రైతాంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. ఆ సంక్షోభం ఇంకా ఎక్కువ అయ్యేలా మోడీ ప్రభుత్వంలోని వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ 1966 షుగర్ (నియంత్రణ) ఆర్డర్, 2018 నాటి చక్కెర నియంత్రణ ఆర్డర్‌ను కలిపి ది షుగర్ (నియంత్రణ) ఆర్డర్ 2024 ముసాయిదాను విడుదల చేసినట్లు ప్రకటించింది. ఉత్పత్తి ప్రక్రియలో సాంకేతిక పురోగతి, పరిశ్రమలో మార్పులను పేర్కొంటూ 2024 ముసాయిదా విడుదల చేసినట్లు చెప్పింది. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర పొందటానికి పంచదార రికవరీ రేటును 8.5% నుంచి 10%కి కొత్త ముసాయిదాలో పెంచటం జరిగింది. భారత దేశంలో రికవరీ రేట్ రీడింగ్‌ను సక్రమంగా తెలిపే మిషన్లు లేని కారణంతో పాటు, రికవరీని పెంచే నాణ్యమైన విత్తనం అందక పోవటం వల్ల కొత్త ముసాయిదాలో పేర్కొన్న 10% రికవరీ రేటు రాని పరిస్థితుల్లో రైతులు మద్దతు ధర పొందలేరు. దేశంలో పంచదార రికవరీ 9.% మించి ఎప్పుడు రాలేదు. 2024 నవంబర్ మొదటి వారంలో 8.82% మాత్రమే ఉంది. బ్రెజిల్ లాంటి కొన్ని దేశాల్లో 11 నుంచి 14% పైగా పంచదార రికవరీ వస్తుంది. షుగర్ (నియంత్రణ) ఆర్డర్ 1966లోని సెక్షన్ 5ఎ, చక్కెర మిల్లుల ద్వారా వచ్చే లాభాల నుండి అదనపు ధర వాటా పొందేందుకు రైతులకు వీలు కల్పించింది. ఇప్పుడు ఆ నిబంధన తొలగించటంతో లాభాలను పంచకుండా తప్పించుకుంటున్న మిల్లులకు వరంలా దొరికింది. ప్రభుత్వం ప్రకటించిన ధరతో పాటు, రాష్ట్ర ప్రభుత్వాలు అదనంగా సలహా (ఎస్ఎపి) ధరను ప్రకటించటానికి 1966 ముసాయిదాలో వీలు కల్పించిన నిబంధనను కూడా కేంద్ర ప్రభుత్వ కొత్త ఆర్డర్ ముసాయిదా తొలగించింది. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక మరికొన్ని రాష్ట్రాలు 2 నుండి 5 వందల వరకు సలహా ధరను ప్రకటిస్తున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా కొన్ని సంవత్సరాలు 200 సలహా ధరను ప్రకటించింది. కొత్త షుగర్ (నియంత్రణ) ఆర్డర్ ప్రకారం రాష్ట్రాలు సలహా ధరను ప్రకటించలేవు. చక్కెర మిల్లులు బ్యాంకుల్లో తనకా పెట్టిన పంచదార అమ్ముకోవటానికి కేంద్ర ప్రభుత్వ అనుమతి తప్పక చక్కని కొత్త ముసాయిదాలో పేర్కొన్నారు. ఫలితంగా చెరుకు కొనుగోలు చేసిన 14 రోజుల లోపు మిల్లులు డబ్బులు చెల్లించాలన్న నిబంధన నిరుపయోగంగా మారింది. రైతులకు డబ్బులు ఎప్పుడు చెల్లించాలన్న అధికారం మిల్లులకు దక్కింది. చెరకు విక్రయ డబ్బులు పొందటానికి మిల్లర్ల దయపై రైతులు ఆధార పడాల్సి వస్తుంది. ప్రపంచంలోని 195 దేశాల్లో 124 దేశాలు చెరకు పండిస్తున్నారు. భారత దేశంలో 50 లక్షల ఎకరాల్లో చెరకు సేద్యం జరుగుతున్నది. చక్కెర తయారీ పరిశ్రమలకే కాకుండా, కాగితం, మద్యం, పశువుల దాణా, రసాయనాల తయారీకి ముడి పదార్థాల ఉత్పత్తిని చెరకు సేద్యం అందిస్తుంది. ఎకరాకి సగటు దిగుబడి 30 టన్నుల వస్తుంది. ఎకరాకు సేద్యానికి అన్ని రకాల సేద్యపు ఖర్చు లక్ష దాకా ఉంది. కౌలు రైతుకు అదనంగా మరో 20 వేలు ఖర్చుగా పెట్టాలి. నీతిఆయోగ్ నివేదిక ప్రకారం దేశంలోని వ్యవసాయ పరిశ్రమల్లో చక్కెర పరిశ్రమ రెండవ పెద్ద పరిశ్రమ. చక్కెర ఉత్పత్తిలో బ్రెజల్ మొదటి స్థానంలో ఉండగా, భారత్ రెండవ స్థానంలో ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో 5.60 లక్షల ఎకరాల్లో రైతులు చెరకు సాగు చేస్తున్నారు. దేశంలో లక్షలాది రైతు కుటుంబాలకు జీవనోపాధిగా ఉండి, ఎందరికో ఉపాధి కల్పిస్తూ, పెద్ద మొత్తంలో విదేశీ మారక ద్రవ్యాన్ని దేశానికి అందిస్తున్న చెరకు రైతాంగం ఎడల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల ఫలితంగా చెరకు సేద్యం నేడు తీవ్ర సంక్షోభంలో ఉంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తున్న మద్దతు ధర చెరకు రైతులకు ఏమాత్రం మేలు చేయలేదు. దిగుబడి ఎకరాకు 30 టన్నులు. ప్రభుత్వ చెప్పే క్వింటాల్ చెరకు ఉత్పత్తి ఖర్చు 157 రూపాయలు. వాస్తవ ఖర్చు 305 రూపాయలు. కేంద్రం ప్రకటించిన క్వింటాల్ మద్దతు ధర 350 రూపాయలు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం వాస్తవ ఖర్చుపై 50% పెంచితే 450 ప్రకటించాలి. 10% పంచదార రికవరీ వచ్చే చెరకుకి మాత్రమే ప్రభుత్వ మద్దతు ధర లభిస్తుంది. అంతకన్నా తక్కువ రికవరీ వస్తే తగ్గిన దాని ప్రకారం మద్దతు ధరలో కోత పడుతుంది. మద్దతు ధర ప్రకారం 30 క్వింటాళ్లు వచ్చిన రైతుకు లక్షా, ఐదు వేల ఆదాయం వస్తుంది. ఈ ఆదాయం సొంత భూమి రైతుల ఖర్చులకు సరి పోవటం లేదా నామమాత్రపు మిగులు ఉంటుంది. కౌలు రైతులకు పెట్టుబడి కూడా రాదు. టన్ను చెరకు ద్వారా 280 కిలోల పంచదార లభిస్తుంది. కేజీ 30 చొప్పున 8680 రూపాయలు వస్తుంది. మద్దతు ధర ప్రకారం టన్ను చెరకు ద్వారా రైతుకు లభించేది 3500 రూపాయలు. మిల్లు యజమానులకు మిగులుతున్నది 5,180 రూపాయలు. ఎకరం చెరకు పైన మిల్లు యజమాని 1,60,580 రూపాయలు మిగులు పొందుతాడు. ఫ్యాక్టరీ ఖర్చుల కింద 50 వేలు తీసేసినా లక్షకు పైగా మిగులుతుంది. దేశంలో 453 చక్కెర మిల్లులు ఉంటే, వాటిల్లో 252 సహకార రంగంలో, 67 ప్రభుత్వ రంగంలో ఉంటే, 134 ప్రైవేట్ రంగంలో ఉన్నాయి. సహకార, ప్రభుత్వ పంచదార మిల్లులను ప్రోత్సహించాల్సి మోడీ ప్రభుత్వం, అందుకు విరుద్ధంగా వాటిని మూసివేయటం లేదా అమ్మివేయటం చేస్తున్నది. చెరకు రంగమంతా నేడు ఎక్కువగా ప్రైవేట్ పరిశ్రమల చేతుల్లో ఉంది. రైతులు, ప్రైవేట్ మిల్లులకే 90% చెరకు విక్రయిస్తున్నారు. మిల్లుల యజమానులు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకన్నా తక్కువ ఇస్తూ రైతాంగాన్ని దోసుకుంటున్నారు. సకాలంలో డబ్బులు ఇవ్వకుండా రైతాంగాన్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. సంవత్సరాల తరబడి వేలాది రూపాయలు రైతులకు బకాయిలు పెట్టారు. ప్రస్తుతం రూ. 5 వేల కోట్ల దాక రైతులకు చెల్లించాల్సిన బకాయిలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి మిల్లులు ఇవ్వాల్సిన డబ్బులు ఇచ్చేలా చర్యలు తీసుకోకుండా మిల్లు యజమానుల ప్రయోజనాల కోసం తానే హామీ ఉండి వేలాది కోట్లు బ్యాంకుల నుంచి అప్పులు ఇప్పించింది. రైతాంగం మాత్రం అప్పుల్లో కూరుకుపోయారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల ఫలితంగా చెరకు సేద్యం నష్టదాయకంగా మారటంతో చెరకు సేద్యం ఎడల రైతుల్లో విముఖత ఏర్పడి లక్షలాది ఎకరాల్లో సాగు విస్తీర్ణం తగ్గింది. ఫలితంగా 2022లో పంచదార ఉత్పత్తి 328.7 లక్షల టన్నులు ఉండగా, 2023 నాటికి 311 లక్షల టన్నులకు తగ్గింది. సేద్యాన్ని నష్టదాయకంగా మార్చి రైతాంగం సాగు నుండి తప్పుకునేలా చేసి, చెరకు పంటను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టి, పంచదారను విదేశాల నుంచి మోడీ ప్రభుత్వం దిగుమతి చేసుకోనుంది. ఇప్పటికే 3 లక్షల టన్నుల దేశంలోకి దిగుమతి అయింది. మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా యావన్మంది చెరకు రైతులు ఉద్యమించాలి. 2924 షుగర్ (నియంత్రణ) ఆర్డర్ ముసాయిదాను ఉపసంహరించాలని, టన్నుకు చెరకుకు 4,775 రూపాయల మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేయాలి.

# ఆకాశవాణి అగ్రగణ్య కళాకారుడు

నేదునూరి కృష్ణమూర్తి (1927, అక్టోబరు 10 – 2014, డిసెంబరు 8) కర్ణాటక సంగీత విద్వాంసుడు, సంగీత కళానిధి బిరుదు పొందిన వాడు. మొదట్లో వయొలిన్ మీద ఆసక్తితో ఉన్నా తర్వాత గురువుల సలహాపై గాత్ర సంగీతం వైపు మొగ్గు చూపాడు. శ్రీపాద పినాక పాణి వంటి వారి వద్ద శిష్యరికం చేశాడు. అన్నమాచార్య సంకీర్త నలు, రామదాస కీర్తనలను స్వర పరిచాడు. నాదసుధా తరంగిణి అనే ట్రస్టును ఏర్పాటు చేసి స్వరపరిచిన కీర్తనలను వాటి నొటేషన్లతో సహా ప్రచురించాడు. కృష్ణమూర్తి అక్టోబరు 10, 1927 న తూర్పు గోదావరి జిల్లాలోని కొత్తపల్లి గ్రామంలో రామమూర్తి పంతులు, విజయలక్ష్మి దంపతులకు జన్మించారు. ఇంట్లో అందరికన్నా చిన్నవారు. వీరి తండ్రి పిఠాపురం రాజా వారి సంస్థాన కార్యాలయంలో పనిచేస్తూండే వారు. నేదునూరి 1940 లో విజయనగరం మహారాజా సంగీత కళాశాలలో వయొలిన్, గాత్రంలో ప్రాథమిక శిక్షణ పొందారు. కీర్తిశేషులు ద్వారం నరసింగరావు నాయుడు శిష్యుడిగా ఉన్నారు. 1945 నుంచి సంగీత సభలలో పాల్గొంటూ వచ్చారు. 1949లో ప్రముఖ సంగీత విద్వాంసుడు, సంగీత కళానిధి పద్మభూషణ్ డాక్టర్ శ్రీపాద పినాకపాణి వద్ద చేసి సంగీతంలో గమకాలు, ఇతర మెళకువలలో శిక్షణ పొంది, సంగీత నైపుణ్యానికి మెరుగులు దిద్దారు. ఆల్ ఇండియా రేడియోలో అగ్రగణ్య కళాకారుడిగా వెలుగులోకి వచ్చారు. 1951 నుండి ఐదు దశాబ్దాలకు పైగా మద్రాసు సంగీత అకాడమీలో ప్రదర్శనలు ఇస్తూ వచ్చారు. బాల్యం నుండి ఆయనకు సంగీతంలో మంచి అభిరుచి ఉండేది. అష్టపదులు, తరంగాలు, రామాయణ కృతులు పాడారు. చిన్నతనంలో నేదునూరి గ్రామంలో పెరిగిన ఆయన, విద్వాన్ అప్పారావు వద్ద వర్ణాలుబీ కల్లూరి వేణు గోపాల రావు వద్ద అష్ట పదులు, తరంగాలు నేర్చు కున్నారు. అప్పల నరసింహం సహకారంతో విజయ నగరం మహారాజా కాలేజీలో చేరారు. ఆయన అనేక అన్నమయ్య కృతులకు బాణీలు కట్టాడు. “నానాటి బ్రతుకు నాటకము” కీర్తనకు నేదునూరి కట్టిన బాణీని ప్రశంసిస్తూ ఎం. ఎస్. సుబ్బలక్ష్మి “నేదునూరి గారూ, ఆ ఒక్కపాటకు బాణీని కట్టినందుకు మీకు సంగీత కళానిధి ఇవ్వచ్చుండి” అని మెచ్చుకున్న సంఘటన. 1991 లో సంగీత కళానిధి పురస్కారం ఇచ్చినప్పుడు సెమ్మంగుడి శ్రీనివాస అయ్యర్ ఆయన పేరును ప్రతిపాదించగా, సుబ్బలక్ష్మి ఆ ప్రతి పాదనకు ఆమోద ముద్ర వేశారు. 2013 లో కొప్పరపు కవుల ప్రతిభా పురస్కారానికి కూడా ఎంపికయ్యారు. సంగీత లోకంలో ప్రముఖ స్థానం సంపాయించు కున్నారు. సంగీత అకాడమీలో యాభై యేళ్ళకు పైగా పాడారు. తన సుదీర్ఘ సంగీత యాత్రలో అనేక సంగీత కోవిదు లయిన ద్వారం వెంకట స్వామి నాయుడు, డాక్టర్ శ్రీపాద పినాక పాణి, లాల్గుడి జయరామన్, ఎం ఎస్ సుబ్బులక్ష్మి, పేరి శ్రీరామ మూర్తి (వయొలిన్), వెంకట రమణ (మృదంగం), నేమాని సోమ యాజులు (ఘటం) ఇత్యాదులచే నేదునూరి కొనియాడ బడ్డారు. నేదునూరి విజయవాడ జీ వీ ఆర్ ప్రభుత్వ సంగీత, నాట్య కళాశాల, ప్రధాన అధ్యాపకుడిగా, సికింద్రా బాద్, విజయ నగరం, తిరుపతి సంగీత కళాశాలలో పని చేసారు. వేంకటేశ్వర, నాగార్జున విశ్వ విద్యాలయాలలో ఆర్ట్స్ విభాగం డీన్, బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్‌గా, ఆల్ ఇండియా రేడియో, సంగీత విభాగ ఆడిషన్ బోర్డ్ సభ్యుడిగా పనిచేసారు. కొంతకాలం ఆంధ్ర విశ్వ విద్యాలయం గౌరవ ఆచార్యుడిగా ఉన్నారు. నేదునూరి కృష్ణమూర్తి స్వర పరచిన కీర్తనలలో – దాశరథి శతకం పద్యాలు, రాగ సుధా రసాలతో భద్రాచల రామదాస కీర్తనలు సీడీల రూపంలో తెచ్చారు. అన్నమాచార్య సంకీర్తనలు, పద కదంబం మీద పలు సీడీలు, కేసెట్లు వెలువరించారు. ఆల్ ఇండియా రేడియో భక్తి రంజనిలో కూర్చిన నారాయణ తీర్థ తరంగాలు, రామదాస కీర్తనలు వాసికెక్కాయి. టీ టీ డీ – ఆస్థాన విద్వాంసులుగా నియమితులైయ్యారు. అన్నమాచార్య కృతులని కూర్చి సంగీత లోకానికి అందించారు. మద్రాసు సంగీత అకాడమి నుండి సంగీత కళానిధి గౌరవం అందు కున్నారు. శ్రీ రాజా లక్ష్మీ పురస్కారం (2002), నేషనల్ ఎమినెన్స్ అవార్డు (2006), ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం నుండి కళా నీరాజనం పురస్కారం (1995), 2013 లో కొప్పరపు కవుల ప్రతిభా పురస్కారం అవార్డులు, గౌరవ పురస్కారాలు అందుకున్నారు. నేదునూరి ప్రముఖ శిష్యులలో కళాప్రపూర్ణ చిట్టి అబ్బాయి, శ్రీమతి కోక సత్యవతి, శ్రీమతి కె. సరస్వతి వుధ్యార్తి, జి. బాలకృష్ణ ప్రసాద్, శ్రీమతి శోభారాజు, మల్లాది సోదరులు (శివరామ ప్రసాద్, రవి కుమార్) ఉన్నారు. నేదునూరి 2014 డిసెంబరు 8న, అనారోగ్యంతో బాధపడుతూ 87 సంవత్సరాల వయసులో దేహం చాలించారు.



# జలాంతర్గాముల నిర్మాణంలో భారత్ ప్రగతి

భారత దేశములో జలాంతర్గామి దినోత్సవం ప్రతి సంవత్సరం డిసెంబరు 8 వ తేదీన జరుపు తారు. డిసెంబర్ 1967 లో భారత నౌకాదళంలో ప్రవేశపెట్ట బడిన తొలి జలాంతర్గామి – ఐ ఎన్ ఏస్ కల్వరి. కల్వరిని భారత నౌకాదళంలో ప్రవేశ పెట్టబడిన రోజైన డిసెంబర్ 8న జలాంతర్గామి దినంగా భారత నావికాదళం జరుపు కుంటుంది. జలాంతర్గామి నీటిలో మునిగి ప్రయాణం చెయ్యగల వాహనం. వివిధ దేశాల నావికా రక్షణ దళాల్లో జలాంతర్గామి ఒక ముఖ్య భాగం. జలాంతర్గామిని మొదటగా మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో విస్తృతంగా ఉపయోగించారు. ప్రత్యర్థులు జలగర్భ మార్గాల ద్వారా దొంగదెబ్బ తీసే అవకాశం ఉందని క్రీ.పూ. 332లోనే గుర్తించాడు అలెగ్జాండర్. అందుకే జలాల కింద కూడా పహారా కాయాలని అనుచరులను ఆదేశించాడు. ఓ అమోఘమైన ఘంటజాడీ (డ్రైవింగ్ బెల్) ని రూపొందించి దాన్లో ఆయనే స్వయంగా జలాల్లోకి దిగినట్టు ప్రచారంలో ఉంది. పదిహేనో శతాబ్దం చివర్లో.. విఖ్యాత దార్శనికుడైన లియోనార్డో డావిన్సీ.. జల మధ్యంలోకి దూసుకుపోయే సైనిక పాటవం గురించి ప్రస్తావించాడు. ఇంగ్లండ్‌లో ఉంటున్న డచ్ వైద్యుడు కార్నీలియస్ డ్రబ్బెల్1620లో ఎక్కువ సమయం నీటిలోపల ఉండి గొర్రె తోలుతో కప్పిన చెక్క పెట్టెలాంటి దీనిలో– తెడ్డువేసే వారితో సహా మొత్తం 20 మంది ప్రయాణించేందుకు వీలైన తొలి జలాంతర గమన వాహనం సిద్ధం చేశాడు. 1776 సెప్టెంబరులో న్యూయార్క్ ఓడరేవులో మోహరించిన బ్రిటన్ యుద్ధనౌకలపై ‘దొంగదాడి’కి అమెరికా సిద్ధం కాగా, ప్రత్యర్థుల కళ్లు గప్పి, వాళ్ల ఓడలకు రంధ్రాలు చేసి, వాటిని ముంచెయ్యటం లక్ష్యంగా, యేల్ విశ్వవిద్యాలయం విద్యార్థి డేవిడ్ బుష్‌నెల్ పైకి కనబడకుండా తాబేలులా నీటిలోనే ప్రయాణించే ‘టర్టిల్’ను సిద్ధం చేశాడు. అమెరికాకు చెందిన రాబర్ట్ ఫల్టన్ 1798లో జలాంతర్గామి



లోపలి గోడ చుట్టూ మరో పై గోడ నిర్మించి.. మధ్య ఖాళీలో నీరు నింపేలా బలాస్ట్ ట్యాంకులు అమర్చాడు. అమెరికా, రష్యాలు జలాంతర్గాములతోనే ప్రచ్ఛన్న యుద్ధం సాగించిన క్రమంలో... జలాంతర్గాములు డీజిల్ నింపుకోవటం కోసం పైకి రావడం వల్ల శత్రువుల కంటబడటం జరుగగా, ఆ ఇబ్బందిని అధిగమించ డానికి 1954లో అమెరికా మొట్టమొదటి సారిగా అణుఇంధనంతో నెలల తరబడి నీటిలోనే నడిచే ‘యుఎస్ఎస్ నాటిలస్’ను, ఆ తర్వాత బాలిస్టిక్ క్షిపణి ప్రయోగ జలాంతర్గాములను రూపొందించింది. భారత నావికాదళం దేశం యొక్క సముద్ర సరిహద్దులను భద్ర పరచుటలో, అంతర్జాతీయ సంబంధాలను విస్తరించుటంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఆధునిక భారతీయ నౌకాదళం హిందూ మహాసముద్ర ప్రాంతంలో తన స్థానాన్ని మెరుగు పరిచేందుకు వేగవంతమైన పునర్నిర్మాణంలో భాగంగా ఉంది. భారత నావికా దళంలో తూర్పు కమాండ్ – విశాఖపట్నం, పశ్చిమ కమాండ్ – ముంబాయి దక్షిణ కమాండ్ – కోచి, అండమాన్ నికోబార్ నావల్ – పోర్ట్ బ్లెయిర్ అనే 4 కమాండ్ లు ఉన్నాయి. 1985 నుండి అణు జలాంత ర్గాములను నిర్మించడానికి కల్పాక్కం వద్ద ఉన్న అణు కేంద్రంతో కలసి నేవి కృషి చేస్తోంది. 1987లో భారత నౌకా దళంలో జలాంతర్గాముల విభాగాన్ని ఏర్పాటు చేశారు. జలాంతర్గాముల నుండి టార్పిడో అను క్షిపణులను ప్రయోగిస్తారు. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన మొట్ట మొదటి సబ్ మెరైన్ – ఐ ఎన్ ఏస్ షల్కి. 1967 లో డిసెంబర్ 8న భారత నౌకాదళంలో తొలి జలాంతర్గామి – ఐ ఎన్ ఏస్ కల్వరి ప్రవేశ పెట్ట బడింది. ప్రపంచంలో అమెరికా, రష్యా, చైనా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, ఆస్ట్రే లియాతో పాటు భారత దేశం ఏడు దేశాలు అణుశక్తితో నడిచే జలాంతర్గాములను కలిగి ఉన్నాయి.

కల్వరి తరగతి సబ్‌మెరైన్ ప్రాజెక్ట్–75లో జలాంతర్గామి తరగతికి చెందిన ఐఎన్ఎస్ కల్వరి, ఖండేరి, కరంజ్ జలాంతర్గాములను మన దేశంలో ఇప్పటికే ప్రారంభించారు. 2023 నవంబర్ చివరి వారంలో ఫ్రాన్స్‌కు చెందిన నావల్ గ్రూప్‌తో కలిసి ముంబయి లోని మజాగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ నిర్మించిన స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన జలాంత ర్గామి ఐఎన్ఎస్ వేలా నావిక దళంలోకి ముంబైలోని నావల్ డాక్‌యార్డ్‌లో చీఫ్ ఆఫ్ నేవల్ స్టాఫ్ అడ్మిరల్ కరంబీర్ సింగ్ సమక్షంలో జలప్రవేశం చేసింది. భారత రెండో అణు జలాంతర్గామి ‘ఐఎన్ఎస్ అరిఘాత్’ 2024 ఆగస్టు 29న నౌకాదళంలో చేరింది. అలా కల్వరిని భారత నౌకాదళంలో ప్రవేశ పెట్టబడిన డిసెంబర్ 8న భారత నావికా దళం జలాంతర్గామి దినంగా జరుపు కుంటుంది.

# సాహిత్య ఉద్యమంలో చలసానిది ప్రత్యేక స్థానం



చలసాని ప్రసాద్ ప్రముఖ కవి, రచయిత, విమర్శకులు. ఆయన విప్లవ రచయితల సంఘం వ్యవస్థాపక సభ్యులు. విప్లవ రచయితగా, ప్రజా ఉద్యమాలను సమర్థించే కార్యకర్తగానే ఆయన జీవిత మంతా గడిపారు. ఉద్య మాల అణచివేతపై గళమెత్తారు. ఈ క్రమంలో అనేక సార్లు జైలుకు వెళ్లారు. విరసం ప్రస్థానంలో చలసానిది చెరగని ముద్ర. చలసాని ప్రసాద్ స్వస్థలం కృష్ణా జిల్లా లోని భట్ల పెనుమర్రు. డిసెంబరు 8, 1932 న కృష్ణానదీ తీరంలోని చల్లపల్లి దగ్గరిలో నాదెళ్ళవారి పాలెంలో జన్మించారు. విరసం స్థాపనలో ఆయనది కీలకమైన పాత్ర. అత్యవసర పరిస్థితి కాలంలో ఆయన జైలుకు వెళ్లారు. నమ్మిన విప్లవ సిద్ధాంతానికి కట్టుబడిన ఆయన పలుమార్లు జైలు జీవితం అనుభ వించారు. కవిగా, రచయితగా, విమర్శకుడిగా ఆయనకు మంచి పేరుంది., కొడవటి గంటి కుటుంబ రావు, రావిశాస్త్రి, కెవిఆర్‌లతో ఆయనకు సన్నిహిత సంబంధా లుండేవి. పలు గ్రంథాలను ఆయన సంకలనం చేశారు. శ్రీశ్రీ సాహిత్యంపై ఆయనకు ఎనలేని పట్టు ఉండేది. సాంస్కృతిక, సాహిత్య ఉద్యమాల్లో ఆయన ముఖ్యమైన భూమిక పోషించారు చలసాని ప్రసాద్. విప్లవ సాహిత్యోద్యమంలో ఆయన చివరి శ్వాస వరకు పాల్గొంటూ వచ్చారు. కమ్యూనిస్టు కుటుంబంలో జన్మించిన ఆయన చివరి వరకు కమ్యూనిస్టుగానే కొనసాగారు. కమ్యూనిస్ట్ ఉద్యమంలో కీలక పాత్ర వహించిన చలసాని ప్రసాద్.. నమ్మిన సిద్ధాంతాలకోసం చాలా మందితో విభేదించారు. కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో ఉన్నారు. ఎమర్జన్సీ కాలంలో చలసాని ప్రసాద్ జైలు శిక్ష అనుభవించారు. సాహితీ విమర్శకుడుగా ఎందరికో స్ఫూర్తి నిచ్చారు. విప్లవ రచయితల సంఘం స్థాపనలో శ్రీశ్రీతో కలిసి పనిచేశారు. ప్రజా ఉద్యమాల అణిచివేతలపై జీవితకాలం పోరాడారు. ఎన్నోసార్లు జైలు జీవితం గడిపాడు. శ్రీశ్రీ, రంగనాయకమ్మలకు చలసాని అత్యంత సన్నిహితులు. ఆయన విశాఖపట్నం ఎ.వి.ఎన్ కళాశాల నుంచి రాజనీతి శాస్త్రం అధ్యాపకునిగా పదవీ విరమణ చేశారు. హెచ్.బి.కాలనీ, విశాఖ పట్నంలోని ఆయన గృహంలో అనేక 20 వేలకు పైగా పుస్తకాలు ఉన్నాయి. అందులో ఎక్కడా లభించని అరుదైన పుస్తకాలు ఉన్నాయి. ఆయన అనేక విషయాలలో లోతుల వరకు చర్చించేవారు. ఆయన వద్ద ఉన్న పుస్తకాల ఆధారంగా ఎందరో పీహెచ్‌డీలు చేశారు.

ఆయన వామపక్ష భావజాలం కలిగి ఉన్నప్పటికీ విశ్వనాథ సత్య నారాయణ సాహిత్య సమా వేశాలకు ఎప్పుడూ హాజరయ్యే వారు. ఆయనకు రచలనంటే ఆసక్తి ఎక్కువ. పధ్నాలుగేళ్లు కష్టపడి ఇరవై భాగాలుగా శ్రీశ్రీ సాహితీ సర్వస్వాన్ని ప్రచురించినా, అదే తరగని ఉత్సాహంతో రావిశాస్త్రి, కొడవటిగంటి కుటుంబరావుల సాహిత్య మంతటినీ సంపుటాలుగా వెలువరించినా అది చలసానికే చెల్లింది. కృష్ణా జిల్లా లోని ఓ సాధారణ కుటుంబంలో జన్మించిన చలసాని ప్రసాద్ బాల్యం నుంచి కమ్యూనిస్టు ఉద్యమాన్ని చూస్తూ, ఆస్వాదిస్తూ పెరిగారు. తెలంగాణా సాయుధ పోరాటంలో ఆయన కుటుంబం ప్రత్యక్షంగా పాలుపంచుకుంది. కమ్యూనిస్టు కుటుంబంలో పుట్టి మార్క్సిస్టుగా పెరిగి, విప్లవ రచయితగా స్థిరపడ్డ చలసాని జీవితం ఎన్నో ప్రత్యేకతల సమాహారం. సాహిత్య రంగంలో ఆయన కృషి ఎన్నదగినది. సాహిత్యోద్యమాల నిర్మాణంలో గత అర్ధ శతాబ్దంలో ఆయన కీలక పాత్ర పోషించారు. విరసం వ్యవస్థాపకత్వంలో ఆయనది ప్రధానమైన పాత్ర. ఆయన పేరు ఎవరు ప్రస్తావించినా విరసం ప్రసాద్ అంటారు. విరసం దాదాపుగా ఆయన ఇంటిపేరై పోయింది. ప్రసాద్ సాహితీ సృజన తక్కువేమీ కాదు. కవిత్వం, వ్యాసాలు రాశారు. అవసరమై నప్పుడల్లా సామాజిక, రాజకీయ అంశాల మీదా రాశారు. అయితే ఉద్యమ జీవులందరికి లాగే తన సృజనాత్మక శక్తిని ప్రోది చేసుకుని, పదిల పరచుకుని ఆ రంగంలో కీర్తి సంపాదించాలన్న దుగ్ధ ఆయనకే నాడూ లేదు. 1970లో విరసం ఏర్పడినప్పటి నుంచి కార్యవర్గ సభ్యులుగా ఉన్నారు. 1985 నుంచి 88 వరకు మూడేళ్ల పాటు విరసానికి కార్యదర్శి. 1998 నుంచి 2002 వరకు అధ్యక్షులు. అయినా ఆయన సాహిత్యోద్యమంలో తనను తాను కార్యకర్తగానే పరిగణించే వారు. సాహితీ రంగం కూడా ఆయనను అదే దృష్టితో చూసింది. తొమ్మిదో తరతి విద్యార్థిగా ఉన్నప్పుడు 1947 “నవయుగ” సంచికలో “ఓ విద్యార్థి సోదరుడా, సమ్మెయే మన ఆఖరి ఆయుధమోయ్” అన్న పాటతో మొదలు పెట్టి కవిత్వం, సాహిత్య విమర్శ, ముందు మాటలు, సాహిత్య, రాజకీయ అంశాల మీద వ్యాసాలు దండిగానే రాశారు. చాలా కాలం పాటు ఒకటి రెండు అనువాదాలు తప్ప స్వతంత్ర రచనలుగా ప్రచురించడం మీద ఆయన దృష్టి ఎన్నడూ లేదు. 2008లో “సాహిత్య వ్యాసాలు”, 2010లో “చలసాని ప్రసాద్ రచనలు” వెలువడ్డాయి. ఇంగ్లీషును ఎదిరించి నిలిచిన భాష తెలుగు. ఏ భాషా పదాన్నయినా తనలో కలుపుకొని ఎదిగే శక్తి తెలుగుకు ఉంది. అందుకే తెలుగు అజరామరం. తెలుగు భవిష్యత్తు ఉజ్వలం అని చలసాని చెపుతుండే వారు. చలసాని జూలై 25, 2015న విశాఖపట్టణం లోని తన నివాసం లోనే గుండెపోటుతో తుది శ్వాస విడిచారు.

# బుద్ధుడి బోధనలు ప్రపంచ శాంతికి గొడుగులు



డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

భౌద్ధ మతస్థులు ప్రతి ఏట నిర్వహించుకునే ప్రధాన ఉత్సవాల్లో “బోధి దినోత్సవం” కూడా ఒకటిగా పరిగణించబడుతున్నది. 08 డిసెంబర్ పుణ్య గడియల్లో గౌతమ బుద్ధుడు లేదా యువరాజు సిద్ధార్థ గౌతముడు జ్ఞానోదయం అయిన శుభ వేళలుగా బోధి దినోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహిస్తారు. సిద్ధార్థుడు జ్ఞానోదయం పొంది గౌతమ బుద్ధుడిగా మారిన రోజుగా ఈ దినోత్సవానికి గుర్తింపు ఉంది. యువ రాజు సిద్ధార్థుడు ప్రజల నిజ జీవితాల్లో ఎదురవుతున్న కష్టాలు, దుఃఖాలు, పీడలు, అనారోగ్యాలు, బాధలు, కడు పేదరికం, మరణాలను చూసి చలించి జీవిత పరమార్థాన్ని తెలుసుకోవడానికి రాజ్య కాంక్షను వదిలి భారత్‌లోని బుద్ధ గయా ప్రాంతంలో బోధి వృక్షం నీడన తపస్సు చేయడం, జ్ఞానోదయం పొందడం జరిగింది. మానవ జీవితంలోని బాధలకు సమాధానంగా ‘నిర్వాణ’ స్థితికి చేరటం, బుద్ధుడి “ఆదర్శ ఎనిమిది జీవన మార్గాల(నోబుల్ యైత్‌ఫోల్డ్ పాథ్)ను సూచించడంతో ప్రజలు బాధలకు దూరంగా మానసిక ప్రశాంతతతోఎదుగుతూ సంతోషమయ జీవితాలను గడపాలని బోధించారు. బోధి దినోత్సవ సంబరాలు: బోధి దినం ప్రారంభం 2,500 ఏండ్ల క్రితం ప్రారంభమైందని చరిత్ర పేర్కొంటున్నది. బోధి దినోత్సవం రోజున ఆత్మ విమర్శ చేసుకోవడం, ధ్యానం చేయడం, నూతన తీర్మాణాలను చేసుకోవడం, బుద్ధుడి బోధనలను మననం చేసుకోవడం, వాటిని తూచా తప్పకుండా పాటించడానికి సంకల్పం తీసుకోవడం లాంటి సత్కార్యాలు చేపడతారు. వివేకం, కరుణ, భౌతిక సుఖాల పట్ల నిరాసక్తత లాంటివి మనిషి సుఖ జీవనానికి సోపానాలుగా ఉపకరిస్తాయని నమ్ముతారు. ఆధ్యాత్మిక ఆచారాలను పాటించిన మానవ జీవితాల్లో సానుకూల శక్తి ఉద్భవించి జ్ఞానోదయ స్థితికి చేరుతారని, మరో దుఃఖమయ జీవితం లేకుండా మోక్షం సిద్ధిస్తుందని బుద్ధుడు బోధించాడు. గౌతమ బుద్ధుడు బోధించిన ఎనిమిది సన్మార్గాలు: గౌతమ బుద్ధుడి బోధనల్లో ఎనిమిది జీవన మార్గాలు సూచించడం జరిగింది. సన్మార్గ దర్శనం/ఆలోచనలు(రైట్ వ్యూవ్), సరైన తీర్మాణాలు తీసుకోవడం(రైట్ రెజొల్యూషన్స్), సుభాషణ గుణం(రైట్ స్పీచ్), సత్కార్యాలను చేయడం(రైట్ ఆక్షన్), సక్రమ మార్గంలో జీవనోపాధులు పొందడం(రైట్ లైవ్‌లీవుడ్), సరైన కృషి చేయడం(రైట్ ఎఫర్ట్), మానసిక ఆలోచనలు చక్కగా ఉండడం(రైట్ మైండ్‌ఫుల్‌నెస్), చక్కటి ఏకాగ్రతను పొందడం(రైట్ కాన్‌సెంట్రేషన్) అనే ఎనిమిది జీవన సూత్రాలను గౌతమ బుద్ధుడు బోధించడం జరిగింది. అందరు ఆనందంగా, ఆరోగ్యంగా, పవిత్ర భావనలతో బాధలకు దూరంగా జీవించాలని బుద్ధుడు ఆకాంక్షించాడు. మనిషి కర్మకు కారణం మనస్సు మాత్రమే. మనం ఏ విధంగా ఆలోచిస్తే, ఆచరణలో పెడితే, అదే తప్పక జరుగుతుంది. ఆనందానికి మార్గం లేదు. ఆనందంగా ఉండడమే ఓ ఉత్తమ మార్గం అని గౌతముడు బోధించాడు. పంచడంతో ఆనందం తరిగి పోదని గుర్తుంచుకోవాలి. ఒక కొవ్వత్తి వేల కొవ్వత్తులను వెలిగించినట్లు ఒక మహోన్నతుడు వేల మందికి జీవనానంద రహస్యాలను బోధించగలడు.

# గ్రామ అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్సీ ని కోరిన గ్రామస్తులు



యాదాద్రి భువనగిరి /తుర్కపల్లి : డిసెంబర్ వుదయం ప్రతినిధి : తుర్కపల్లి మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన గ్రామ మాజీ సర్పంచ్ కొమ్మిరి శెట్టి నర్సింలు ఆధ్వర్యంలో గ్రామ అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ను కోరారు. ఈ సందర్భంగా శనివారం ఆయన ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు .గ్రామంలో స్కూల్ ఆడిటోరియం ,అదనపు నాలుగు తరగతి గదులు, ఎస్సీ కాలనీలో మినీ ఫంక్షన్ హాల్ ఏర్పాటు చేయాలని కోరినట్టు తెలిపారు. ఆయన వీటిపై సానుకూలంగా స్పందించినట్లు తన నిధుల నుండి ఇస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు

# ఏజెన్సీ గ్రామా ప్రజలకు బస్సు సౌకర్యం కల్పించాలి.

**-ఎమ్మెల్యే కోరం కనకయ్యకు వినతి పత్రం సమర్పించిన రామచంద్రపురం గ్రామస్తులు.**



బయ్యారం డిసెంబర్07(వుదయం ప్రతినిధి): ఇల్లందు బస్ డిపో నుండి మహబూబాబాద్ జిల్లాకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు బయ్యారం మండలం రామచంద్రపురం గ్రామ ప్రజలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ ఇల్లందు బస్ డిపో నుండి రొంపేడు, రామగుండలా, రాంచంద్రపురం, నారాయణ పురం, కంబాలపల్లి, కోత్తురు, బీమ్లా తండా, కారుకొండ, బయ్యారం కూ మహబూబాబాద్ జిల్లా వరకు ఏజెన్సీ గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడం తో పాఠశాలలకు, కళాశాలకు వెళ్లే విద్యార్థులు, గ్రామాలకు వెళ్లడానికి ఆటోల సదుపాయం లేకపోవడంతో ప్రయాణికులు కూడా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. వెంటనే ఇల్లందు బస్ డిపో నుండి మహబూబాబాద్ కు బస్సు సౌకర్యం కల్పించి విద్యార్థుల ప్రయాణికుల బాధను తీర్చాలని ఎమ్మెల్యే కోరం కనకయ్యకు విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ తప్పకుండా ఈ గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించే విధంగా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మూల మధుకర్ రెడ్డి, తిరుమల ప్రభాకర్ రెడ్డి, సనప సోమేశ్, మంగీలాల్, బానోత్ స్వామి, తారాచంద్ బానోత్ జామ్లా, గంగారపు బిక్షపతి, తోగరు కొమురయ్య, బానోత్ కోటి, రాము, కోరం చిన్న జంపయ్య, చీమల రాజు, మాజీ సర్పంచులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## యువజన కాంగ్రెస్ గద్వాల జిల్లా అధ్యక్షుడు ఆర్.తిరుమలేష్ ని కలిసి శుభాకాంక్షలు తెలిపిన నందిన్నె గ్రామం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సప్లయర్ ఆంజనేయులు నందిన్నె మహాదేవ్,




(గద్వాల డిసెంబర్ 07వుదయం ప్రతినిధి) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నేషనల్ యువజన కాంగ్రెస్ ఎన్నికల భాగంగా జరిగినటువంటి ఎన్నికలలో జోగులాంబ గద్వాల జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఆర్ తిరుమలేష్ ఇతర కార్యవర్గ సభ్యుల విజయోత్సవ సభ ప్యారడైజ్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన విజయోత్సవ సభలో కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు, సీనియర్ నాయకులు నూతనంగా ఎన్నికైనగద్వాల జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడి ఆర్ తిరుమలేష్ ను కేటి దొడ్డి మండలం నందిన్నె గ్రామం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు నందిన్నె గ్రామం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సప్లయర్ ఆంజనేయులు అండ్ నందిన్నె మహదేవ్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడి ఆర్ తిరుమలేష్ ను శనివారం రోజు ప్యారడైజ్ ఫంక్షన్ హాల్ లో మర్యాదపూర్వకంగాకలుసుకున్న నందిన్నె గ్రామం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు సప్లయర్ ఆంజనేయులు నందిన్నె మహాదేవ్ శాలువా పుష్పగుచ్ఛంతోయువజన కాంగ్రెస్ అధ్యక్షుడి ఆర్ తిరుమలేష్ ను సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సప్లయర్ ఆంజనేయులు మహాదేవ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం నీకు ఇచ్చినఈ అవకాశాన్ని ప్రజలందరికీ ఉపయోగపడే విధంగా బాధ్యతలు నిర్వహిస్తు ప్రభుత్వం నిర్వహిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకపోవడంతో పాటు యువతరానికి మేలు జరిగే విధంగా కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చేందుకు కృషి చెయ్యాలని కోరుకున్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీసీనియర్ నేతలు నందిన్నె మాజీ ఎంపీటీసీ గీత ఆంజనేయులు, నందిన్నె మహాదేవ్, చింతలకుంట జనార్ధన్, పరుశరామ్, గోకారప్ప, కృష్ణ, రంగస్వామి,తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా ప్రారంభమైన జిల్లా సిపిఎం మూడో మహా సభలు...

మన దేశం, రాజ్యాంగం ప్రమాదంలో ఉంది

: సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్











కుత్బుల్లాపూర్, డిసెంబర్ 7,(వుదయం ప్రతినిధి ),సిపిఎం పార్టీ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మూడో మహా సభలు ప్రగతినగర్ లో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి సీతారాం ఏచూరి సహా పలువురు నాయకుల చిత్ర పటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ నేడు ప్రపంచ వ్యాప్తంగా కొనసాగుతున్న సంక్షోభం తాత్కాలికమే అని పెరుగుతున్న దారిద్ర్యం, ఆర్థిక సంక్షోభనికి పెట్టుబడి దారి విధానాలు పరిష్కారం చూపలేకపోతున్నాయని ఓ వైపు ఆకలితో పేదలు అల్లడిపోతుంటే మరో వైపు సంపన్నులు పెరిగిపోతున్నారని, ఇలాంటి పరిస్థితులను చూస్తుంటే ప్రజల్లో పోరాటం చేయాలని కాంక్ష పెరుగుతుంది అన్నారు. శ్రీలంకలో ప్రజనాడి పట్టుకుని సమస్యలపై పోరాటం చేయడం వల్లనే అక్కడ వామపక్ష ప్రభుత్వం ఏర్పడిందని కమ్యూనిస్టులు లేని పోరాటాలు సరైన మార్గంలో జరగవని దేశంలో పెద్ద ఎత్తున జరిగిన రైతు ఉద్యమానికి నాంది పలికింది కూడా కమ్యూనిస్టులే అని గుర్తు చేశారు. ప్రపంచ వ్యాప్తంగా పోరాటం చేసే వాతావరణం పెరిగిందని బిజెపి హయాంలో రైతులపై దాడులు, రైతులకు వ్యతిరేకంగా చట్టాలు చేయడం, హక్కులపై తీవ్రమైన దాడులు చేయడం వంటి కార్యక్రమాలు బిజెపి చేసిందని కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్ లను తీసుకొచ్చారని బిజెపి అధికారంలోకి వచ్చాక గత కార్మిక వ్యతిరేక విధానాలను వేగంగా అమలు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని దేశాన్ని తాకట్టు పెట్టి, దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టే ప్రయత్నం తీవ్రతరం అయ్యిందని ధరల పెరుగుదలతో సమాన్యులపై దాడి చేస్తున్నారు అన్నారు. దేశం ప్రమాదంలో ఉందని కాపాడాల్సిన బాధ్యత కమ్యూనిస్టులపై ఉందని, పోరాటాలు చేయాలని ప్రజల్లో బిజెపి పై అసంతృప్తి పెరుగుతుందని ప్రజల్ని పోరాటాల్లోకి రాకుండా చేస్తున్న కుట్రలని బహిర్గతం చేయాలని బిజెపి మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని మతం, మతోన్మాదానికి తేడా తెలియడం లేదని నేటి రాజకీయాలు, ప్రభుత్వాలు మతాల ఆధారంగానే సాగుతున్నాయి అని, ఓట్లు కూడా మతం ఆధారంగానే అడుగుతున్నారని సున్నితమైన అంశాలతో ప్రజలు కొట్టుకుంటూ ఉంటే బిజెపి తన పని తాను చేసుకుంటూ పోతుందని బిజెపి హిందూ, ముస్లింల మధ్య విద్వేషాలను సృష్టిస్తుంది అని, మతోన్మాద వ్యతిరేక పోరాటాన్ని ముమ్మరం చేయాలి అన్నారు. మనుధర్మ శాస్త్రమే రాజ్యాంగం అని, బిజెపి రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తుందని రాజ్యాంగంలో ఉన్న 5 మౌలిక హక్కులను ధ్వంసం చేసేలా బిజెపి పాలన ఉందని ఈ హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఏడాది కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది మహిళలకు ఫ్రీ బస్ సౌకర్యం తప్ప ఒక్క హామీ నెరవేర్చలేదని రుణమాఫీ కానీ రైతులు ఇంకా వేల సంఖ్యలో ఉన్నారని కార్మికుల వేతన సవరణ జీఓ ఇచ్చిన ప్రభుత్వం అమలును మరిచిందని కాంగ్రెస్ ప్రభుత్వం పద్ధతి మార్చుకోవాలి అన్నారు. ఇందిరా పార్కు వద్ద ధర్నాకు అనుమతిని ఇచ్చి అక్కడికి వచ్చే వారిని అరెస్టు చేయడమే ప్రజాస్వామ్యమా? అని ప్రశ్నించారు. నాడు కేసీఆర్ లాగే నేడు రేవంత్ రెడ్డ్ కూడా తాను ఏ జిల్లాకు వెళ్తే అక్కడ వామపక్ష నాయకులను అరెస్ట్ చేయడం సరికాదు అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డిజి నరసింహారావు, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కార్యదర్శి పి.సత్యం, సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శులు సభ్యులు కోమటి రవి, జై చంద్రశేఖర్, ఏ.అశోక్, ఎం.వినోదం, సిహెచ్ కృష్ణారావు, జిల్లా కమిటీ సభ్యులు వెంకట్రామయ్య, వరప్రసాద్, లక్ష్మణ్, రాజశేఖర్, రాథోడ్ సంతోష్, ఎం నరేష్, శంకర్, సబిత, సృజన, ఎన్ శ్రీనివాస్, జి.శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

# దశాబ్దాల క్రితం నిర్మించబడిన నిజాంసాగర్ ప్రాజెక్టు ఒక అద్భుతం

## .. మంత్రి జూపల్లి కృష్ణారావు



నిజాంసాగర్, అక్టోబర్ 07 (వుదయం ప్రతినిధి): ఎన్నో దశాబ్దాల క్రితం ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేని సమయంలో నిర్మించబడిన నిజాంసాగర్ ప్రాజెక్టు ఒక అద్భుతం అని ఎక్సైజ్ మరియు పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారంజుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు ఆహ్వానం మేరకు రాష్ట్ర ఎక్సైజ్ మరియు పర్యాటక శాఖ మంత్రజూపల్లి కృష్ణారావు, జిల్లా కలెక్టర్, అధికారులతో కలిసి నిజాంసాగర్ ప్రాజెక్టును, పవర్ హౌస్ ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు ప్రాజెక్టు యొక్క విశిష్టతను మంత్రికి వివరించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ 27టిఎంసి ల సామర్థ్యం కలిగిన ఈ ప్రాజెక్టు ఏడాది పొడవునా ప్రాజెక్టు కింద ఆయకట్టుకు నీళ్లు అందించిన ఇంకా 5 టీఎంసీ లు మిగిలి ఉంటుంది అన్నారు. ఈ ప్రాజెక్టు ఎత్తైన ప్రదేశంలో, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండడం వల్ల పర్యాటకులను ఆకర్షిస్తుందని పేర్కొన్నారు. వచ్చే శాసనసభ సమావేశాల్లో టూరిజం పాలసీని ప్రవేశ పెట్టనున్నట్లు మంత్రి గారు తెలిపారు. జనవరి నుండి టెండర్లు పిలిచి పబ్లిక్ ప్రైవేట్ పార్ట్ నర్ షిప్ తో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. అదేవిధంగా ఇక్కడ 10 మెగా వాట్ల హైడల్ పవర్ ఉత్పత్తి అవుతుందని..కొన్ని సమస్యల కారణంగా పవర్ ఉత్పత్తి ఆగిపోయిందని, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కగారితో చర్చించి త్వరలోనే విద్యుత్ ఉత్పత్తి పునరుద్దరణ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు నిజాంసాగర్ మహమ్మద్ నగర్ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ రవీందర్ రెడ్డి స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతకు రుణాలు అందించాలి

## ఎంపీ మల్లు రవి





గద్వాల డిసెంబర్ 07 (వుదయం ప్రతినిధి) నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించే దిశగా బ్యాంకుల ద్వారా విరివిగా రుణాలు అందించాలని నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు దిశ కమిటీ చైర్మన్ డాక్టర్ మల్లు రవి అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశాన్ని ఆలంపూర్ శాసనసభ్యులు విజయుడు,జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ తో కలిసి నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పార్లమెంటు సభ్యులు మల్లు రవి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రభుత్వము నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. స్వయం ఉపాధి కొరకు బ్యాంకు రుణాల కోసం దరఖాస్తు చేసుకునే నిరుద్యోగులకు రుణాలను మంజూరు చేసి వారికి ఉపాధికి కల్పించేందుకు బ్యాంకర్లు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల కింద రుణాలను మంజూరు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు పరుస్తున్న పథకాలను గ్రౌండింగ్ అయ్యేలా చూడాలని బ్యాంక్ అధికారులకు సూచించారు. బ్యాంకు ఉన్నత అధికారులు రుణాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నారని, నాగర్ కర్నూల్ పార్లమెంట్ నియోజక వర్గంలో రుణమేళాలు నిర్వహించి ఎక్కువ మందికి రుణాలు అందించేందుకు బ్యాంకర్లు కృషి చేయాలన్నారు. ఆర్థిక సంవత్సరం ముగియడానికి గడువు సమీపిస్తున్నందున లక్ష్య సాధనలో వెనుకబడిన బ్యాంక్ ప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకొని వివిధ పథకాల క్రింద కేటాయించిన యూనిట్లు మంజూరు అయ్యేలా చూడాలని సూచించారు. ఇప్పటి వరకు ఎన్ని యూనిట్లు మంజూరు అయ్యాయి, పెండింగ్ లో ఎన్ని ఉన్నాయో అడిగి తెలుసుకొన్నారు. జిల్లాలోని బ్యాంకులు అవసరమైన రుణాలు అందచేస్తున్నాయా? లేదా? అనే విషయాలను లీడ్ బ్యాంకు మేనేజర్ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఇందులో భాగంగా జిల్లాలో నిరుద్యోగ యువతకు కేంద్ర ప్రభుత్వ పథకాలైన ముద్ర, పిఎం ఈజిపి, పీఎం విశ్వకర్మ, పీఎం స్వానిధి, ఎస్ఎంఈ పథకాల ద్వారా ఉపాధి కల్పించే విధంగా యువతకు విరివిగా రుణాలను అందించాలన్నారు. అర్హులైన వారికి రుణాలు అందించి వారికి ప్రోత్సాహం అందించాలని సూచించారు. ఈనెల 21న వనపర్తిలో రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా యువతకు స్వయం ఉపాధి కల్పించే దిశగా వృత్తి నైపుణ్యం, రుణ మేళా, జాబ్ మేళాలు నిర్వహించి స్వయం ఉపాధి కల్పించినట్లు తెలిపారు. ఎస్సీ ,ఎస్టీ, బీసీ, మైనారిటీ రుణాలకు సంబంధించి గ్రౌండ్ చేసిన రుణాలకు బ్యాంకుర్లు వెంటనే యుటిలైజేషన్ సర్టిఫికెట్ జారీ చేయాలని సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి కేటాయించిన లక్షాల మేరకు విరివిగా రుణాలను మంజూరు చేయాలని ఆదేశించారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలు చేస్తున్న పథకాలపై శాఖల వారిగా సమీక్షించారు. ఇందులో భాగంగా వ్యవసాయ శాఖ, వైద్యశాఖ, విద్యాశాఖ, జిల్లా శిశు సంక్షేమ శాఖ, మిషన్ భగీరథ, ఎస్సీ ఎస్టీ బీసీ శాఖలు, పంచాయతీ శాఖ, పౌర సరఫరాల శాఖ, మార్కెటింగ్ శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ, తదితర శాఖలు అమలు చేస్తున్న పథకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా విద్యా శాఖలో మధ్యాహ్న భోజనం, పాఠశాలలో మరుగుదొడ్లు, త్రాగునీరు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఫుడ్ పాయిజన్ జరగకుండా అధికారులు ఎప్పటికప్పుడు వసతి గృహాలలో తనిఖీలు నిర్వహించాలన్నారు. మిషన్ భగీరథ నీటిని అన్ని పాఠశాలకు అందించాలని అన్నారు. ప్రభుత్వ పథకాలన్నీ ప్రజలకు అందే విధంగా అధికారులు విశేష కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, డి సి సి బి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కేశవులు,మాజీ జెడ్పీ చైర్ పర్సన్ సరిత, జిల్లా వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, బ్యాంకర్లు, కౌన్సిలర్లు దిశ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు

# జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్, ఐఏఎస్. ని మర్యాదపూర్వకంగా కలసిన డిక్కీ సమన్వయ కర్త నల్ల శ్యామ్



జగిత్యాల జిల్లా ప్రతినిధి డిసెంబర్ 07 ( వుదయం ) : దళిత్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సంస్థ జగిత్యాల జిల్లా సమన్వయ కర్తగా రాపల్లి గ్రామానికి చెందిన నల్ల శ్యామును నియమిస్తున్నట్టు నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నీ శనివారం మర్యాదపూర్వకంగా నల్ల శ్యామ్ కలిసి నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం డిక్కీ కి సంబంధించిన విషయాలపై చర్చించడం జరిగింది . అనంతరం కలెక్టర్ డిక్కీ సమన్వయకర్త నల్ల శ్యామును అభినందించి ప్రశంసించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనిషి ఎదుగుదలలో ముఖ్య భాగమైన సాంఘిక, రాజకీయ, ఆర్థిక రంగాలలో ఒకటైన ఆర్థిక రంగంలో, డిక్కీ సంస్థ గత 20 సంవత్సరాలుగా పద్మశ్రీ మిలింద్ కాంబ్లి గారు 2005 సంవత్సరంలో మహారాష్ట్రలోని పూణే వేదికగా స్థాపించడం జరిగింది. ఆ తర్వాత ఐదు సంవత్సరాల తర్వాత, అనగా 2010లో, పద్మశ్రీ రవి కుమార్ నర అప్పుడు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లోని ఈ సంస్థను పరిచయం చేయడం జరిగింది అని తెలిపారు. అనంతరంఇలాంటి గొప్ప సంస్థలో నేను సేవ చేయడానికి అవకాశం పొందడం నాకు ఎంతో సంతోషం. నన్ను నమ్మి ఇంత గొప్ప బాధ్యతను నా మీద ఉంచిన పద్మశ్రీ రవి కుమార్ నరకి, జాతీయ అధ్యక్షులు డిక్కీ, రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ దాసరి మేడమ్కి, రాష్ట్ర కోఆర్డినేటర్ నారాయణ దాసరి కి, మరియు రాష్ట్ర ముఖ్య కార్యవర్గానికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. మీ నమ్మకాన్ని ఎట్టి పరిస్థితుల్లో వమ్ము చేయకుండా,

జిల్లాలోని అన్ని విభాగాల అధికారులతో సమన్వయం చేసుకుంటూ జిల్లా లోని దళితుల ఆర్థిక అభివృద్ధి కొరకు నా వంతు బాధ్యతను నిర్వర్తిస్తానని అని అన్నారు.

# బీర్ల ఐలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలి

## కాంగ్రెస్ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ -వెంకటేష్ యాదవ్



యాదాద్రి భువనగిరి /తుర్కపల్లి : డిసెంబర్ వుదయం ప్రతినిధి :బడుగు బలహీన వర్గాల నాయకుడిగా ఆలేరు అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు బీసీ కోటాలో మంత్రి పదవిని ఇవ్వాలని కాంగ్రెస్ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ దొనకెన వెంకటేష్ యాదవ్ అన్నారు. శనివారం తుర్కపల్లి మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం హయాములో ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరంతరం ఎండ కడుతూ ప్రజల్లో మమేకమై బిర్ల ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేశారని అన్నారు.

ఆలేరు అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న ఆయనకు మంత్రి పదవి ఇవ్వాలని కోరారు

# మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

## మంత్రి సుభాష్

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వు దయం బ్యూరో. బోడపాటి వరప్రసాద్ విద్యార్థులు చిన్ననాటి నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వానంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం శనివారం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మెగా పేరెంట్స్ సమావేశం కె.గంగవరం మండలం పామర్రు, కోటిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో జరిగిన సమావేశాల్లో మంత్రి సుభాష్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలో నెలకొన్న సమస్యలు తక్షణం పరిష్కరించి, మంచి ఫలితాలు సాధన కోసం రాష్ట్ర ప్రభుత్వం మెగా పేరెంట్స్ డే సమావేశాలు నిర్వహించిందని తెలిపారు. నేటి విద్యార్థులు ఆధునిక టెక్నాలజీని వినియోగిస్తూ చెడు మార్గంలో నడుస్తున్నారని, విద్యార్థులు నడవడిక పట్ల తల్లిదండ్రులు, తోటి విద్యార్థులు గమనించి ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలన్నారు. టీనేజ్ లో ఉన్న పిల్లలను ట్రాప్ చేసేందుకు స్కూల్ ల వద్ద కొంతమంది ఆకతాయి పిల్లలు ఉంటున్నారని, వారి పట్ల జాగ్రత్త వహించాలన్నారు. పిల్లలు ఎవరితో స్నేహం చేస్తున్నారనే విషయాలను శ్రద్ధగా గమనించాలన్నారు. విద్యార్థులకు ట్యాబ్ లు అందుబాటులోఉన్న నేపథ్యంలో వాటిని ఎలా వినియోగిస్తున్నారనే విషయం కూడా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గమనించాలన్నారు. ప్రతి స్కూల్లో ఫిర్యాదు బాక్సులు ఏర్పాటుచేసి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. రామచంద్రపురం నియోజవర్గంలో ఉన్న 18 మంది మహిళా పోలీసులను ఆయా స్కూళ్ళ వద్ద పర్యవేక్షణ నిమిత్తం ఉంచి విద్యార్థుల యొక్క ప్రవర్తనను గమనించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ముఖ్యంగా 8,9,10 తరగతులు చదువుతున్న విద్యార్థుల్లో రక్తహీనత వచ్చే అవకాశం ఉందని, ఆ సమస్యను అధిగమించేందుకు మంచి పోషకాహారం తీసుకోవాలనిఅన్నారు.




విద్యార్థులకు చదువుతోపాటు ఆరోగ్యం, ఆట పాటలు అవసరమని అన్నారు. మానసిక ఒత్తిడికి గురి కుండావిద్యార్థులు ధ్యానం చేసుకొని, మంచి ఆరోగ్య అలవాట్లు అలవాటు చేసుకోవాలన్నారు. విద్యార్థి దశలోనే దురల వాట్లకు దూరంగా ఉండాలని హితవు పలికారు. నేటి యువత సెల్ఫోన్, వాట్సాప్, యూట్యూబ్ వంటి సామాజిక మాధ్యమాలకు బానిసలు అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలలో 75% హాజరు ఉన్న విద్యార్థులకు తల్లికి వందనం పథకం అమలు చేస్తామన్నారు. అలాగే మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థుల ఆరోగ్యానికి అనుగుణంగా మంచి మెనూ ఏర్పాటు చేస్తామని అన్నారు. పలువురు తల్లిదండ్రులు మాట్లాడుతూ హైస్కూల్ ప్రాంగణం ఆక్రమణకు గురైందని, అలాగే పందుల బెడద నుంచి తప్పించాలని మంత్రి సుభాష్ ను కోరారు. తక్షణం ఆ సమస్యలను పరిష్కరించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓ, స్థానిక ఎస్సైలను ఆదేశించారు. ఈ సమావేశంలో రామచంద్రపురం నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, ఎంఈఓ నాగరాజు, పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్, ప్రముఖ వైద్యులు కాదా వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. తొలుత సరస్వతి దేవి, భారతమాత విగ్రహాలకు మంత్రి సుభాష్ పూలమాలలు వేసి సభను ప్రారంభించారు. డ్రగ్స్ వద్దు బ్రో.. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలంటూ స్థానిక ఎస్సై ఆలీ భాష విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విద్యార్థులుకు మంత్రి సుభాష్ చేతుల మీదుగా పుస్తకాలు, బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారులి.

# ఆదివాసీల ఆత్మ బంధువుకు ఘన నివాళులు అర్పించిన ఏజేఏసి..

- పెసా చట్ట రూపకర్తను స్మరించుకున్న ఆదివాసీలు..
- ఇందిరమ్మ ఇళ్ళు ఆదివాసీలకే కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన ఏ జే ఏ సి..
- పోరుబాట పడతామని ఆదివాసీ సంఘాల హెచ్చరిక..
- పాలకుల విధానాలతోనే ఆదివాసీల అభివృద్ధి లో అస్థిరత..
- ఏజెన్సీ సంపదను కొల్ల గొడుతున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు..
- వలస వాదులు ఏజెన్సీ వదిలి వెళ్లి పోవాలి..



వెంకటాపురం నవంబర్ 07 ( వుదయం ప్రతినిది) భగవంతుడు సృష్టించినభూమి, అడవికి, ఆదివాసీలకు మధ్యను సర్కార్ ఎవరని నిలదీసిన బ్రహ్మ దేవ్ శర్మ ఐ ఏ ఎస్ 9వ వర్ధంతి సభ ఆదివాసీ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. పూనెం ప్రతాప్ అధ్యక్షతన ఈ వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా ఆదివాసీ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు బీడీ శర్మ కు ఘన నివాళులు అర్పించారు. ఆదివాసీల ఆత్మ బంధువు, ఆదివాసీ హక్కుల గొంతుక బీడీ శర్మ అని ఆదివాసీ నాయకులు అన్నారు. బీడీ శర్మ ఆదివాసీల పక్షాన సుదీర్ఘ పోరాటం చేశారని అన్నారు. ఆదివాసీల స్వయం పాలన కోసం నాటి కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఆదివాసీల ఆత్మ బంధువును కోల్పోవడం బాధాకరం అన్నారు. మొట్టమొదటి ఎస్సి ఎస్టీ కమిషన్ చైర్మన్ గా పని చేసి ఒక్కరూపాయి జీతం తీసుకున్న గొప్ప వ్యక్తి అన్నారు. ఆదివాసీల హక్కుల కోసం పోరాటం చేసే క్రమంలో ఎన్నో దాడులు రాజ్యం నుండి ఎదురుకున్నట్లు వారు తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీ సంపదను కొల్లగొడుతూ వారి ఉనికి లేకుండా చేస్తున్నారని ఎన్నో ప్రజా పోరాటాలు చేశారని అన్నారు. దేశానికీ స్వాతంత్రం వచ్చిన తర్వాత ఈ దేశంలో ఆదివాసీలు స్వేచ్ఛ, స్వాతంత్రం కోల్పోయారని బీడీ శర్మ పదే పదే మాట్లాడినట్టు నాయకులు గుర్తు చేశారు . బీడీ శర్మ కు ఆదివాసీ సమాజం ఎంతో రుణపడి ఉంద న్నారు. బీడీ శర్మ అడుగు జాడల్లో ఆదివాసీ సమాజం నడవాలని నాయకులు పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీల పైన దమన కాండ కొనసాగిస్తూ ఏజెన్సీ సంపదను దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వందల సంవత్సరాలుగా అడవులను, సహజ సంపదను ఆదివాసీలు కాపాడితే అభివృద్ధి పేరుతో ఏజెన్సీ ప్రాంతాన్ని వల్లకాడుగామారుస్తాన్నారని ఆదివాసీ సంఘాలు ఆరోపించారు. ఏజెన్సీ ప్రాంత విచ్చిన్నానికి గిరిజనేతర రాజకీయ పార్టీలు కుట్రలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదివాసీలు రాజకీయ పార్టీలను గ్రామాల నుండి బహిస్కరించాలన్నారు. ఆదివాసీ చట్టాల అమలు చేయాలని రాజకీయ పార్టీలు ఎందుకు మాట్లాడడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పార్టీల పేరుతో ఆదివాసీలను విడగొట్టి గిరిజన చట్టాలను అమలు కాకుండా చేస్తున్నారని మండిపడ్డారు. రాజకీయ పార్టీల కుట్రలు బయట పెట్టేందుకు ఆదివాసీ సంఘాలు త్వరలోనే ప్రజలు మధ్యకు వెళ్తునున్నట్లు ప్రకటించారు. ఇందిరమ్మ ఇళ్ళు ఆదివాసీలకు మాత్రమే కేటాయించాలన్నారు. రాజ్యాంగ విరుద్ధంగా ప్రభుత్వం వలస గిరిజనేతరులకు ఇళ్ళు కేటాయించడం తో ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. ప్రజా పాలన పేరుతో రేవంత్ రెడ్డి గిరిజన చట్టాలను తుంగలో తొక్కు తున్నట్లు మండిపడ్డారు. గిరిజన సలహామండలి ఆమోదం లేకుండా షెడ్యూల్డ్ ప్రాంతం లో వలస గిరిజనేతరులకు ఇందిరమ్మ ఇళ్ళు ఇస్తే ప్రభుత్వం పైన పోరాటం తప్పదని హెచ్చరించారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని తక్షణమే ఉప సంహారించు కోక పోతే ఆదివాసీ సంఘాలు పోరుబాట పడతాయని హెచ్చరిక జారీ చేశారు. ఆదివాసీలంతా ఎన్నికల సమయం లో కాంగ్రెస్ పక్షాన నిలబడితే, ప్రభుత్వం మాత్రం ఆదివాసీలను వంచన చేస్తోందన్నారు. వలస గిరిజనేతరులు ఏజెన్సీ వదిలి వెళ్లి పోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం లో ఏ ఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఉయిక శంకర్, జి ఎస్పీ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి, ఏ ఎన్ ఎస్ రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి, తుడుం దెబ్బ జిల్లా కార్యదర్శి సిద్దబోయిన సర్వేశ్వర్ రావు, జిల్లా నాయకులు కుచ్చింటి చిరంజీవి, జి ఎస్పీ జిల్లా అధ్యక్షులు రేగా గణేష్, కుంజ మహేష్, గోపి గోపినాథ్, మాంతయ్య, సికిందర్, తదితరులు పాల్గొన్నారు..

# మత స్వేచ్ఛకు వ్యతిరేకంగా కేసులు పెట్టడాన్ని ఖండిస్తున్నాం: పాస్టర్ బెజ్జల ప్రభాకర్



పెద్దపల్లి జిల్లా: జనవరి, 7 (వుదయం) ప్రతినిధిః పెద్దపల్లి క్రైస్తవ హక్కుల రక్షణ సమితి జిల్లా అధ్యక్షులు బెజ్జల ప్రభాకర్ పాస్టర్ మత ప్రచారంపై కేసులు నమోదు చేసిన వారిని తీవ్రంగా ఖండించారు. మార్కు సువార్త 16:15 ప్రకారం, ఏసు ప్రభువు తన శిష్యులకు "సర్వలోకమునకు వెళ్లి సర్వసృష్టికి సువార్త ప్రకటించుము'' అని ఆజ్ఞ ఇచ్చారని, ఈ ఆజ్ఞ మేరకు దైవ సేవకులు విశ్వాసులు సువార్త ప్రకటిస్తున్నారని తెలిపారు. ఆర్టికల్ 25 ప్రకారం, మత స్వేచ్ఛ ప్రతి పౌరుడికి రాజ్యాంగపరమైన హక్కు అని, దీనిని అడ్డుకునే చర్యలు రాజ్యాంగ విరుద్ధమని హెచ్చరించారు. యిర్మీయా 1:5 లో పేర్కొన్న "తల్లి గర్భములో నీవు రూపింపక మునుపే నేను నిన్ను నేర్పరచుకున్నాను"నీవు నా సొత్తుని స్వరాక్తమిచ్చి వెల కట్టి ఆయన నిన్ను నిర్మించాడు అనే వచనాన్ని ప్రస్తావిస్తూ, నీవు ఎవరో కాదు నువ్వు నా సహోదరుడివే మత ప్రచారం దేవుని ఆజ్ఞ ప్రకారమే జరుగుతోందని వివరించారు. పాపరహితుడైన ఏసు క్రీస్తు సర్వ మానవాళి కొరకు మరణించి, మరణాన్ని జయించి, తిరిగి లేచిన, ఏకైక దేవుడని, ఆయన "నేనే మార్గం, నేనే సత్యం, నేనే జీవము" (యోహాను 14:6) అని చెప్పినట్లుగా గుర్తుచేశారు.

మతాల మధ్య చిచ్చు పెట్టడం తమ ఉద్దేశం కాదని, పరలోక రాజ్యంలో నాతోపాటు నీవు ఉండాలని, అక్కడ బంగారు వీధులు ఉద్యానవనం సంతోషం, సమాధానం దీర్ఘ శాంతం సూర్యకాంతి అక్కర్లేదు ఆకలి దప్పికలు ఉండవు ప్రతి మానవుడు దేవుని ప్రేమను అనుభవించాలని, ప్రతి మోకాలు"ఆయన ముందు వంగాలి, ప్రతి నాలుక ఆయనను స్తుతించాలి" అనే దేవుని సంకల్పాన్ని గుర్తు చేశారు. ఈ సందేశం ప్రతి ఒక్కరినీ దేవుని రాజ్యంలో భాగస్వాములుగా స్వాగతించడానికి పిలుపునిస్తోంది.

# హిందూ మహిళా శక్తి ఆధ్వర్యంలో రాజపేటలో భారీ ప్రదర్శన

## బుల్లెట్ మాధురి చంద్ర నాయకత్వంలో కార్యక్రమం




యాదాద్రి భువనగిరి/రాజాపేట, డిసెంబర్ 7 వుదయం ప్రతినిధి: బంగ్లాదేశ్ లోని హిందువుల మీద జరుగుతున్న దాడులను ఖండిస్తూ, ఇస్కాన్ స్వామీజీ చిన్మయి కృష్ణ దాస్ ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం రాజపేట మండలంలో హిందూ మహిళా శక్తి ఆధ్వర్యంలో బుల్లెట్ మాధురి చంద్ర నాయకత్వంలో భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనగా వివేకానంద విగ్రహం నుండి భారీ ర్యాలీ నిర్వహించారు. రాజపేట పట్టణం లో ప్రతి గల్లీని కదిలిస్తూ జై శ్రీరామ్ నినాదాలతో మారు మ్రోగిన సందర్భంలో బంగ్లాదేశ్ లోని హిందువులను రక్షించాలని గళం విప్పిన హిందూ మహిళ శక్తి స్థానిక మహాత్మాగాంధీ చౌరస్తా దగ్గర ముగింపు సభ నిర్వహించారు.. ఈ సందర్భంగా పలు భజన బృందం , ఇస్కాన్ , సేవికా సమితి, బజరంగ్దళ్, విశ్వహిందూ పరిషత్, ఆలయ కమిటీలు, ఏబీవీపీ, స్థానిక కళాశాల విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థల నుండి పాల్గొన్న వారు మాట్లాడుతూ కణం కణం హిందుత్వానికి సమర్పణం అంటూ ప్రసంగించారు... బంగ్లాదేశ్ లోని అల్లర్లను వెంటనే ఆపివేయాలని స్వామీజీని విడుదల చేయాలని డిమాండ్ చేశారు, హిందూ మహిళా శక్తి రాజపేట గడికోటల మధ్య ప్రతిధ్వనించే విధంగా మారు మ్రోగినా నినాదాలు ప్రతి ఒక్కరిని కదిలించాయి.. సుమారు 3 గంటల పాటు కొనసాగిన ఈ ర్యాలీలో దాదాపు 200 మంది ఈ ర్యాలీలో పాల్గొన్నారు. హిందూ ఐక్యత కి తొలిమెట్టని అన్నారు... ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వ్యవహరించిన పబ్బోజు శ్రీనివాస్ గారు మాట్లాడుతూ భారతదేశ చరిత్రను హిందుత్వాన్ని కొనియాడారు హిందువులందరూ కూడా ఐక్యంగా ఉండాలని ఆస్తుల కోసం కాదు అస్తిత్వాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు... ఈ కార్యక్రమంలో హిందూ మహిళా శక్తి నిర్వాహకులు బూరుగు రాణి, కట్కాం పావని, విశ్వహిందూ పరిషత్ మాతృ శక్తి సాహసంయోజక కటకం భాగ్యలక్ష్మి, బూరుగు మౌనిక, హరే రామ హరే కృష్ణ భక్తమండలి ప్రధాన కార్యదర్శి, భోగ నిర్మల, ఉపాధ్యక్షురాలు భోగ వసంత, కర్రే రమ్య , లావణ్య, రమాదేవి, లక్కాకుల మాధవి, ప్రవలిక, శెట్టి , వట్టిపల్లి పావని దేవి దాసి శృతి ప్రియా దాస్, ఉట్కూరి అశోక్ గౌడ్, దాచేపల్లి రాజు, కానుగంటి శ్రీనివాస్ రెడ్డి, బింగి శ్రీనివాస్, బిళ్ళ లాలయ్య, బూరుగు శేఖర్ రెడ్డి, రాజపేట మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఉప్పల రమేష్, మెండు భగవాన్ రెడ్డి, దాచేపల్లి శ్రీనివాస్, మర్క శివ, పారుపల్లి సంజీవ్,ఐరేని శ్రీధర్, విశ్వహిందూ-పరిషత్ కార్యదర్శి ఇమ్మడి ఓం ప్రకాష్. వి. హెచ్. పి.అధ్యక్షులు బోగా జ్ఞానేశ్వర్. రాజాపేట బజరంగ్ దళ్ సంయోజక్ సట్టు నాని, వి. హెచ్. పి.యాదాద్రి జిల్లా సహకార్యదర్శి బూర్గు సంతోష్ రెడ్డి. బజరంగ్ దళ్ జిల్లా కో కన్వీనర్ మార్క శ్రవణ్ కుమార్, గుర్రం పాండు, కృష్ణ ,కరుణాకర్, అనిల్, తిరుమల విజయ, రేణుకా,కవిత, అరుణ, తదితరులు పాల్గొన్నారు.. ప్లకార్డు ధరించి జెండాలు చేత పట్టుకొని హిందూ బంధువులందరూ పాల్గొని తమ దేశభక్తిని చాటుకున్నారు. కార్యక్రమ విజయవంతం పట్ల బుల్లెట్ మాధురి చంద్ర ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పారు.

# ఈ నెల 14 న లోక్ అదాలత్



కోదాడ టౌన్ డిసెంబర్ 7(వుదయం) జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 14 న కోదాడ కోర్టులలో నిర్వహించే లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకొని, విజయవంతం చేయాలని కోదాడ సీనియర్ సివిల్ జడ్జి , మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కే. సురేష్ కోరారు. దీర్ఘకాలంగా పెండింగ్ వున్న కేసులలో కక్షిదారులు రాజీ పడడం వల్ల వారి సమయం, ధనం ఆదా అవుతాయన్నారు. లోక్ అదాలత్ నిర్వహణ పై శనివారం కోదాడ కోర్టులో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గట్ల నరసింహారావు అధ్యక్షతన న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది తో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్ పై కక్షిదారులకు న్యాయవాదులు, పోలీసులు అవగాహన కల్పించాలని సూచించారు. రాజీ పడతగిన కేసులలో ఇరు వర్గాలు రాజీ పడి తమ కాలాన్ని, ధనాన్ని ఆదా చేసుకోవకడమే కాక, వివాదాలు లేకుండా ప్రశాంతంగా ఉండాలన్నారు. లోక్ అదాలత్ ను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కే. భవ్య, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ చిత్తలూరి సత్యనారాయణ, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చింతకుంట్ల రామిరెడ్డి, ఏపీ పీ లు సిలివేరు వెంకటేశ్వర్లు, కల్యాణి, సీనియర్ న్యాయవాదులు సాధు శరత్ బాబు, తాటి మురళీ, నాళం రాజన్న, మందా వెంకటేశ్వర్లు, కోదూరు వెంకటేశ్వరరావు, హేమలత, కోదండపాణి, దొడ్డ శ్రీధర్, జూనియర్ న్యాయవాదులు శరత్ కుమార్ , ఆవుల మల్లికార్జున్, పెద్దబ్బాయి, ఎస్ ఐ లు రంజిత్ రెడ్డి, అనిల్ రెడ్డి, ఏ ఎస్ ఐ లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కేజీబీవి లో ఆంగ్లము ఉద్యోగానికి దరఖాస్తు ఆహ్వానం

అందోల్ , డిసెంబర్07(వుదయం ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా సదాశివపేట గ్రామంలోని కేజీబీవీ పాఠశాల లో ఆంగ్లము సి ఆర్ టీ కు సంబంధించిన ఉద్యోగానికి ఖాళీ ఉన్నట్లు పాఠశాల ఎస్ ఓ లలిత శనివారం పత్రిక ప్రకటన తెలిపారు. ఆంగ్లము బోధించడానికి మహిళల అభ్యర్థినిలు నుండి దరఖాస్తు ఆహ్వానం స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరాల పాటు విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. ఆసక్తి అరులైన అభ్యర్థినిలో తమకు 9133696309 చరవాణిలో సంప్రదించాలని కోరారు. ఆసక్తి అర్హులైన విద్యార్థినీలు రెండు రోజుల గడువుల్లో దరఖాస్తులను గడువుల్లోపు దరఖాస్తులు కేజీబీవీ పాఠశాలలో సమర్పించాలని కోరారు.

# 1రిన, ఆర్ట్స్ కళాశాలలో ఉపన్యాస పోటీలు.!

హనుమకొండ, డిసెంబర్ 07(వుదయం జిల్లా ప్రతినిధి) : శ్రీనివాస రామానుజన్ 137వ జయంతిని పురస్కరించుకుని డిగ్రీ , పీజీ విద్యార్థుల కోసం రామానుజన్ జీవిత చరిత్ర , ఆయన గణితశాస్త్ర రచనలపై ఉపన్యాస పోటీలు నిర్వహించబడుతున్నాయి. యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల గణిత విభాగం వారు ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం విద్యార్థులలో గణిత శాస్త్రంపై ఆసక్తిని పెంపొందించేందుకు , రామానుజన్ కృషిని తెలియజేయడంలో భాగంగా నిర్వహించబడుతున్నాయి. ఈ పోటీల ద్వారా రామానుజన్ జీవిత విశేషాలు , గణిత కృషి పట్ల విద్యార్థులలో అవగాహన పెంచడమే ముఖ్య ఉద్దేశం అని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య జ్యోతి తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు మరిన్ని వివరాలకు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విభాగ ఇన్చార్జి అధిపతి డాక్టర్ టి నాగయ్య 9701275354 సంప్రదించగలరు.

# పోగొట్టుకున్న సెల్ ఫోన్ అప్పగింత




లక్షెట్టిపేట డిసెంబర్ 7 :( వుదయం ప్రతినిధి ):- మండలంలోని అంకతుపల్లి గ్రామానికి చెందిన కొల్లూరి తిరుపతి అనే వక్తి తన ఫోన్ పోగొట్టుకోవడం జరిగింది. బాధితుడు తన ఫోన్ పోయినట్లు లక్షెట్టిపేట పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేయగా తన పిర్యాదు మేరకు ఎస్సై,-2 రామయ్య ఆధ్వర్యంలో ఫోన్ వివరాలను సి ఈ ఐ ఆర్ లో అప్లోడ్ చేసి పోయిన ఫోన్ గుర్తించి బాధితునికి అప్పగించడం జరిగిందని ఎస్ఐ సతీష్ తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారం కోసం మార్నింగ్ వాక్ లో ఎమ్మెల్యే రేవూరిప్రకాష్ రెడ్డి.



పరకాల డిసెంబర్ 7 (వుదయం ప్రతినిధి): పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి హుజురాబాద్ రోడ్డు, దామెర చెరువు కట్ట, వేల్లంపల్లి రోడ్డు, కొత్త మున్సిపాలిటీ నుండి క్యాంపు కార్యాలయం వరకు మార్నింగ్ వాక్ లో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం వాకింగ్ చేస్తూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటును పరిశీలించారు.ప్రజలకు చేరువగా వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం చేసేందుకు మార్నింగ్ వాక్ ఉపయోగపడుతుందన్నారు.

# పంచాయతీరాజ్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం పరకాల సమితి యూనిట్ శాఖ నుంచి గోవిందు నవీన్ బహిష్కరణ.

## హనుమకొండ జిల్లా అధ్యక్షులు నేరెళ్ల విజయకుమార్.

పరకాల డిసెంబర్ 7 (వుదయం ప్రతినిధి): తెలంగాణ పంచాయతీ రాజ్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం పరకాల సమితి యూనిట్ పరిధిలో పనిచేయుచున్న నడికుడ ఎంపీడీవో కార్యాలయంలో పనిచేసే గోవిందు నవీన్ అనే ఒక ఉద్యోగి తాను గతంలో తెలంగాణ పంచాయతీరాజ్ 4వ తరగతి ఉద్యోగుల సంఘం పరకాల సమితి యూనిట్ శాఖ పక్షాన సమితి కోశాధికారిగా పనిచేసి ఉన్నారు కానీ ఈ మధ్యకాలంలో తాను సంఘ కార్యకలాపాల ను పక్క తవ్వబట్టించే విధంగా అసాంఘిక కార్యకలాపాలకు సంఘ బైల నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నాడు గనక అతన్ని తెలంగాణ పంచాయతీ రాజ్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం పరకాల సమితి యూనిట్ శాఖ నుంచి బహిష్కరిస్తున్నట్లు. తెలంగాణ పంచాయతీ రాజ్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షులు నేరెళ్ల విజయకుమార్ మరియు జిల్లా ప్రధాన కార్యదర్శి చాగంటి రవి ఒక ప్రకటనలో తెలియజేశారు. తెలంగాణ పంచాయతీ రాజ్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం సభ్యుల మనోభావాలు దెబ్బతీసే విధంగా సదర్ గోవింద్ నవీన్ ప్రవర్తిస్తుండడం సంఘానికి చెడ్డపేరుగా భావిస్తూ అతన్ని శాశ్వత సభ్యత్వాన్ని రద్దు చేస్తూ చర్యలు తీసుకోవడం జరిగిందని తెలియజేశారు. పరకాల సమితి యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు యాట సారంగపాణి ప్రధాన కార్యదర్శి కోమరాజ అశోకులు జిల్లా సంఘానికి ఇచ్చిన తీర్మానం మేరకు అతనిపై వేటు వేయడం జరిగిందని జిల్లా సంఘ అధ్యక్షులు నేరెళ్ల విజయకుమార్ మరియు ప్రధాన కార్యదర్శి చాగంటి రవి తెలియజేశారు సంఘానికి విరుద్ధంగా ఎవరు ప్రవర్తించిన కఠిన చర్యలు ఉంటాయని శాశ్వత సభ్యత్వాలు రద్దు చేయబడతాయని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ ఉపాధ్యక్షుల అంకుశావళి అసోసియేట్ అధ్యక్షులు ఎం. రామకృష్ణ జిల్లా కోశాధికారి మాడుగుల రాజమౌళి జిల్లా కోఆప్షన్ నెంబర్ సయ్యద్ నజీర్ మరియు కో ఆప్షన్ నెంబర్ చెరుకు సదానందం మరియు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## డ్వాక్రా మహిళలకు

### ఇందిరా మహిళా శక్తి యూనిట్లను ప్రారంభించిన ఎమ్మెల్యే జారె





దమ్మపేట మండలంలో డిసెంబర్07(వుదయం ప్రతినిధి): ప్రజా విజయోత్సవాలలో భాగంగా స్థానిక ఎమ్మెల్యేజారె ఆదినారాయణ మండలంలో విస్తృతంగా పర్యటించి డ్వాక్రా మహిళలకు బ్యాంకు లింకేజీ ద్వారా ప్రభుత్వం మంజూరు చేసినటువంటి 37 లక్షల రూపాయలతో పట్వారిగూడెం, మల్కారం, గుత్తావారి గూడెం, దమ్మపేట, మందలపల్లి, అకినేపల్లి, ప్రకాష్ నగర్ కాలనీ, వడ్లగూడెం, గట్టుగూడెం, నాచారం, నాగుపల్లి, గ్రామాలలో స్వయం సహాయక సంఘాలకు మంజూరైనటువంటి కిరాణా ఫ్యాన్సీ షాపులు చికెన్ సెంటర్లు పెరటికోళ్ల పెంపకం మసాలాలు పచ్చళ్ళ తయారీ కాంక్రీట్ మిల్లర్ మొబైల్ షాప్ టిఫిన్ సెంటర్ తదితర యూనిట్ లను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు తీసుకురావడం జరుగుతుందని ప్రభుత్వం నిర్దేశించినటువంటి రుణాలను సక్రమంగా వినియోగించుకుని మహిళలు ఆర్థికంగా బలోపేతం అవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మద్దిశెట్టి సత్య ప్రసాద్ , మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి శ్రీనివాస్ , అధికారులు, జిల్లా దిశాకమిటీ సభ్యురాలు సొంగ ఏసుమణి , కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు

## ఈ నెల 15న ఎదిరెపల్లి మశమ్మ స్మారక పురస్కారం ప్రముఖ కవి విమర్శకులు

### గుంటూరు లక్ష్మీ నరసయ్యకు ప్రదానం



నాగర్ కర్నూల్ డిసెంబర్ 07(వుదయం ప్రతినిధి) ఈ నెల 15 ఆదివారం 3 నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని సింగిల్ విండో సమావేశపు హాల్లో ఎదిరెపల్లి మశమ్మ స్మారక పురస్కారం 2024 ను ప్రముఖ కవి విమర్శకులు గుంటూరు లక్ష్మీ నరసయ్య కి అవార్డును ప్రదానం చేయనున్నట్లు ఎదిరెపల్లి మశమ్మ స్మారక పురస్కార కమిటీ తెలిపింది. ఈ అవార్డు కింద 20,000నగదు ,మెమొంటో,ప్రశంసాపత్రం అందచేస్తామని తెలిపారు.ఈ పురస్కార ప్రధాన కరపత్రాలను శనివారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని జాతీయోన్నత పాఠశాల ఆవరణలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షులు డాక్టర్ కవి యాకూబ్,ప్రధాన వక్తగా ప్రభుత్వ సిటీ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షులు డా.కోయి కోటేశ్వరరావు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమానికి కవులు రచయితలు కళాకారులు అభిమానులు బంధుమిత్రులు పాల్గొని విజయవంతం చేయాలని ఈ స్మారక కమిటి అధ్యక్షుడు ఎదిరెపల్లి కాశన్న తెలిపారుఈ కార్యక్రమంలో నెలపొడపు అధ్యక్షులు వనపట్ల సుబ్బయ్య ,గౌరవ అధ్యక్షులు కందికొండ మోహన్, ప్రధానకార్యదర్శి వహీద్ ఖాన్,కందనూల్ కళాసేవాసమితి ఆర్.సత్యం, వెన్నెల సాహిత్య అకాడమీ అధ్యక్షులు ముచ్చర్ల దినకర్,తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోడౌన్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్.



నాగర్ కర్నూల్ డిసెంబర్ 07(వుదయం ప్రతినిధి)ప్రతి నెల ఎన్నికల నియమావళి ప్రకారం ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు మరియు అధికారులతో కలిసి ఈవీఎంలను భద్రపరచిన గోడౌన్ పరిశీలించిన జిల్లా కలెక్టర్ .శనివారం నాగర్ కర్నూల్ కలెక్టరేట్ సమీపంలో గల ఈవియం గోదాంలో ఉన్న ఇ వి ఏం ల స్ట్రాంగ్ రూమ్ దగ్గర పూర్తి భద్రత, పోలీస్ బందోబస్తు వీటన్నింటిని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ పరిశీలించారు. చుట్టూ పరిసరాలను పరిశీలించి అక్కడున్న సిబ్బంది కి తగు సూచనలు చేశారు.త్రాగు నీరు మౌలిక వసతులు ఏర్పాటు చేయాలనీ సిబ్బంది కి ఆదేశించారు. రిజిస్టర్ లను తనిఖీ చేసి రిజిస్టర్ లో సంతకాలు చేశారు.కలెక్టర్ వెంట డిప్యూటీ డిఈ అరుణ రెడ్డి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రవికుమార్, ఎలక్షన్ డి టీ రఘు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు శ్రీనివాసులు, హుస్సేన్, బాలకృష్ణ ,వెంకటయ్య, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

## సేవ రత్న అవార్డు అందుకున్న శంకరమ్మ



భద్రాద్రి కొత్తగూడెం డిసెంబర్ 07 (వుదయం ప్రతినిధి)కొత్తగూడెం అంతర్జాతీయ సామజిక వేత్తల దినోత్సవ వేడుకలను 7వ తేదీ శనివారం జాతీయ ప్రతిభా పురస్కారాల వేడుక విజయవాడ గాంధీనగర్ లో గల హొటల్ ఐలాపురం ప్రక్కన గల ఐలాపురం కన్వెన్షన్ సెంటర్ 1 వ ఫ్లోర్ నందు అద్దంకి రాజా పాన్ ఇండియన్ సోషియో కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పురస్కార గ్రహీతలకు అవార్డులు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలంలోని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాప్ నర్స్ గా విధులు నిర్వహిస్తు సామాజిక కార్యక్రమాలు పాల్గొంటున్న బడికల శంకరమ్మ సేవా రత్న అవార్డు అందుకోవడం జరిగింది .. ప్రస్తుతం వారు రామవరం యుపిహెచ్సిలో విధులు నిర్వహిస్తున్నారు .భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం ధన్ బాద్ గ్రామంలో ఉండే శంకరమ్మ సేవా రత్న అవార్డు విజయవాడలో అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా శంకరమ్మ మాట్లాడుతూ సేవ రత్న అవార్డు అందుకోవడం చాలా సంతోషంగా ఉందని ఇది నా బాధ్యతను మరింతగా పెంచిందని ఇంకా సామాజిక కార్యక్రమాలలు అభివృద్ధి కార్యక్రమాలు చేయడం జరుగుతుందని శంకరమ్మ తెలియజేసినరు.

ఈ కార్యక్రమంలోముఖ్య అతిథులు సభాధ్యక్షులు ఎం బాలగంగాధర్ తిలక్ ,పూర్వ కార్యదర్శి మీడియా అకాడమీ .జ్యోతి ప్రజ్వలన శ్రీమతి వెన్నం శ్రావణి. ఎండి శ్రావణి మీడియా, ప్రత్యేక ఆహ్వానితులు చప్పడి రాజశేఖర్ .కోఆర్డినేటర్ ఎన్ఆర్ఐ టిడిపి సెల్ టిడిపి సెంట్రల్ ఆఫీస్ ,డి సెరిల్ రీచ్ .డైరెక్టర్ యూత్ ఎంపవర్మెంట్ విజయవాడ ,సుశీల్ కుమార్. ప్రముఖ సామాజికవేత్త వ్యవస్థాపకులు సంరక్ష సొసైటీ.

## వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా చకిలం దయాకర్ నియామకం

కమలాపూర్ డిసెంబర్ 7 (వుదయం ప్రతినిధి) వ్యవసాయ మార్కెట్ పాలకవర్గంలో ట్రేడర్స్ కోటాలో ఖాళీగా ఉన్న డైరెక్టర్ పదవిని హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ ఒడితల ప్రణవ్ బాబు గారి ప్రతిపాదనతో కమలాపూర్ మండలం శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన చకిలం దయాకర్ గారిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయనైనది. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉత్తర్వులను ప్రణవ్ బాబు చేతుల మీదుగా చకిలం దయాకర్ అందుకున్నారు. ఈ సందర్భంగా దయాకర్ మాట్లాడుతూ మార్కెట్ డైరెక్టర్ గా నియమించినందుకు ప్రణవ్ బాబు గారికి కాంగ్రెస్ పార్టీకి రుణపడి ఉంటానని తెలిపిపారు ఇట్టి కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తౌటం జాన్సీ రవీందర్ వైస్ చైర్మన్ దేశిని ఐలయ్య డైరెక్టర్లు సముద్రాల కృష్ణ కెత్తే విజేందర్ జనగాని శివకృష్ణ మిల్కూరి శ్రీనివాస్ కిన్నెర కృష్ణమూర్తి నిగ్గుల లింగయ్య కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు గుండప్ చరణ్ పటేల్ బాలసాని రమేష్ మాట్ల రమేష్ మాట్ల రవీందర్ మౌటం కుమారస్వామి దూడ శ్రీకాంత్ వాసాల శ్రీనివాస్ మనీష్ పుల్ల శోభన్ శనిగరం రమేష్ పుల్ల మహేందర్ గంధసిరి బిక్షపతి తదితరులు పాల్గొన్నారు

## రాష్ట్ర స్థాయి పోటీలకు మహిళ బేసిబాల్ జట్టు



వరంగల్ వెస్ట్ , డిసెంబర్ 05 (వుదయం విలేకరి) : డిసెంబర్ 7 8 9 తేదీలలో కరీంనగర్ జిల్లా జగిత్యాలలో జరుగుతున్నటువంటి తెలంగాణ రాష్ట్ర స్థాయి బేస్ బాలు సీనియర్స్ టోర్లమెంటులో పాల్గొనే మహిళ జట్టును జిల్లా బేస్బాల్ సెక్రెటరీ అర్జున్ బెజ్బాల్ అసోసియేషన్ సంఘ సభ్యులు మైదం కుమారస్వామి ప్రకటించడం జరిగింది ఈ జట్టుకు కళ్యాణి కోచ్ కం మేనేజర్ గా వ్యవహరిస్తారు జిల్లా జట్టుకు ఏకశీల ఎడ్యుకేషనల్ సొసైటీ, ఖిలా వరంగల్ క్రీడాకారులకు టీ షర్ట్స్ బహుకరించడం జరిగింది , క్రీడా సామాగ్రిని పిటి మహేందర్ అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో రాష్ట్ర బేస్బాల్ కార్యదర్శి అర్జున్ , మైదం కుమారస్వామి, సీనియర్ పిటి సునీత అభినందనలు తెలపడం జరిగింది.

## తపాలాపూర్ లో హెచ్ఐవి పై అవగాహన



జన్నారం,డిసెంబర్ 7(వుదయం విలేఖరి) మండలంలోని తపాలాపూర్ గ్రామంలో ప్రభుత్వ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో హెచ్ఐవి పై అవగాహన కల్పించారు.శనివారం రోజున గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో హెచ్ఐవి పై ఏ విధంగా జాగ్రత్త తీసుకోవాలో అవగాహన కల్పించి హెచ్ఐవి నిర్ధారణ రక్త పరీక్షలు చేశారు.ఈ కార్యక్రమంలో సిఎస్ఓ రాజేష్,ఐసీటీసీ కౌన్సిలర్ ఆంజనేయులు,ఎం ఎల్ హెచ్ పి సందీప్,హెల్త్ అసిస్టెంట్ కమలాకర్, పంచాయతీ కార్యదర్శి రమేష్,లింకు వర్కర్ సుధా,ఆశా కార్యకర్త లలిత,గ్రామస్తులు పాల్గొన్నారు.

## మెగా హెల్త్ క్యాంపును ప్రారంభించిన ఎమ్మెల్యే



చెన్నూరు డిసెంబర్ 07వుదయం : చెన్నూరు పట్టణంలోని మైనారిటీ ఫంక్షన్ హాల్లో శనివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా హెల్త్ క్యాంపును ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన శిబిరానికి వచ్చిన వారికి స్వయంగా వైద్య పరీక్షలు చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని కణాపాడేందుకు ఇలాం సేవా కార్యక్రమాలు నిరంతరం నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో పలువురు లయన్స్ క్లబ్ సభ్యులు అధికారులు కార్యకర్తలు పాల్గొన్నారు

## సుల్తానాబాద్ లో అంబేద్కర్ వర్ధంతి

మంథని, డిసెంబర్07(వుదయం ప్రతినిధి): సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి గ్రామంలో శుక్రవారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సుల్తానాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.

ఈ కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ చైర్మన్ కల్లెపల్లి జానీ, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, ఎంపీడీవో దివ్యదర్శనరావు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో క్షయ వ్యాధిని నిర్మూలించాలి.



నాగర్ కర్నూల్ డిసెంబర్ 07(వుదయం ప్రతినిధి)సంచార వైద్య వాహనాన్ని జండా ఊపి ప్రారంభించిన జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ బాధావత్ సంతోష్ శనివారం నాడు జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ జిల్లాను క్షయ వ్యాధిగ్రస్తులు లేకుండా చేయాలనే ఉద్దేశంతో వందరోజుల కార్యాచరణ పై శిక్షణ శిబిరం ఏర్పాటు చేయగా జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా 2025 సంవత్సరం వరకు నాగర్ కర్నూల్ జిల్లాలో క్షయ వ్యాధిగ్రస్తుల లేని జిల్లాగా చేయాలన్న ఉద్దేశంతో డిసెంబర్ 9 నుండి మార్చి 17 వరకు 100 రోజులు ప్రతి గ్రామంలో ప్రత్యేక క్యాంపులో నిర్వహిస్తున్న నట్లు నిక్షయ్ శిబిర్ కార్యక్రమం లో తెలంగాణ నుండి ఎంపికైన తొమ్మిది జిల్లాలలో నాగర్ కర్నూల్ కూడా ఉందని , జిల్లాలోని ప్రజలు 60 సంవత్సరాలు దాటిన ప్రతి వ్యక్తి, మధుమేహ వ్యాధిగ్రస్తులు పొగ, ఆల్కహాల్ తాగే వ్యక్తులు, క్షయ వ్యాధి కలిగి ఉన్న కుటుంబాలు, గత ఐదు సంవత్సరాల నుండి క్షయ వ్యాధి చికిత్స తీసుకుంటున్న కుటుంబ సభ్యులను, హెచ్ఐవి వ్యాధిగ్రస్తులను క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు, జిల్లాకు కేటాయించబడిన మూడు సంచార వైద్య వాహనాలలో క్షయ వ్యాధి స్క్రీనింగ్ పరీక్షలు ఎక్స్ రే ,తెమడ పరీక్షలు చేయనున్నట్లు తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా 254431 మందిని పరీక్షించనున్నట్లు తెలియజేశారు.

ఈరోజు ఏ గ్రామంలో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తారో ముందుగానే తెలియజేయాలని అధికారులను ఆదేశించారు

అనంతరం జిల్లా కు కేటాయించబడిన సంచార వైద్య వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ స్వరాజ్యలక్ష్మి, డిప్యూటీ డిఎంహెచ్వోలు తారా సింగ్ వెంకట దాస్ భీమా నాయక్, టీవీ ప్రోగ్రామ్ ఆఫీసర్ రాజశేఖర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారులు పర్యవేక్షణ సిబ్బంది, ఎం ఎల్ హెచ్ పి లు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## వెలమ కులమును వెలమ జాతిని అసభ్య పదజాలంతో దూషించిన ఎమ్మెల్యేపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

### స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు.

### వెలమ సంఘం ఆధ్వర్యంలో.



ఖానాపురం డిసెంబర్07(వుదయం ప్రతినిధి): వెలమ కులమును వెలమ జాతిని అసభ్య పదజాలంతో దూషించన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వెలమ కులస్తులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని వెలమ కులస్తులు డిమాండ్ చేస్తూ, మరల ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు ఎవరు చేయకుండా ఉండేందుకు షాద్ నగర్ ఎమ్మెల్యేపై కఠిన చర్యలు తీసుకొని అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే శాసనసభ సభ్యత్వాన్ని రద్దు పరచాలని మండల వెలమ సంఘం కులస్తుల తరఫున డిమాండ్ చేస్తున్నట్లు వెలమ సంఘం అధ్యక్షులు పల్లెల్ల సోమేశ్వర్ రావు, కత్తుల మాధవరావు, డివిజన్ ప్రధాన కార్యదర్శి తక్కెళ్ళపల్లి సంపత్ రావులు తెలిపారు. మండల వెలమ సంఘం ఆధ్వర్యంలో వెలమ కులస్తులను వెలమజాతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పై స్థానిక పోలీస్ స్టేషన్ లో ఎస్ఐ సిహెచ్ రఘుపతి బందోబస్తుకు వెళ్లిన సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ సారయ్యకు దరఖాస్తు ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలమ సంఘం కార్యదర్శి వీరమనేని సాగర్ రావు, సంఘం మాజీ అధ్యక్షుడు నడిపెల్లి రాజేశ్వర్ రావు, వెలమ కులస్తులు దుగ్యాల రాజేశ్వర్ రావు, పేరాల అనిల్ రావు, పేరాల హరీష్ రావు, పోనుగోటి శ్రీనివాసరావు, తక్కెళ్ళపల్లి బాబురావు, అడ్డూరి మోహన్ రావు,పల్లెపాటి సంపత్ రావు, నాగినేని వెంకటేశ్వర్ రావు, పొనుగోటి యుగంధర్ రావు, పోలసాని సంపత్ రావు, బలుగూరి సుజాకర్ రావు, పోలసాని సాగర్ రావు, కోదాటి సాగర్ రావు, కొదాటి రవీందర్ రావు, గండ్ర రాజు, తక్కెళ్ళపల్లి ప్రవీణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా మాసభలను జయప్రదం చేయండి

### సిపిఎం జిల్లా కార్యదర్శి వర్ధన్ పర్వతాలు



నాగర్ కర్నూల్ డిసెంబర్ 07(వుదయం ప్రతినిధి) అచ్చంపేట పట్టణంలో ఈనెల 14,15 తేదీలలో జరుగుచున్న నాగర్ కర్నూల్ జిల్లా సిపిఎం పార్టీ మూడవ జిల్లా మహాసభల గోడపత్రికను నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని సిఐటియు కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శి వి పర్వతాలు విడుదల చేశారుఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా గత మూడు సంవత్సరాలు చేసిన ఉద్యమాలు భవిష్యత్తు కర్తవ్యాలు సమీక్ష చేసుకొని రాబోయే కాలంలో రైతాంగం కూలీలు కార్మికులు పక్షాన బలమైన ఉద్యమాలు పోరాటాలు నిర్వహణకు కార్యాచరణ రూపొందించబోతున్నామని వారు అన్నారునల్లమల్ల ప్రాంతంలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని మొట్టమొదటిసారిగా అచ్చంపేట ప్రాంతంలో ఈ మహాసభలు జరుగుతున్నాయని ఆయన అన్నారు . వెనుకబడిన ఉమ్మడి పాలమూరు జిల్లాలో నల్లమల అటవీ ప్రాంతం విస్తారంగా ఉన్న పరిశ్రమలకు నోచుకోకపోవడం వల్ల యువతకు ఉద్యోగాలు లేక నిరుద్యోగ మారుతున్నారని ఆయన అన్నారు ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధి చెందాలంటే మాచర్ల గద్వాల రైల్వే లైన్ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని దీనివల్ల అనేక ఉద్యోగాలు యువతకు ఉపాధి దొరుకుతుందని ఆయన సందర్భంగా అన్నారు. ఇప్పటికైనా ఈ జిల్లా పార్లమెంటు సభ్యులు ఉమ్మడి పాలమూరు జిల్లా సమస్యలు తీసుకొని పార్లమెంటులో చర్చించే విధంగా ప్రయత్నించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మాజీ ఎంపిటిసి ఏ యాదయ్య సిపిఎం మండల ఏరియా కార్యదర్శి పొదిల రామయ్య సిపిఎం మండల కమిటీ సభ్యులు కొంపల్లి అశోక్ సురేష్ డివైఎఫ్ఐ నాయకులు మధు సిపిఎం నాయకులు వెంకటేష్ సత్యనారాయణ నరసింహ శివ చారి తదితరులు పాల్గొన్నారు

# రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన







కోదాడ రూరల్ డిసెంబర్ 7(వుదయం) కోదాడ నియోజకవర్గ పరిధిలోని కాపుగల్లు నుండి రెడ్లకుంట వరకు 20 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించే రహదారి పనులకు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తంకుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ లు పాల్గొని శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ పామాయిల్ పంటలకు రైతులు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు. పామాయిల్ సేద్యం పెరిగితే పామాయిల్ మిల్లు ప్రారంభిస్తామని తెలిపారు. పామాయిల్ పంటకు 51,000 సబ్సిడీ అందించడంతోపాటు రైతుల వద్ద నుండి నేరుగా ప్రభుత్వమే పామాయిల్ పంటను కొనుగోలు చేస్తుందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ప్రభుత్వమని క్లిష్ట సమయంలో 21 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేశామని గత ప్రభుత్వం యెగ్గొట్టిన 7625 కోట్ల రైతుబంధు మొత్తాన్ని రైతుల ఖాతాలలో జమ చేసామని అన్నారు. భారీ నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్ ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి నుండి రైతులకు రైతు భరోసా అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కోదాడ ఎమ్మెల్యే ఉత్తం పద్మావతి రెడ్డి, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవర్, ఆర్డీవో సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్రావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, మాజీ డిసిసిబి చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, టీ పీ సీసీ డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు తూమాటి వరప్రసాద్ రెడ్డి,

మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రేవూరి వెంకటాచారి, కాపుగల్లు గ్రామ మాజీ సర్పంచ్ తొండపు సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగాన్ని.అంబేద్కర్‌ను అవమానించిన చరిత్ర కాంగ్రెస్‌దే

## మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్





జయశంకర్ భూపాలపల్లి డిసెంబర్ 07(వుదయం ప్రతినిధి) :రాజ్యాంగాన్ని డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీకే ఉందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆరోపించారు. శనివారం కాటారం మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి పంక్షన్ హాల్‌లో జరిగిన దళిత బంధు ధర్మ యుద్ధం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బారత రాజ్యాంగం రచించి దేశ ఔన్నత్యాన్ని చాటినా అంబేద్కర్‌కు మన దేశంలో గౌరవం దక్కలేదన్నారు. అమెరికా దేశంలో అంబేద్కర్ ఫోటోను డాలర్‌పై పెడితే మన దేశంలో మాత్రం అవమానాలే దక్కాయి. ప్రపంచ దేశాలు అంబేద్కర్‌ను గుర్తించినా దేశంలోని కాంగ్రెస్ పార్టీ మాత్రం గుర్తించలేదన్నారు. ఇప్పటి వరకు రాజ్యాంగ ఫలాలు పొందుతూనే అంబేద్కర్‌ను ఒక్క ఎస్సీ సామాజిక వర్గానికే పరిమితం చేశారని, ఈ విషయాన్ని కాంగ్రెస్‌పార్టీలో ఉన్న దళిత నాయకులు సైతం గుర్తించాలన్నారు. రాజ్యాంగానికి తూట్లు పొడిచి అదే రాజ్యాంగాన్ని రాహుల్ గాంధీ పట్టుకుని దేశం మొత్తం తిరుగుతున్నాడని ఆయన ఎద్దేవా చేశారు. దళితుల సంక్షేమం కాంగ్రెస్ పార్టీ అనేక పథకాలు అమలు చేసిందని గొప్పలు చెప్పున్నారే కానీ ఏనాడు ఒక్క దళితకుటుంబానికి మేలు చేయలేదన్నారు. మోసపోయేవాళ్లు ఉంటే మోసపుచ్చడానికి సిద్దంగా ఉన్న ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని, ఆనాడే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారని, మోసపోవడానికి సిద్దంగా ఉంటే మోసం చేయడం తప్పేంటని అన్న మాటలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయని ఆయన గుర్తు చేశారు. ఆనాడు రాజ్యాంగాన్ని అంబేద్కర్‌ను అవమానపర్చిన కాంగ్రెస్ పార్టీ ఈనాడు రాజ్యాంగం పట్టుకుని మనల్ని మోసం చేయాలని చూస్తున్నారని అన్నారు. దళితబంధు, బీసీబంధులాంటి పథకాలను బీఆర్‌ఎస్ పార్టీ అమలు చేస్తూ బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ వర్గాలకు ఆర్థికబలోపేతం చేయాలనే ఆలోచన చేసిందని, ఈ పథకాలు పెట్టడం మూలంగానే ఓటమికి గురయ్యారని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. కేవలం మాయమాటలు, మోసపూరిత మాటలను నమ్మి కాంగ్రెస్‌కు ఓటేసి బీఆర్‌ఎస్‌ను ఓడించారన్నారు. బీఆర్‌ఎస్ ఓటమి చెందిన అప్పటి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీ, దళిత బంధులను యధావిధిగా కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. ఆనాడు అంబేద్కర్ రిజర్వేషన్‌లు ప్రవేశపెట్టినప్పుడు కేవలం పదేళ్లు మాత్రమే రిజర్వేషన్లు ఉండాలని అటుతర్వాత ఉండవద్దని చెప్పారన్నారు. రిజర్వేషన్‌లతో బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీలు ఆర్థికంగా రాజకీయంగా బలోపేతం చేయాలనే ఆలోచన చేశాడని, కానీ ఆ రిజర్వేషన్ ఫలాలను ఇప్పటి వరకు ఎవరు పొందుతున్నారో అర్థం చేసుకోవాలన్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేండ్లయినా బీసీలు, ఎస్సీ ఎస్టీలు దళిత బంధు, బీసీ బంధు కోసం తిరుగుతున్నారంటే అందుకు రాహుల్‌గాంధీ కుటుంబమే కారణమన్నారు. ఎక్కువ శాతం ఉన్న బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీల కోసమే దళిత బీసీ బంధు అమలు చేశామని, దళితబంధు మా భవిష్యత్తు అని ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. దళితబంధు అమలు చేయాలని 50వేల దళితులతో అంబేద్కర్ విగ్రహం వద్ద కూర్చుంటామని మాజీ సీఎం కేసీఆర్ ఇప్పటికే ప్రకటించారని ఆయన గుర్తు చేశారు. దళితబంధు పథకాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కొనసాగించాలని, ఈ క్రమంలో ఆ పార్టీలోని దళిత నాయకులు సైతం మేల్కొని యుద్ధం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

# సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



తుంగతుర్తి/ శాలిగౌరారం, డిసెంబర్ 7, (వుదయం ప్రతినిధి): సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని గత రెండు రోజుల నుండి రాష్ట్రవ్యాప్తంగా రిలే నిరసన దీక్షలు చేపట్టారు. దీనిలో భాగంగా తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని శాలిగౌరారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత కొన్ని సంవత్సరాల నుండి పనిచేస్తున్న మమ్ములను రెగ్యులర్ చేయాలని, లేని పక్షంలో పే స్కేలైన ఇవ్వాలని, ప్రతి ఉద్యోగికి పది లక్షల రూపాయల జీవిత బీమా కల్పించాలని, చనిపోయిన ఉద్యోగులకు 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, పిటిఐ లకు 12 నెలల వేతనం ఇవ్వాలని, పదవి విరమణ చేసేవారికి 25 లక్షల బెనిఫిట్ కల్పించాలని డిమాండ్ చేశారు.

ఈ ఉద్యోగులు చేస్తున్న దీక్షకు వివిధ ఉపాధ్యాయ సంఘాలు మద్దతు తెలిపారు. పిఆర్టియు జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్

పి వెంకటరమణ, మండల కార్యదర్శి రవికుమార్, మండల బాధ్యులు నోముల భగత్ సంఘీభావం తెలిపారు. ఈ దీక్షలో సమగ్ర శిక్ష జిల్లా అధ్యక్షుడు మొలుగూరి కృష్ణ, కార్యనిర్వాహక అధ్యక్షుడు కొండ చంద్రశేఖర్ ,మండల బాధ్యులు సిహెచ్ బిక్షమయ్య , సుజాత , పరమేష్, కేజీబీవీ సిఆర్టిలు లలిత, లక్ష్మి ,నాన్ టీచింగ్ స్టాఫ్ శోభ, నర్మదా తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీల ఆధ్వర్యంలో అన్న వితరణ



లక్షెట్టిపేట డిసెంబర్ 7 :( వుదయం ప్రతినిధి):- ముస్లింలు మత సామరస్యాన్ని చాటుకుని అయ్యప్ప మాలలు ధరించిన స్వాములకు అన్నవితరణ కార్యక్రమం శనివారం ముస్లిం మైనార్టీ ప్రెసిడెంట్ సయ్యద్ సాహిద్ అలీ ఆధ్వర్యంలో స్థానిక హనుమాన్ మందిర ఆవరణలో అయ్యప్ప అన్నవితరణ (భిక్ష ) నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీ అధ్యక్షులు షాహిద్ మాట్లాడుతూ.......హిందూ ముస్లింల మధ్య సోదర భావం తో కలిసిమెలిసి ఉండాలని అన్నారు. మతసామరాస్యాన్ని పెంపొందించుటకు కోసం ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీ సోదరులకు అయ్యప్ప సేవా సమితి సభ్యులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ జనరల్ సెక్రెటరీ నవాబ్ ఖాన్, మైనార్టీ నాయకులు జమీర్, ఇలియాస్ ఖాన్, ముస్లిం యువకులు, అయ్యప్ప భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ బాయ్స్ అండ్ గర్ల్స్ హాస్టల్స్ భవనాలు వెంటనే పూర్తి చేయాలి.

- సొంత భవనాలు లేక ఇబ్బంది పడుతున్న విద్యార్థిని విద్యార్థులు.
- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కుమ్మరి రాజు డిమాండ్.






భూపాలపల్లి డిసెంబర్07(వుదయం ప్రతినిధి): ఎస్ఎఫ్ఐఆధ్వర్యంలో నిర్మాణం మధ్యలో అగి ఉన్న బిల్డింగ్స్ ని పరిశీలించడం జరిగింది. తక్షణమే బీసీ హాస్టల్స్ సొంత భవనాలు పూర్తి చేయాలి. ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మరి రాజు మాట్లాడుతూ

భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈరోజు జిల్లా కేంద్రంలో ని బీసీ బాయ్స్ అండ్ గర్ల్స్ హాస్టల్స్ నిర్మాణం మధ్యలో ఆగినటువంటి బిల్డింగ్స్ ని ఈరోజు పరిశీలించడం జరిగింది అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కుమ్మరి రాజు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో బీసీ హాస్టల్స్ బాయ్స్ కావచ్చు గర్ల్స్ కావచ్చు ఈ విద్యార్థిని విద్యార్థులకు సంబంధించి హాస్టల్స్ కు సంబంధించి సొంత భవనాలు లేకపోవడం వల్ల అనేకమైనటువంటి ఇబ్బందులు గత కొన్ని సంవత్సరాలుగా ఎదుర్కొంటున్నారు ఈ సమస్యలన్నీ కళ్ళ ఎదుట కనిపిస్తున్న పట్టించుకోని అధికారులు తక్షణమే హాస్టల్స్ నిర్మాణం వెంటనే పూర్తి చేసి చదువుకునే విద్యార్థులకు కనీసం మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ గా డిమాండ్ చేయడం జరిగింది. అదేవిధంగా ఇప్పుడు ఉన్నటువంటి బీసీ బాయ్స్ కావచ్చు గర్ల్స్ కావచ్చు హాస్టల్స్ కు సంబంధించి రెంటు బిల్డింగ్ లో ఉంటున్నారు చాలీచాలని రూమ్స్ కనీసం వాష్రూమ్స్ కూడా విద్యార్థులకు అందుబాటులో ఉండడం లేదు ఉన్నటువంటి వాషింగ్స్ కూడా పూర్తిస్థాయిలో పనిచేయడం లేదు బీసీ బాయ్స్ రెంటు ఉంటున్న హాస్టల్ కు సంబంధించి అందులో మొత్తం మంది 70 మంది ఉంటున్నారు రెగ్యులర్ గా 50 మంది పైన విద్యార్థులు ఉంటున్నారు వారికి సంబంధించి కనీస మౌలిక సదుపాయాలు సరైన సమయంలో అందుబాటులో ఉండకపోవడం వల్ల రెంట్ తీసుకున్న బిల్డింగులలో విద్యార్థులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అదేవిధంగా గర్ల్స్ హాస్టల్ బీసీ కి సంబంధించి అందులో మొత్తం మంది విద్యార్థులు 95 మంది ఉన్నారు రెగ్యులర్గా 85 మంది విద్యార్థినిలు ఉంటున్నారు. వీరికి సంబంధించి వాటర్ సౌకర్యం గాని ఎలాంటి కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడం వల్ల విద్యార్థులు రోజువారిగా అనేక కష్టాలను ఎదుర్కొంటున్నారు తక్షణమే బీసీ హాస్టల్స్ భవనాలు పూర్తి చేయాలి..బీసీ హాస్టల్ కి సొంతభవనాలు వెంటనే పూర్తి చేయాలి. ఎస్ఎఫ్ఐ బీసీ హాస్టల్స్ కి సొంత భవనాలు లేకపోవడం వల్ల విద్యార్థిని విద్యార్థులు గత కొన్ని సంవత్సరాలుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు కనీసం వీరిని పట్టించుకునే అధికారులు కూడా ఈ జిల్లాలో లేకపోవడం చాలా దుర్మార్గం అని అన్నారు ప్రభుత్వాలు మారిన కానీ విద్యార్థుల భవిష్యత్తు మారడం లేదు అని వారు ఆవేదన వ్యక్తం చేశారు తక్షణమే ఈ హాస్టల్ లో చదువుకుంటున్నటువంటి పేద మధ్యతరగతి విద్యార్థులకు సంబంధించి వారి అవసరాలను గుర్తించి నిర్మాణంలో ఉన్నటువంటి బీసీ హాస్టల్స్ ని వెంటనే పూర్తి చేయాల్సిందిగా ఎస్ఎఫ్ఐ గా డిమాండ్ చేస్తున్నాం లేనియెడల విద్యార్థిని విద్యార్థులు అందరితో కలిసి జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున నిరసన మరియు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించడం జరిగింది.. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు వంశీ. రఘు తదితరులు పాల్గొన్నారు.

# ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గని పై గేట్ మీటింగ్



కాసిపేట డిసెంబర్ 7 (వుదయం విలేకరి): సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆధ్వర్యంలో కాసిపేట ఒకటో గని పై శనివారం గేట్ మీటింగ్ ఏర్పాటు చేశారు ముఖ్య అతిథులుగా యూనియన్ అధ్యక్షులు కామ్రేడ్ వాసిరెడ్డి సీతారామయ్య సెంట్రల్ సెక్రెటరీ ఎండి అక్బర్ అలీ పాల్గొనగా అతిథులుగా బ్రాంచ్ ఇన్చార్జి చిప్ప నరసయ్య బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్ బ్రాంచ్ ఉపాధ్యక్షులు బియ్యాల వెంకటస్వామి బ్రాంచ్ సహకార దర్శి దాసరి తిరుపతి గౌడ్ సభాధ్యక్షులు ఎస్ నాగేశ్వరరావు, చిప్పరి శ్రీహరి నేను లక్ష్మీనారాయణ సిగ్గేమ్ శంకర్, జే రంజిత్ కుమార్ ఎస్ అశోక్ వి రాజేందర్ పార్వతి సురేష్ మైండ్స్ కమిటీ సేఫ్టీ కమిటీ ఫిట్ కమిటీ సభ్యులు షిఫ్ట్ ఇంచార్జ్ లు పాల్గొన్నారు ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి సీతారామయ్య మాట్లాడుతూ సింగరేణిలో గత ఐదు ఆరు సంవత్సరాలు టెక్చర్ మీటింగ్ జరగక కార్మికుల సమస్యలు పెండింగ్ లో ఉన్నాయి అని అన్నారు గత ప్రభుత్వం యూనియన్ లను కార్మికుల సమస్యలను పట్టించుకోక లేదు అని ఏఐటీయూసీ గెలిచిన తర్వాత మొట్టమొదటిసారిగా డైరెక్టర్ స్థైల్ సమావేశాలలో అనేక సమస్యలు పరిష్కరించడం జరిగిందని అన్నారు డిస్మిస్ అయినా జే ఎం టి ఉద్యోగులకు అవకాశం కల్పించడం జరిగిందన్నారు. మైనింగ్ స్టాఫ్ టెక్నీషియన్ సూపర్వైజర్ ల కు అండర్ గ్రౌండ్ అని ఫీట్ అయితే సర్ఫేస్ లో సూటబుల్ జాబ్ ఇవ్వడం కోసం ఒప్పందం జరిగిందన్నారు. సింగరేణిలో నడిచే క్యాంటీన్ లలో ప్రైవేటు వారిని తీసేసి సింగరేణి పర్మినెంట్ కార్మికులతో నడిపించాలని క్వాలిటీ పెంచడం జరిగిందన్నారు. డిస్మిస్ అయిన ఉద్యోగులందరికీ అవకాశం ఇవ్వాలని కోరడం జరిగింది అని . ఎలక్ట్రిషన్ ఫిట్టర్ లకు హెల్పర్ లను ఇవ్వాలని వారికి సర్దార్ బౌండర్ ఫిక్సేషన్ చేయాలని అన్ఫిట్ అయితే సర్వీసులో జాబ్ కల్పించాలని కోరడం జరిగింది అని తెలిపారు 12 అంశాలపై చర్చించడం జరిగింది అని తెలిసి తెలియని కొన్ని సంఘాలు రాజకీయం అబ్బం గడపడం కోసం కార్మికుల ను తప్పుతోవ పట్టిస్తున్నారు అని కార్మికులు గమనించాలని అన్నారు. ఈ నెలలో జరిగే సిఐడిఎండి మీటింగ్ లో సొంతింటి కల పేరుపై ఇన్కమ్ టాక్స్ చెల్లించే విధంగా ప్రయత్నం చేస్తాం అని ప్రభుత్వం సహకారం కూడా ఎంతో అవసరం ఉంది అని గతంలో ఈ విషయాన్ని ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి ల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని అన్నారు ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం కోసం గుర్తింపు సంఘం గా కృషి చేస్తామని కార్మికులు కార్మికుల సమస్యపై యూనియన్ ల బేధం వదిలేసి కలిసికట్టుగా హక్కులు సాధించే వరకు పోరాటం చేయాలని కోరారు

# ఉప్పరపల్లి ఉన్నత పాఠశాలలో అట్టహాసంగా ప్రారంభమైన సీఎం కప్ క్రీడలు

**ముఖ్య అతిథులుగా హాజరైన చెన్నారావుపేట మండల స్పెషల్ ఆఫీసర్ బాలకృష్ణ, ఎంపీడీవో శ్రీవాణి**

**శారీరక ,మానసిక వికాసానికి క్రీడలు దోహదం చేస్తాయి: మండల స్పెషల్ ఆఫీసర్ బాలకృష్ణ.**

**క్రీడలతో పరిపూర్ణ ఆరోగ్యం: ఎంపీడీవో శ్రీవాణి**

**ఆకట్టుకున్న ఉప్పరపల్లి విద్యార్థుల యోగా విన్యాసాలు**



చెన్నరావుపేట డిసెంబర్. 7. ( వుదయం న్యూస్ ప్రతినిధి ) చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సీఎం కప్ క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభం అయినాయి. హెచ్ఎం తేజావత్ జయ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా చెన్నారావుపేట మండల స్పెషల్ ఆఫీసర్, పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డా. బాలకృష్ణ, చెన్నారావుపేట మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీవాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ గ్రామీణ యువతలో సామూహికతను, సహకారాన్ని పెంపొందించే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఈ రోజు, రేపు గ్రామస్థాయిలో సీఎం క్రీడా పోటీలు నిర్వహించనున్నారని తెలిపారు. ఆరోగ్యవంతమైన జీవనశైలి, క్రీడల ద్వారా శారీరక ఆరోగ్యం మరియు మానసిక స్థితి మెరుగు పడుతుందని, గ్రామీణ ప్రాంతాల్లోని యువత ప్రతిభను గుర్తించి వారికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు కల్పించడం సీఎం కప్ క్రీడల ప్రధాన ఉద్దేశం అన్నారు. ఈ పోటీలు నాలుగు దశలుగా జరుగుతాయని గ్రామ స్థాయి పోటీలు: డిసెంబర్ 7-8 తేదీల్లో,మండల స్థాయి పోటీలు: డిసెంబర్ 10-12 తేది లలో,జిల్లా స్థాయి పోటీలు డిసెంబర్ 16-21 తేది లలో అనంతరం రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతాయన్నారు. ఎంపీడీవో శ్రీవాణి మాట్లాడుతూ క్రీడలతో పరిపూర్ణ ఆరోగ్యం సాకారమవుతుందని, ప్రతిరోజు గంటపాటు విద్యార్థులు, యువకులు క్రీడలకు తమ సమయాన్ని కేటాయించాలన్నారు. సెల్ ఫోన్ గేమ్ లకు స్వస్తి చెప్పాలని, శారీరక మానసిక వికాసం పెంపొందించే క్రీడలపై దృష్టి సారించాలన్నారు. ఉప్పరపల్లి ఉన్నత పాఠశాల హెచ్ఎం జయ మాట్లాడుతూ ప్రతిరోజు విద్యార్థులకు తమ పాఠశాలలో క్రీడా పీరియడ్ ఉంటుందని, గత రెండు నెలల్లో 12 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయికి వెళ్లారని తెలిపారు. విద్యార్థులు పాఠశాల దశ నుండే క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణంరాజు, కలామ్స్ ఫౌండేషన్ అధ్యక్ష కార్యదర్శులు బాషు మియా, పరికి మధు, ఉప్పరపల్లి హై స్కూల్ అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ చింతకింది సుజాత, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థి జి. సాత్విక తన తోటి విద్యార్థులతో చేసిన యోగా విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉప్పరపల్లి హై స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయురాలు వీరగోని స్వప్న ఆధ్వర్యంలో కబడ్డీ, ఖోఖో క్రీడలను నిర్వహించారు. ఉప్పరపల్లి గ్రామానికి చెందిన యువతీ యువకులు ఉత్సాహంగా క్రీడలలో పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే నాని ని మర్యాదపూర్వకంగా కలిసిన సర్పంచులు.



తిరుపతి జిల్లా, చంద్రగిరి, డిసెంబరు07 (వుదయం ప్రతినిది): నియోజకవర్గం తిరుపతి రూరల్ మండలం పరిధిలోని పలు పంచాయతీలకు సంబంధించిన సర్పంచులు ఈరోజు తనపల్లి రఘునాథ్ రిసార్ట్స్ లోని స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నాని స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసిన పలు పంచాయతీలో సర్పంచులు.

అనంతరం పంచాయతీలోని సమస్యలను సర్పంచ్ని అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే. పార్టీలకు అతీతంగా అభివృద్ధి వైపు ముందుకు వెళ్దామని సర్పంచులకు తెలిపిన ఎమ్మెల్యే. మీ పంచాయతీలో ఏ సమస్య వచ్చిన స్థానిక నాయకుల ద్వారా నా దృష్టికి వచ్చిన వెంటనే సమస్యను పరిష్కారమయ్యే విధంగా ముందుకు వెళ్తానని సర్పంచులకు హామీ ఇచ్చిన ఎమ్మెల్యే. ఈ కార్యక్రమంలో తిరుపతి రూరల్ మండలానికి చెందిన కూటమి ప్రభుత్వం నాయకులు గణపతి నాయుడు సునీల్ చౌదరి, మధు సోదరులు పాల్గొన్న.

# గిరిజన బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్.

**నిర్దేశించుకున్న లక్ష్యం చేరే దిశగా చదవాలి.**
**వచ్చే పరీక్షల్లో 100శాతం ఉత్తీర్ణత సాధించాలి.**
**నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్.**



కల్వకుర్తి డిసెంబర్ 7 (వుద యం ప్రతినిధి ) కల్వకుర్తి పట్టణంలోని గిరిజన బాలికల వసతి గృహాన్ని శనివారం జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా వసతి గృహంలోని వంటశాలలో కూరగాయులు, వంట నరుకులను ,బియ్యాన్ని,పరిశీలించారు. తాజాగా ఉన్న కూరగాయలను వంటకు ఉపయోగించాలని, పాడైన వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ వంటలో వద్దొద్దని సూచించారు. బియ్యాన్ని తీసుకునే ముందు పరిశీలించిన తర్వాతే తీసుకోవాలని తెలియజేశారు. డ్రైనేజీ సమస్యను హాస్టల్ వివరించగా, త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని వార్డెన్ కి సూచించారు. అనంతరం విద్యార్థులతో తరగతి గదిలో మెనూ ప్రకారం భోజనం అందిస్తున్న రా అని అడిగి తెలుసుకున్నారు. బాగా చదివి లక్ష్యాలను చేరుకోవాలని,పాఠశాలకు తల్లిదండ్రులకు జిల్లాకు మంచి పేరు తేవాలని,సూచించారు. కలెక్టర్ వెంట కల్వకుర్తి తహసిల్దార్ ఇబ్రహీం,గురుకుల పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ పార్వతమ్మ,తదితరులు పాల్గొన్నారు .

# విద్యార్థులు అన్ని క్రీడా పోటీల్లో రాణించాలి...

**: బీఆర్ఎస్ నేత శంభీపూర్ కృష్ణ.**




కుత్బుల్లాపూర్, డిసెంబర్ 7,(వుదయం ప్రతినిధి ),కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి చర్చ్ గాగిల్లాపూర్ లోని సెయింట్ ఇగ్నటస్ వారు నిర్వహిస్తున్న వాలి బాల్ టోర్నమెంట్ ను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా చదివి ఉన్నత స్థాయికి వెళ్లాలని అదేవిధంగా అన్ని క్రీడా పోటీల్లో చురుకుగా పాల్గొని రాణించాలి అని తెలిపారు. ఈ కార్యక్రమాని నిర్వహిస్తు యువతను ప్రోత్సహిస్తున్న నిర్వాహకులు రంజిత్ రెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ పద్మా రావు, కౌన్సిలర్లు సుధాకర్ రెడ్డి, శంకర్ నాయక్, మహేందర్ యాదవ్, భారత్ కుమార్, విద్యార్థులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి కోల్పోయి ఆర్థిక భారంతో ఆటో డ్రైవర్లు: బంద్ విజయవంతం



పెద్దపల్లి జిల్లా:డిసెంబర్, 7 (వుదయం) ప్రతినిధి: ప్రభుత్వ ఫ్రీ బస్సు సేవల వల్ల ఉపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుటుంబాలను పోషించేందుకు మరియు ఫైనాన్స్ ఇన్స్టాల్మెంట్లను చెల్లించలేక, వారు తీవ్ర ఆర్థిక సమస్యలతో అస్తవ్యస్తంగా మారారు. ఈ నేపథ్యంలో,

కాల్వ శ్రీరాంపూర్‌లో వాయుపుత్ర ఆటో యూనియన్ ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యూనియన్ అధ్యక్షుడు బండారి కొమురయ్య, వైస్ ప్రెసిడెంట్ అల్లముల పోచాలు, కోశాధికారి చిలుముల రమేష్, మరియు సభ్యులు అల్లెం శంకర్, దిడ్డి మల్లేష్, చిలుముల కుమార్, చల్ల చంద్రమౌళి, బాస్కర్, ఎండి రహీమ్, ఎండి చాంద్, లింగమూర్తి కుంట, కార్తిక్, రమేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. ఆటో డ్రైవర్లు తమ సమస్యలపై ప్రభుత్వ దృష్టిని ఆకర్షించడానికి, తక్షణ సాయం అందించాలనే డిమాండ్‌తో బందును విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం డ్రైవర్ల ఐక్యతకు నిదర్శనమైంది. క్రోడీకరణ:ఫ్రీ బస్సు సేవల వల్ల ఉపాధి కోల్పోయిన డ్రైవర్లకు ప్రభుత్వం పునరావాస చర్యలు చేపట్టాలని, వారి ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచే నిర్ణయాలు తక్షణమే తీసుకోవాలని యూనియన్ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

# చీఫ్ మినిస్టర్ కప్ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే జారె



దమ్మపేట డిసెంబర్07(వుదయం ప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలోని మందలపల్లి ట్రైబల్ వెల్ఫేర్ బాయ్స్ హాస్టల్ లో పంచాయతీ స్థాయి ఆటల పోటీలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సీఎం కప్ పోటీలలో భాగంగా గ్రామపంచాయతీల వారిగా నిర్వహిస్తున్న క్రీడలను ప్రారంభించి క్రీడలలో పాల్గొన్న అశ్వరావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులందరూ తమ తమ ప్రతిభను చాటుకోవాలని స్నేహపూర్వకమైన క్రీడలను ఆడాలని ఆయన క్రీడాకారులకు సూచించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మద్దిశెట్టి సత్యప్రసాద్ , మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి శ్రీనివాస్ , జిల్లా దిశ కమిటీ సభ్యురాలు సొంగా ఏసుమణి కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షంతో తీవ్రంగా నష్టపోయిన రైతులు



జన్నారం,డిసెంబర్ 7(వుదయం విలేఖరి) జన్నారం మండలంలో కురిసిన అకాల వర్షంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని పలు గ్రామాలలో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షాలతో రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోసిన వరి ధాన్యం ఒక్కసారిగా కురిసిన అతి భారీ వర్షంతో వడ్లు తడిసి ముద్దయ్యాయి. కవర్లు కూడా కప్పలేనంత వర్షం కురవడంతో వరద నీరు ధాన్యం చుట్టూ చేరింది. తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులుకోరారు.

# ఎల్ఓసి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే



జగిత్యాల జిల్లా ప్రతినిధి డిసెంబర్ 07( వుదయం ):జగిత్యాల పట్టణానికి చెందిన పలువురు నిరుపేదలు వైద్య చికిత్స చేసుకునే ఆర్థిక స్తోమత లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే సిఎం సహాయ నిధి ద్వారా ఎల్ ఓ సి మంజూరు చేయించారు. జగిత్యాల పట్టణ 29 వార్డు కి చెందిన సునీల్ కు మంజూరైన 2లక్షల 50,అయోధ్య గ్రామానికి చెందిన బి సరోజన 1 లక్ష పదివేలు,జగిత్యాల పట్టణ 35 వార్డు కి చెందిన జి శైలజ 1 లక్ష 50 వేల రూపాయల విలువగల చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందచేశారు. తక్షణమే స్పందించి మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కు లబ్ధిదారులు,వారి కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి, కౌన్సిలర్ లు కుసరి అనిల్, పంబాల రాం కుమార్,నాయకులు పాల్గొన్నారు.

# మెగా హెల్త్ క్యాంప్న ప్రారంభించిన చెన్నూరు ఎమ్మెల్యే






చెన్నూర్ /రామకృష్ణాపూర్/డిసెంబర్ 07(వుదయం ప్రతినిధి) చెన్నూర్ పట్టణంలోని మైనారిటీ ఫంక్షన్ హాల్ లో లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా హెల్త్ క్యాంపును చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ప్రారంభించారు. ఈ మెగా హెల్త్ క్యాంపులో పెద్ద ఎత్తున పాల్గొన్న పట్టణ ప్రజలు పాల్గొన్నారు. వైద్య శిబిరాన్ని వినియోగించుకున్న పట్టణ ప్రజలకు లయన్స్ క్లబ్ ప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు. మెగా హెల్త్ క్యాంపు లో పాల్గొన్న డాక్టర్లను చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ శాలువాతో సత్కరించారు.

# రైతులను ఇబ్బందికి గురి చేస్తున్న రైస్ మిల్ పై చర్యలు తీసుకోవాలి

**లక్ష్మీ నరసింహ రైస్ మిల్ పై జాయింట్ కలెక్టర్ కు సిపిఎం ఫిర్యాదు**



శాయంపేట: 07 (వుదయం ప్రతినిధి) మండలంలోని గట్ల కనపర్తి గ్రామంలో ఉన్న లక్ష్మీ నరసింహ రైస్ మిల్ పై చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు డి.తిరుపతి జాయింట్ కలెక్టర్ ఏ.వెంకట్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గతంలో రబీ సీజన్ లో సీఎంఆర్, ఎగగొట్టడం, 75 ఏసీకే లకు అగ్రిమెంటు చేసుకొని 40 లక్షల డిపాజిట్ చేసి మిగతా 35 లక్షలను చెల్లించని రైస్ మిల్ కు ఎక్కువ ధాన్యాన్ని అందించడం వలన 40 ఏసీకే పూర్తయినక ఓ పి ఎం ఎస్ ఎస్ ఎంటర్ కాకపోవడంతో రైతులకు డబ్బులు అందడం లేదని, ప్రభుత్వం ధాన్యం అందించిన రైతులకు 48 గంటల్లోపు డబ్బులు జమ చేయాలని, ఆదేశించిన అమలు కావడం లేదని, ధాన్యం దిగుమతి కోసం రైతులు రోజుల తరబడి ఎదురు చూస్తున్నారని, తరుగు పేరుతో ధాన్యాన్ని తీసుకుంటున్నారని, సిఎంఆర్ ఎగొట్టిన మిల్లులకు ధాన్యం ఇవ్వద్దని ఆదేశాలున్న ప్రభుత్వ అధికారులు మాత్రం అవేమీ పట్టించుకోకుండా ధాన్యం సేకరణకు అవకాశం ఇచ్చారని, దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు.

## మార్కెట్ రేటు ప్రకారం నష్టపరిహారం చెల్లించాలి



యాదాద్రి భువనగిరి / తుర్కపల్లి : డిసెంబర్ వుదయం ప్రతినిధి : రీజనల్ రింగ్ రోడ్డు భూసేకరణలో భూములు కోల్పోతున్న రైతులకు మార్కెట్ రేట్ ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం మండల కార్యదర్శి పోతరాజు జహంగీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం తుర్కపల్లి మండల కేంద్రంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని ముందస్తు సమాచారంతో నిరసన కార్యక్రమాలు చేపట్టకుండా ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములు కోల్పోతున్న రైతులకు భూమికి బాధలు భూమి లేదా మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు కొక్కొండ లింగయ్య ,మండల కమిటీ నాయకులు తలారి మాతయ్య, కోట నాగరాజు పాల్గొన్నారు

# ప్రజాపాలన విజయోత్సవ వేడుకల్లో

**పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**
**గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థఎస్ ఈ ఆర్ పి మరియు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ డి ఆర్ డి ఏ ఆధ్వర్యంలో**



పినపాక నియోజకవర్గం డిసెంబర్07(వుదయం ప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాక తాళ్లగుమ్మూరులో ...తెలంగాణ రాష్ట్రం లో..నవంబర్ 9 నుండి డిసెంబర్ 9 వరకు ప్రజా పాలన విజయోత్సవాలు..మరియు ఇందిరా మహిళా శక్తి సంబరాలు..జరిగాయి. ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భాగంగా తాళ్ల గొమ్మురులోని సత్యనారాయణ స్వామి ఫంక్షన్హాల్ నందు...మండలం లోని స్వయం సహాయక సంఘాలతో ...సమావేశం నిర్వహించారు...ఆ కార్యక్రమం లో. గౌరవ శాసన సభ్యులు..పాయం వెంకటేశ్వర్లు చేతుల మీదుగా సుమారు 5 కోట్ల రూపాయల బ్యాంక్ లింకేజీ చెక్కులు పంపిణీచేశారు...అలాగే...కొత్తగా స్వయం సహాయక సంఘాలగా ఏర్పడిన సుమారు 10 సంఘాల సభ్యులకు ... బ్యాంక్ పాస్ బుక్స్ అందజేశారు మరియుమహిళా శక్తి పథకం ద్వారా 15 మంది లబ్ధిదారులకు పెరటి కోళ్ల యూనిట్స్ పంపిణీ చేశారు. అలాగే..30 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి/ షాది ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు మరియు ఇందిరమ్మ ఇల్లులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి..ముఖ్య అతిధి పినపాక శాసన సభ్యులు .పాయం వెంకటేశ్వర్లు పాల్గొనికార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. స్థానిక తాహశీల్దార్...యం పి డి ఓ...మరియు మండల గిర్ధావర్లు మరియుమండల అధికారులు,మండలంలోని మహిళా సంఘ సభ్యులు,గ్రామ సమైఖ్య సహాయకులు అధిక సంఖ్యలోపాల్గొన్నారు.

## ఓపెన్ హౌస్ లో భాగంగా జగిత్యాల పట్టణ టౌన్ పోలీస్ స్టేషన్ ను సందర్శించిన ఆల్ఫోర్స్ శివవీధి స్కూల్ విద్యార్థులు



జగిత్యాల జిల్లా ప్రతినిధి డిసెంబర్ 07( వుదయం ):బయట జరిగే ఎటువంటి అన్యాయాన్ని కూడా నేటి యువత ధైర్యంగా ప్రశ్నించాలని ప్రతి పౌరుడు కూడా యూనిఫామ్ లేని ఒక పోలీసు అధికారి అని జగిత్యాల పట్టణ టౌన్ సిఐ గారు వేణుగోపాల్ ఓపెన్ హౌస్ లో భాగంగా జగిత్యాల టౌన్ పోలీస్ స్టేషన్ ను సందర్శించిన ఆల్ఫోర్స్ శివ వీధి 3వ 4వ తరగతి విద్యార్థులను ఉద్దేశించి అన్నారు ఈ సందర్భంగా విద్యార్థులకు పోలీస్ స్టేషన్ లోని అన్ని రికార్డులను చూపించి వాటి గురించి తెలిపారు రిసెప్షన్ మరియు క్రైమ్ ఎంక్వైరీగ్ చార్జి సీటు, ఎఫ్ఐఆర్, ల్యాండ్ ఆర్డర్ ఏ విధంగా చేయాలి పోలీస్ డిపార్ట్మెంట్ వారు ప్రజల కోసం ఏర్పాటు చేసినటువంటి కార్యక్రమాలను ఏర్పాటు చేశారు, మహిళల యొక్క భద్రత గురించి పోలీస్ డిపార్ట్మెంట్ వారు షి-టీం ను ఏవిధంగా నిర్వహిస్తున్నారు, వైర్లెస్ కమ్యూనికేషన్ ఏ విధంగా నడుస్తుంది, సైబర్ క్రైమ్స్ ఈ మధ్య ఎలా మోసం చేస్తున్నారు వాటి గురించి మరియు ఎమర్జెన్సీ నెంబర్లను తెలియజేశారు ఈ సందర్భంగా అత్యవసరంగా 100 కు సైబర్ క్రైమ్ షీ టీం లకు 1930 నెంబర్లకు డయల్ చేయాలని వారికి అవగాహన కలిగించారు ఈ కార్యక్రమంలో జగిత్యాల టౌన్ ఎస్ఐ గారు కిరణ్ కుమార్ గారు మరియు మన్మధ రావు గారు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు



# బిజినెస్





## బుల్ జోష్‌లో స్టాక్ మార్కెట్లు..

### ఏడాదిలో లక్ష దాటనున్న సెన్సెక్స్


మోర్గాన్ స్టాన్లీ ఆర్థిక, సాంకేతికత, పారిశ్రామిక రంగాలపై సానుకూలంగా ఉందని, ఇతర రంగాలలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. అంతేకాకుండా, ఇటీవలి క్షీణత తర్వాత చిన్న, మధ్యస్థ కంపెనీల స్టాక్‌లు భారీ స్టాక్‌లను అధిగమించవచ్చు అంటూ తెలిపింది. వేగంగా వృద్ధి చెందుతున్న మార్కెట్లలో భారత స్టాక్ మార్కెట్ 2025లో అత్యుత్తమ పనితీరును కనబరుస్తుందని మోర్గాన్ స్టాన్లీ పేర్కొంది. తాజాగా అందించిన నివేదిక ప్రకారం, బీఎస్ఈ సెన్సెక్స్ 105,000 వరకు వెళ్లవచ్చని అమెరికన్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ తెలిపింది. ఇందుకు బలమైన ఆదాయాలు, ఆర్థిక స్థిరత్వంతోపాటు దేశీయ పెట్టుబడి కారణంగా ఉంటుందని చెప్పుకొచ్చింది. మోర్గాన్ స్టాన్లీ ప్రకారం, సెన్సెక్స్ 105,000కి చేరుకునేందుకు 30 శాతం అవకాశం ఉందని తెలిపింది. ఈ క్రమంలో సెన్సెక్స్ 93,000 వరకు వెళ్లవచ్చు అని ఉద్ఘాటించింది. ఇది ప్రస్తుత స్థాయి కంటే 14% ఎక్కువగా ఉంటుంది. మోర్గాన్ స్టాన్లీకి చెందిన రిధమ్ దేశాయ్ ప్రకారం, భారతదేశం ఆర్థిక క్రమశిక్షణను కొనసాగిస్తే, ప్రైవేట్ పెట్టుబడులను పెంచి, వడ్డీ రేట్లు, వృద్ధి మధ్య సమతుల్యతను కొనసాగిస్తే, సెన్సెక్స్ 23x P/E నిష్పత్తిలో ట్రేడ్ అయ్యే అవకాశం ఉంటుందని పేర్కొంది. ఇది గత 25 సంవత్సరాల సగటు కంటే 20 రెట్లు ఎక్కువ ఉంది. ప్రతిదీ సాధారణంగా ఉంటే, సెన్సెక్స్ ఆదాయాలు ప్రతి సంవత్సరం 17% పెరుగుతాయని మోర్గాన్ స్టాన్లీ అభిప్రాయపడింది. ఇందుకోసం, ఆర్థిక సంస్కరణలు, స్థిరమైన రిటైల్ పెట్టుబడి, నియంత్రిత స్టాక్ సరఫరా ఉండాలని సూచించింది. దీనితో పాటు భారత ఆర్థిక వ్యవస్థలో స్థిరత్వం, ప్రభుత్వ సంస్కరణలు, విదేశీ పెట్టుబడులు పెరగడం సెన్సెక్స్‌కు సానుకూల సంకేతాలుగా ఉంటాయని తెలిసింది.

## ఆర్థిక కేంద్రంగా క్షీణిస్తోన్న లండన్



లండన్ స్టాక్ ఎక్స్ఛేంజ్(ఎల్ఎస్ఈ)లో నమోదైన కంపెనీల సంఖ్య గత పదేండ్లలో తగ్గుముఖం పట్టడం వేగవంతమైందని తాను సంకలనం చేసిన డేటాను ఉటంకిస్తూ బ్లూమ్‌బెర్గ్ పేర్కొంది. 2024లో దాదాపు 45 సంస్థలు లండన్ స్టాక్ మార్కెట్ నుంచి తొలగించబడినట్టు తెలుస్తోంది. ఇది గత సంవత్సరం మొత్తం కంటే 10 శాతం ఎక్కువ. 2010 నుండి ఎక్స్ఛేంజ్ నుంచి నిష్క్రమించిన కంపెనీలు ఈ సంవత్సరం అత్యధిక సంఖ్యలో ఉన్నాయి. అదే సమయంలో, బ్రిటిష్ కార్పొరేషన్లను లక్ష్యంగా చేసుకున్న ఒప్పందాల పరిమాణం ఈ సంవత్సరం 81 శాతం పెరిగింది. వీటి విలువ 160 బిలియన్లకు పైగా ఉంది.వార్తా ఏజెన్సీ ద్వారా ట్రాక్ చేయబడిన డేటా కూడా ప్రస్తుత సంవత్సరం లో లండన్‌లో కేవలం 11 కంపెనీలు మాత్రమే ఐపీఓలను పూర్తి చేశాయని చూపిస్తుంది. ఇవి సమీకరించిన మొత్తం 1 బిలియన్. ఇది 2023లో అదే కాలంలో సేకరించిన మొత్తంతో పోలిస్తే 11 శాతం తగ్గింది. "బ్రిటన్ ఈ పరిస్థితిని సరిదిద్దక పోతే, అది తన స్థానాన్ని, ప్రాసంగికతను కోల్పోతుంది" అని పెట్టుబడి సంస్థ గేట్‌మోర్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్‌లో మేనేజింగ్ భాగస్వామి లియాడ్ మీదర్ బ్లూమ్‌బెర్గ్‌తో అన్నారు. "చాలా సరళంగా, కంపెనీలు సరైన మూలధన ధరను పొందలేవు. వారు కోరుకున్న విలువను పొందలేరు". విలీనాలు, కొనుగోళ్ల విషయానికి వస్తే ఓవర్సీస్ ప్రయివేట్ ఈక్విటీ సంస్థలు ప్రత్యేకంగా చురుకుగా ఉన్నాయని వార్తా సంస్థ పేర్కొంది. నవంబర్‌లో, ఫ్లోరిడాకు చెందిన స్టార్‌వుడ్ క్యాపిటల్ గ్రూప్ గత నెలలో లండన్-లిస్టెడ్ బ్యాలెన్స్‌డ్ కమర్షియల్ ప్రాపర్టీ ట్రస్ట్‌ను 852 మిలియన్లకు స్వాధీనం చేసుకుంది. స్వీడన్‌కు చెందిన ఇక్యూటి ఇటీవల వీడియో గేమ్ సేవల కంపెనీ కీవర్డ్స్ స్టూడియోస్ 2.7 బిలియన్ల కొనుగోలును మూసివేసింది. అయితే చికాగోకు చెందిన థామా బ్రావో సైబర్ సెక్యూరిటీ సాఫ్ట్‌వేర్ ప్రొవైడర్ డార్క్ ట్రేస్‌ను 5.3 బిలియన్లకు కొనుగోలు చేసింది. సమీప భవిష్యత్తులో మరిన్ని కొత్త ఒప్పందాలు రానున్నాయని మీడియా సంస్థ పేర్కొంది. బ్రిటన్-ఆధారిత భీమా దిగ్గజం అవివా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, అమండా బ్లాంక్, 4.2 బిలియన్ల టేకోవర్ బిడ్ చేసిన తర్వాత ప్రత్యర్థి డైరెక్ట్ లైన్ ఇన్సూరెన్స్ గ్రూప్ బోర్డుని ఒప్పించేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. అదే సమయంలో అమెరికా ఇన్వెస్ట్‌మెంట్ మేజర్ జనరల్ అట్లాంటిక్ ఆన్‌లైన్ ట్రైనింగ్ బిజినెస్ లెర్నింగ్ టెక్నాలజీస్ గ్రూప్‌ను 1 బిలియన్‌కు కొనుగోలు చేయబోతున్నట్లు ప్రకటించింది.

## రైతులకు రుణ పరిమితి పెంపు




ముంబయి : అధిక వడ్డీ రేట్లతో ఒత్తిడిని ఎదుర్కొంటున్న రుణ గ్రహీతలకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) మరోమారు నిరాశనే మిగిల్చింది. మరోవైపు రైతులకు రుణ పరిమితిని పెంచి.. వ్యవసాయ రంగానికి కొంత ఉపశమనం కలిగించింది. డిసెంబరు 4 నుంచి మూడు రోజుల పాటు జరిగిన ద్రవ్య పరపతి విధాన సమీక్షా (ఎంపిసి) భేటీ నిర్ణయాలను శుక్రవారం ఆర్‌బిఐ గవరుర్ శక్తికాంత దాస్ మీడియాకు వెల్లడించారు. చిను, సనుకారు రైతులకు తనఖా రహిత వ్యవసాయ రుణాల పరిమితిని రూ.2 లక్షలకు పెంచుతున్నామన్నారు. ప్రస్తుతం ఈ పరిమితి రూ.1.6 లక్షలుగా ఉంది. పెంచిన రుణ పరిమితిని రైతులు ఎలాంటి తనఖా లేకుండా బ్యాంక్‌ల నుంచి పొందవచ్చన్నారు. పెట్టుబడి ఖర్చులు, ద్రవ్యోల్బణం, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకుని రుణ పరిమితిని పెంచామని శక్తికాంత తెలిపారు. ఇంతక్రితం 2019లో ఈ పరిమితిని రూ.1 లక్ష నుంచి రూ.1.6 లక్షలకు పెంచుతూ ఆర్‌బిఐ నిర్ణయం తీసుకుంది. కీలక వడ్డీ రేట్లను వరుసగా 11వ సారి యథాతథంగా కొనసాగించాలని ఆర్‌బిఐ నిర్ణయించింది. అయితే బ్యాంకుల్లో నగదు లభ్యత సమస్యలను పరిష్కరించాలని భావించినట్లు శక్తికాంత తెలిపారు. ఇందుకోసం నగదు నిల్వల నిష్పత్తి (సిఆర్ఆర్)ను 4.5 శాతం నుంచి 4 శాతానికి తగ్గించామన్నారు. దీంతో బ్యాంకులు మరిన్ని రుణాలు మంజూరు చేసేందుకు వీలుంటుందన్నారు. ఈ నిర్ణయంతో బ్యాంకింగ్‌లోకి అదనంగా రూ.1.16 లక్షల కోట్ల నిధులు అందుబాటులోకి రానున్నాయన్నారు. ఖాతాదారుల డిపాజిట్లలో కొంత సొమ్మును ఆర్‌బిఐ వద్ద జమ చేయడమే సిఆర్ఆర్. దీంతో డిపాజిట్‌దారుల సొమ్ముకు రక్షణ కల్పించాలనేది దీని ప్రధాన ఉద్దేశ్యం. అదే విధంగా ఇకపై చిను బ్యాంకులు కూడా యుపిఐ ద్వారా క్రెడిట్ లైన్‌ను ఆఫర్ చేసేందుకు అనుమతి కల్పించినట్లు శక్తికాంత తెలిపారు. వరుసగా 11వ సారి రెపో రేటును 6.5 శాతం వద్ద కొనసాగిస్తున్నట్లు శక్తికాంత వెల్లడించారు. 2023 ఫిబ్రవరి నుంచి ఈ వడ్డీ రేటు మారలేదు. ద్రవ్యోల్బణం, ఇతర అంశాలను దృష్టిలో పెట్టుకొనిఈసారి కూడా మార్పులు చేయొద్దనినిర్ణయించామన్నారు. 2024-25లో వాస్తవ జిడిపి వృద్ధి రేటు 6.6శాతంగా ఉండొచ్చని అంచనా వేశారు. గత సమీక్షాలో ఈ అంచనా 7.2 శాతంగా ఉంది. జులై-సెప్టెంబరు త్రైమాసికంలో వృద్ధి రేటు అంచనాల కంటే భారీగా తగ్గి 5.4 శాతంగా నమోదయ్యింది. దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25కుగాను జిడిపి అంచనాలకు భారీగా కోత పెట్టింది. ఇంతక్రితం 2023-24లో ఏకంగా 8.2 శాతం వృద్ధి చోటు చేసుకుంది. దీంతో పోల్చితే భారీగా తగ్గనుందనిస్పష్టమవుతోంది. 2024-25లో రిటైల్ ద్రవ్యోల్బణం అంచనాలను ఆర్‌బిఐ పెంచింది. గతంలో దీన్ని 4.5శాతంగా పేర్కొనగా.. తాజాగా 4.8శాతానికి పెరగొచ్చనివిశ్లేషించింది. ఆహార పదార్థాల ధరల పెరుగుదలతో ద్రవ్యోల్బణం అంచనాలను పెంచాల్సి వచ్చిందనిశక్తికాంత తెలిపారు. బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు బలంగా కొనసాగుతున్నాయన్నారు. రూపాయి విలువను బలోపేతం చేసేందుకు ఎన్ఆర్ఐ డిపాజిట్లపై వడ్డీ రేటు పరిమితిని పెంచుతున్నామన్నారు.

## లైట్ వాలెట్‌పై లావాదేవీ పరిమితి పెంపు..




చిన్న చెల్లింపుల కోసం యూపీఐ లైట్ ను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. వినియోగదారులు ఇంటర్నెట్ లేకుండానే దీని ద్వారా లావాదేవీలు చేయవచ్చు. ఆఫ్లైన్ చెల్లింపుల కింద ఫోన్ లో ఇంటర్నెట్, ఎలాంటి నెట్ వర్క్ లేకపోయినా చెల్లింపులు చేయవచ్చు. అంతేకాకుండా.. యూపీఐ వినియోగదారులు ఎలాంటి పిన్ ను నమోదు చేయకుండానే లావాదేవీలు చెల్లించవచ్చు. ఈ క్రమంలోనే యుపిఐ గురించి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక ప్రకటన చేసింది. యూపీఐ లావాదేవీల పరిమితిని పెంచడానికి ఆర్బీఐ గవర్నర్ శక్తి కాంత దాస్ ఆమోదం తెలిపారు. వినియోగదారులకు ప్రతి లావాదేవీ పరిమితి రూ. 1000గా మారింది. ఇక వాలెట్ లావాదేవీ పరిమితి అయితే రూ.2000 నుంచి రూ.5000కి పెరిగింది. ఒక్కో చెల్లింపుల పరిమితి రూ.500 నుంచి రూ.1000కి పెరిగింది.





## అమెరికాలో ఇషా అంబానీ బంగ్లాను కొన్న హాలీవుడ్ స్టార్ కపుల్..

ముఖేష్ అంబానీ కుమార్తె ఇషా అంబానీ అమెరికాలోని బెవర్లీ హిల్స్‌లో తన విలాసవంతమైన ఇంటిని విక్రయించింది. హాలీవుడ్‌కు చెందిన స్టార్ కపుల్ ఈ లగ్జరీ బంగ్లాను కొనుగోలు చేశారు. ఇంతకీ ఇషా అంబానీ బంగ్లా ఎన్ని కోట్లకు అమ్ముడైందో తెలుసా? ముఖేష్ అంబానీ కుమార్తె ఇషా అంబానీ తన తండ్రిలాగే మంచి పారిశ్రామికవేత్తగా ముద్ర వేసుకుంది. ఇషా అంబానీకి భారత్‌తో సహా అనేక దేశాల్లో విలాసవంతమైన బంగ్లాలు ఉన్నాయి. అయితే తాజాగ ఆమె అమెరికాలోని తన విలాసవతమైన ఇంటిని విక్రయించింది. హాలీవుడ్‌లోని ప్రముఖ జంట ఇషా అంబానీ ఇంటిని కొనుగోలు చేసింది. అది కూడా భారీ ధరకే. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. హాలీవుడ్‌లోని బెవర్లీ హిల్స్‌లో ఇషా అంబానీకి భారీ ఇల్లు ఉంది. 5.2 ఎకరాల్లో విస్తీర్ణంలో అత్యంత విలాసవంతమైన ఈ ఇల్లు ఇషా అంబానీ పేరు మీదగానే ఉంది. సుమారు 10 సంవత్సరాల క్రితం ఈ ఇంటిని కొనుగోలు చేశారామె. అయితే ఈ లగ్జరీ ఇంట్లో ఇషా అంబానీ ఈ ఇంట్లో చాలా తక్కువ కాలం మాత్రమే ఉన్నారు. గర్భంతో ఉన్నప్పుడు అంటే 2022లో ఇషా ఇక్కడే గడిపారు. ఆ సమయంలో ఆమె తల్లి అనితా అంబానీ కూడా ఈ ఇంట్లోనే ఉన్నారు. అయితే ఇప్పుడు ఈ ఇల్లు అమ్ముడుపోయింది. ఈ ఇంటిని గత ఐదేళ్లుగా అమ్మకానికి ఉంచారు. చివరకు హాలీవుడ్ స్టార్ కపుల్ జెన్నిఫర్ లోపెజ బెన్ అఫ్లెక్ ఈ ఇంటిని రూ. 508 కోట్లకు కొనుగోలు చేశారు. ఈ ఇంట్లో 12 బెడ్‌రూమ్‌లు, 24 బాత్‌రూమ్‌లు ఉన్నాయి. అలాగే విశాలమైన స్విమ్మింగ్ పూల్, పికిల్ బాల్ కోర్ట్, విశాలమైన వినోద ప్రదేశం, సెలూన్, ప్రైవేట్ జిమ్, విశాలమైన డైనింగ్ ఏరియాతో పాటు అనేక ఇతర విలాసవంతమైన సౌకర్యాలు ఉన్నాయి. హాలీవుడ్ స్టార్ నటుల్లో బెన్ అఫ్లెక్ ఒకరు. అతను ఆస్కార్ విజేత 'అర్గో', 'గాన్ గర్ల్' సహా పలు టాప్ హాలీవుడ్ సినిమాల్లో నటించాడు. బెన్ అఫ్లెక్ 'జస్టిస్ లీగ్' సినిమా సిరీస్‌లో బ్యాట్‌మ్యాన్ పాత్రను కూడా పోషించాడు. ఇక అతని భార్య జెన్నిఫర్ లోపెజ్, పాప్ ప్రపంచంలో అతిపెద్ద స్టార్. ఈమెకు భారత్ తో పాటు ప్రపంచ వ్యాప్తంగా క్రేజ్ ఉంది.

# జాతీయం – అంతర్జాతీయం




## విమానాలకు బెదిరింపుల కేసులు ఎన్ఐఏకి బదిలీ

న్యూఢిల్లీ: ఢిల్లీ నుంచి నడుస్తున్న వివిధ విమానయాన సంస్థల విమానాలకు బెదిరింపులకు సంబంధించి నమోదైన కనీసం 16 కేసులను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కి బదిలీ చేసే అవకాశం ఉందని అధికారులు శుక్రవారం తెలిపారు. కేసులను ఎన్ఐఏకు బదిలీ చేయాలని ఢిల్లీ పోలీసులు నగర ప్రభుత్వ హెూం శాఖకు లేఖ రాశారని, తుది ఆమోదం కోసం కేంద్ర హెూం మంత్రిత్వ శాఖకు పంపుతామని వారు తెలిపారు. "ఈ విషయం జాతీయ భద్రతకు సంబంధించినది. ఇది అంతర్జాతీయంగా ప్రభావం చూపుతుంది. ఈ 16 కేసులన్నీ బిఎన్ఎస్ సెక్షన్లతో కూడిన పౌర విమానయాన భద్రత (ఎస్‌యుఎ ఎస్‌సిఎ) చట్టంపై చట్టవిరుద్ధమైన చట్టాలను అణచివేయడం కింద నమోదు చేయబడ్డాయి. వాటిపై లోతైన దర్యాప్తు అవసరం "అని అధికారిక వర్గాలు తెలిపాయి. అక్టోబరు చివరి రెండు వారాల్లో, 510 కంటే ఎక్కువ దేశీయ, అంతర్జాతీయ విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. అవి తర్వాత బూటకమని తేలింది. దీనివల్ల దేశవ్యాప్తంగా ఎయిర్‌లైన్స్‌కు పెద్ద కార్యాచరణ, ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. సోషల్ మీడియా ద్వారా చాలా వరకు బెదిరింపులు వచ్చాయి. ఢిల్లీ నుంచి నడిచే 150కి పైగా దేశీయ లేదా అంతర్జాతీయ విమానాలకు బెదిరింపులు రావడంతో 16 కేసులు నమోదు చేసినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. అక్టోబరు 16న బెంగుళూరు వెళ్లే అకాసా ఎయిర్ విమానాన్ని లక్ష్యంగా చేసుకుని ఎక్స్ ద్వారా బాంబు బెదిరింపు రావడంతో మొదటి కేసు నమోదైంది.

180 మందికి పైగా ప్రయాణికులతో ఉన్న విమానం దేశ రాజధానికి తిరిగి రావాల్సి వచ్చిందని వారు తెలిపారు. ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ పోలీసులు, ఢిల్లీ పోలీసుల సైబర్ సెల్‌తో కలిసి ఈ విషయంపై విచారణ జరిపారు, కాని ఇప్పటి వరకు వారికి ఏ కేసులోనూ లీడ్ లభించలేదు.

## ప్రధాని బార్నియర్ రాజీనామా



పారిస్: ప్రధానమంత్రి రాజీనామాతో ఫ్రెంచ్ రాజకీయ సంక్షోభం మరింత ముదిరింది. ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో మిచెల్ బార్నియార్ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం కుప్పకూలింది. మొత్తం 577 స్థానాలున్న పార్లమెంటులో 331 మంది సభ్యులు అవిశ్వాస తీర్మానానికి మద్దతు తెలపడంతో బార్నియర్‌కు ఘోర పరాభవం ఎదురైంది. ఫ్రాన్స్ చరిత్రలో అతి తక్కువ కాలం పాటు ప్రధానిగా ఉన్న వ్యక్తిగా బార్నియర్ నిలిచాడు. ఇప్పుడతని స్థానంలో కొత్త ప్రధానిని నియమించేందుకు అధ్యక్షుడు మాక్రాన్ కసరత్తు ప్రారంభించారు. సౌదీ అరేబియాలో పర్యటనను అర్థాంతరంగా ముగించుకుని స్వదేశానికి తిరిగి వచ్చిన బార్నియర్ శుక్రవారం తన రాజీనామా లేఖను అధ్యక్షుడి ఆమోదానికి పంపారు. బడ్జెట్‌లో సామాజిక భద్రతకు నిధుల కోత పెట్టే పలు పొదుపు చర్యలను ప్రభుత్వం ప్రతిపాదించడంతో అన్ని వైపుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. దీంతో పార్లమెంటు ఆమోదంతో నిమిత్తం లేకుండా కార్యనిర్వాహక అధికారాలను ఉపయోగించి బడ్జెట్ ఆమోదం పొందినట్లు ప్రభుత్వం ప్రకటించుకుంది. దీనిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన రాడికల్ లెఫ్ట్, పచ్చి మితవాది మేరీ లీపెన్ నాయకత్వంలనో నేషనల్ ర్యాలీ పార్టీలు రెండూ అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటు వేయడంతో ప్రభుత్వం పతనమైంది. ఇది బార్నియర్ ప్రభుత్వ వైఫల్యం మాత్రమే కాదు, అధ్యక్షుడు మాక్రాన్ వైఫ్యలం కూడా. అందుకే అధ్యక్షుడిగా మాక్రాన్ కూడా తప్పుకోవాలన్న డిమాండ్ ఊపందుకుంది. దేశ అభివృద్ధికి పెద్ద అడ్డంకి మాక్రానేనని రాడికల్ లెఫ్ట్ పార్టీ నాయకుడు మెథిల్డే పనోట్ అన్నారు. బార్నియర్ నిష్క్రమణ మాక్రాన్ ప్రభుత్వ దుర్బలత్వాన్ని తెలియజేస్తోంది. మాక్రాన్ మాత్రం తన పదవీ కాల పరిమితి పూర్తయ్యే దాకా గద్దె దిగే ప్రసక్తే లేదంటున్నారు. అధ్యక్షునిగా మాక్రాన్ పదవీ కాల పరిమితి 2025 సంవత్సరంలో ముగుస్తుంది. పార్లమెంటరీ మెజార్టీ లేకుండా ఎన్నికైన అతని ప్రభుత్వం బడ్జెట్‌ను ఆమోదించడానికి బలహీనమైన పొత్తులపై ఆధారపడింది. ఈ ఎత్తుగడ ఇప్పుడు బెడిసికొట్టింది.

## ఉక్రెయిన్ సంఘర్షణకు బైడెనే కారణం

2022లో అమెరికా జోక్యం ఉక్రెయిన్ వివాదానికి దారితీసిందని హంగేరియన్ ప్రధాని విక్టర్ ఓర్బన్ అన్నారు. వివాదానికి సంబంధించిన విధానంలో వాషింగ్టన్‌కు "కామన్‌సెన్స్ గానీ, సంయమనంగానీ లేవని" మాస్కో ఆరోపించిన తర్వాత ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం పబ్లిక్ బ్రాడ్‌కాస్టర్ కొసుత్ రేడియోకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఓర్బన్ ఈ వివాదంలో అమెరికా నిర్ణయాత్మక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. "ఈ యుద్ధంలో ప్రధాన ఆటగాళ్లలో అమెరికా ఒకటి. అమెరికా లేకుండా అసలు ఈ యుద్ధం జరిగేదే కాదు. అమెరికా మద్దతు లేకుండా ఉక్రెయిన్ ప్రతిఘటించేది కాదు" అని మాగ్యార్ నెమ్ జెట్ వార్తా పత్రికను ఉటంకిస్తూ ప్రధాని అన్నారు. అధికారిక లెక్కల ప్రకారం, సెప్టెంబర్ 30 నాటికి వాషింగ్టన్ ఉక్రెయిన్ కోసం దాదాపు 183 బిలియన్ల సహాయాన్ని కేటాయించింది. ప్రస్తుత అమెరికా ప్రెసిడెంట్ జో బైడెన్ సంఘర్షణ స్థాయిని పెంచాలనుకుంటున్నారని, అధ్యక్షుడిగా ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్ "శాంతి అనుకూలుడు" అని ఓర్బన్ అన్నారు. ఈ వారం ప్రారంభంలో, అమెరికా విదేశాంగ శాఖ కీవ్ కోసం 725 మిలియన్ల సహాయాన్ని ప్రకటించింది. ఇందులో ఎయిర్-డిఫెన్స్ సామర్థ్యాలు, రాకెట్ సిస్టమ్‌లు, ఫిరంగి దళాల కోసం ఆయుధాలు, ట్యాంక్ వ్యతిరేక ఆయుధాలు ఉన్నాయి. అమెరికా విదేశాంగ కార్యదర్శి ఆంటోనీ బ్లింకెన్ ఇటీవల కీవ్‌ను సైన్యంలో చేరేందుకు కనీస నిర్బంధ వయస్సును 25 ఏండ్ల నుంచి తగ్గించాలని పిలుపునిచ్చారు.



దీనిని "భయంకరమైనది, ఎందుకంటే ఇంకా ఎక్కువ మంది ఉక్రేనియన్లు చనిపోతారు" అని ఓర్బన్ అభివర్ణించారు. అమెరికన్ విధానాలు మారడానికి ఇది సమయం ఎందుకంటే అవి "స్థిరమైనవి" అని ఓర్బన్ వాదించారు. హంగేరీ "ఈ యుద్ధాన్ని త్వరగా ముగించాలనే డోనాల్డ్ ట్రంప్ లక్ష్యం త్వరగా వాస్తవ రూపం దాల్చేలా గట్టిగా ఒత్తిడి చేస్తోంది" అని గురువారంనాడు హంగేరీ విదేశాంగ మంత్రి పీటర్ స్జిజార్టో అన్నారు. ఉక్రెయిన్‌లో శాంతిని సాధించడంలో విఫలమైతే సమస్య నిత్యం తీవ్రతరమయ్యే ప్రమాదాన్ని పెంచుతుందని హెచ్చరించారు.

## ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం




న్యూఢిల్లీ : ఢిల్లీ ఓటర్ల జాబితా నుండి భారీ సంఖ్యలో ఓటర్ల పేర్లను తొలగించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని ఆప్ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పేర్కొన్నారు. ప్రజల ఓట్లను తొలగించి, ఓటు ద్వారా ప్రభుత్వాన్ని ఎన్నుకునే వారి ప్రాథమిక హక్కునిలాక్కోవడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని చెప్పారు. ప్రస్తుత ఎన్‌డిఎ ప్రభుత్వం, ఎన్నికల సంఘం ప్రజల హక్కునిలాక్కుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. షహదారా ప్రాంతం నుండి 11,018 మంది ఓటర్ల పేర్లను తొలగించాల్సిందిగా బిజెపి దరఖాస్తు చేసిందని, వాటిలో 500 పేర్లపై క్రాస్ చెక్ చేసినపుడు 75 శాతం మంది ఆ ప్రాంతంలోనే నివసిస్తున్నట్లు తేలిందనిచెప్పారు. 2020 ఎన్నికల్లో షహదారా అసెంబ్లీ స్థానం నుండి ఆప్ నేత రామ్ నివాస్ గోయల్ బిజెపి నేత సంజరు గోయల్‌పై సుమారు 5,000 ఓట్ల తేడాతో విజయం సాధించారనికేజ్రీవాల్ గుర్తు చేశారు. ప్రస్తుతం ఆ నియోజకవర్గం నుండి 11,000 మంది ఓటర్లను తొలగించనున్నారని, వారిలో అధికశాతం మంది ఆప్ మద్దతుదారులేననితెలిపారు. ఒక నియోజకవర్గంలో ఆరు శాతం ఓట్లు తగ్గితే.. ఎన్నికలు నిర్వహించి ప్రయోజనమేమిటని ప్రశ్నించారు. 2025లో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో 70 స్థానాలకుగాను ఆప్ 62 స్థానాలను గెలుచుకోగా, బిజెపి ఎనిమిది స్థానాలకే పరిమితమైంది.

## 'మోడీ–అదాని భాయి భాయి'



న్యూఢిల్లీ: 'మోడీ–అదాని భాయి భాయి' అంటూ ప్రతిపక్ష ఇండియా బ్లాక్ ఎంపిల నినాదాలతో పార్లమెంట్ ఆవరణ దద్దరిల్లింది. అదాని ముడుపుల వ్యవహారంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి)తో విచారణ జరిపించాలని ప్రతిపక్ష పార్టీల నేతలు మార్చ్ నిర్వహించారు. శుక్రవారం ఉదయం ఉభయ సభలు తిరిగి సమావేశం కావడానికి ముందు పార్లమెంట్ ఆవరణలో ప్రతిపక్ష పార్టీ ఎంపిలు 'మోడీ అదాని భాయి భాయి' అని ఇంగ్లీష్‌లో రాసి ఉన్న బ్లాక్ మాస్క్‌లు ధరించి నిరసన తెలిపారు. చేతిలో ఎరుపు రంగులోని రాజ్యాంగ ప్రతిని పట్టుకొని పార్లమెంట్ పాత భవనం నుంచి పార్లమెంట్ ఆవరణలోని అంబేద్కర్ విగ్రహం వరకు మార్చ్ నిర్వహించారు. ధర్నాలో ఇండియా బ్లాక్‌లోని కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ, సిపిఐఎంఎల్, ఆర్‌జెడి, జెఎంఎం, డిఎంకె, ఎన్‌సిపి, ఆప్, ఐయుఎంఎల్, విసికె, కేరళ కాంగ్రెస్ తదితర పార్టీల ఎంపిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'మోడీ %-% అదాని ఏక్ హై, మోడీ–అదాని భాయి భాయి' అంటూ పెద్దపెట్టున నినదించారు. ఈ మార్చ్ ముగింపులో భాగంగా అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. అదాని వ్యవహారంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి)తో దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. అదానిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అదాని వ్యవహారంపై పార్లమెంట్‌లో చర్చించేందుకు మోడీ సర్కార్ భయపడుతోందని ప్రియాంక గాంధీ అన్నారు. ఇలాంటి పరిస్థితి అసలు ఎందుకు వచ్చిందని కేంద్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



## యూన్ అధికారాల నిలిపివేత.. పాలక పార్టీ మద్దతు

సియోల్ : దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్‌సుక్ యేల్ రాజ్యాంగ అధికారాల నిలిపివేతకు పాలక కన్జర్వేటివ్ పీపుల్ పవర్ పార్టీ (పిపిపి) చీఫ్ హన్ డాంగ్ హూన్ శుక్రవారం మద్దతు తెలిపారు. యూన్ అధ్యక్ష బాధ్యతలు, అధికారాన్ని వెంటనే నిలిపివేయాల్సి వుందని పార్టీ సమావేశంలో పేర్కొన్నారు. యూన్ తిరిగి మార్షల్ లాను విధించేందుకు యత్నించడం వంటి విపరీత చర్యలకు దిగే ప్రమాదం ఉందని, ఇది పౌరులను ప్ర మాదంలో పడేస్తుందని అన్నారు. సైనిక చట్ట అమలు సమయంలో దేశ వ్యతిరేక కార్యకలాపాలు ఆరోపణల ఆధారంగా కొందరు కీలక నేతలను అరెస్ట్ చేసి, నిర్బంధించాల్సిందిగా యూన్ దేశ డిఫెన్స్ కౌంటర్‌ఇంటెలిజెన్స్ కమాండర్ (డిసిసి)ని ఆదేశించినట్లు తమకు నిఘా సమాచారం అందిందని హాన్ తెలిపారు. రిపబ్లిక్ ఆఫ్ కొరియా, దాని ప్రజలను రక్షించడానికి అధ్యక్షుడు యూన్‌సుక్ యేల్ అధికార బాధ్యతలను తక్షణమే నిలిపివేయడం అత్యవసరమని తాను నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. మార్షల్ లా విధించడం రాజ్యాంగ విరుద్ధం అని గతంలో హాన్ వాదించిన సంగతి తెలిసిందే. ప్రతిపక్షాలు ఇప్పటికే అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టాయి. దీనిపై చర్చ అనంతరం శనివారం ఓటింగ్‌కు వెళ్లనుంది.

## ఫెంగల్ తుపాను సాయంగా తమిళనాడుకు రూ.944 కోట్లు

న్యూఢిల్లీ: ఫెంగల్ తుపాను కారణంగా దెబ్బ తిన్న తమిళనాడుకు రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి నుంచి రూ.944 కోట్లు విడుదలజేయడానికి కేంద్ర హెూం మంత్రిత్వశాఖ శుక్రవారం ఆమోదం తెలిపింది. దీనిని రెండు విడతలుగా అందజేయనున్నట్లు ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది. కేంద్ర బృందం నుండి మదింపు నివేదికలను స్వీకరించిన తర్వాత జాతీయ విపత్తు ప్రతిస్పందన నిధి నుండి అదనపు నిధులు ఇచ్చే విషయం పరిశీలిస్తామని హెూం శాఖ హామీ ఇచ్చింది. కేరళలో వయనాడ్ బాధితులకు కేంద్రం ఇప్పటికీ ఒక్క పైసా కూడా సాయం అందజేయకపోవడం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ వివక్ష ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. ఫెంగల్ నష్టాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలని, తమిళనాడుకు యుద్ధ ప్రాతిపదికన సహాయం ప్రకటించాలని కేంద్రాన్ని ఆలిండియా కిసాన్ సభ (ఎఐకెఎస్) డిమాండ్ చేసింది. ఇటీవల ఫెంగల్ తుపాను కారణంగా తమిళనాడు నాడులో జరిగిన నష్టాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలని, ఆ రాష్ట్రానికి యుద్ధ ప్రాతిపదికన సహాయం ప్రకటించాలని కేంద్రాన్ని ఆలిండియా కిసాన్ సభ (ఎఐకెఎస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. ఫెంగల్ కారణంగా తమిళనాడులో ఇప్పటి వరకూ 24 మంది మరణించారని, ఎనిమిది జిల్లాల్లో 3 లక్షలకు పైగా ఎకరాల్లో వరి పంట దెబ్బతిందన్నారు. మొత్తంగా ఆరు లక్షలకు పైగా ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, వేల కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని తెలిపింది. రాష్ట్రంలో మౌలిక సదుపాయాలకు, విద్యుత్ సరఫరాకు తీవ్రనష్టం వాటిల్లిందని పేర్కొంది. సుమారు కోటిన్నర మంది తుపాను బారినపడ్డారని, అనేక మంది జీవనోపాధి దెబ్బతిందని తెలిపింది. కేంద్రం తక్షణమే సాయం అందించాలని కోరింది. తుపాను బాధిత గ్రామాల్లో ప్రజలకు ఎఐకెఎస్ వలంటీర్లు సహాయం చేస్తున్నారని తెలిపింది.

## 74ఏళ్ల వయసులో గుడ్డు పెట్టిన పక్షి

ప్రపంచంలోనే అత్యంత వయస్సు గల అడవి పక్షి(74) గుడ్డు పెట్టిందని అమెరికా జీవశాస్త్రవేత్తలు తెలిపారు. విస్డమ్ అనే పొడవాటి రెక్కలున్న సముద్రపక్షి. లేసన్ ఆల్బాట్రాస్, హవాయి ద్వీపసమూహం యొక్క వాయువ్య అంచున ఉన్న మిడ్‌వే అటోల్ నేషనల్ వైల్డ్‌లైఫ్ రెఫ్యూజ్‌కి తిరిగి వచ్చి గుడ్డు పెట్టిందని నిపుణులు అంచనా వేశారు. విజ్డమ్, తన జంట పక్షితో కలిసి 2006 నుండి గుడ్లు పెట్టడానికి, పొదుగడానికి పసిఫిక్ మహాసముద్రంలోని అటోల్‌కు తిరిగి వచ్చారు. ఇవి జీవితాంతం సహజీవనం చేస్తూ, సంవత్సరానికి ఒక గుడ్డు పెడతాయి. ఆల్బాట్రాస్ తల్లిదండ్రులు దాదాపు రెండు నెలల పాటు గుడ్డును పొదిగిస్తారు. పిల్లలు పొదిగిన ఐదు నుండి ఆరు నెలల తర్వాత సముద్రానికి ఎగురుతాయి. అవి వాటి జీవితంలో ఎక్కువ భాగం సముద్రం మీదుగా ఎగురుతూ, స్క్విడ్ మరియు చేపల గుడ్లను తింటారు. ఈ పక్షి చివరిగా 2021లో పొదిగినట్లు నిపుణులు తెలుపుతున్నారు.

## అమెరికాలో భారీ భూకంపం



కాలిఫోర్నియా: అమెరికాలోని కాలిఫోర్నియా తీర ప్రాంతంలో భారీ భూకంపం సంభవించింది. అమెరికా కాలమానం ప్రకారం.. గురువారం ఉదయం 10.44 గంటలకు ఈ ప్రకృతి విపత్తు చోటు చేసుకున్నది. భూకంప తీవ్రత రిక్టర్‌స్కేల్‌పై ఏడుగా నమోదైంది. ఫెర్న్‌డెల్ పట్టణంలో భూకంప కేంద్రం నమోదయినట్టు అమెరికా జియోగ్రఫికల్ సర్వే విభాగం వెల్లడించింది. భారీ భూకంపం రావడంతో అమెరికా సునామీ కేంద్రం ముందస్తు చర్యగా సునామీ హెచ్చరికలు జారీ చేసింది. ఆ తర్వాత కాసేపటికే అధికారులు దానిని ఉపసంహరించుకున్నారు. భూకంప ప్రభావంతో పెట్రోలియా, స్కాటియా, కాబ్ తదితర ప్రాంతాల్లో శక్తిమంతమైన ప్రకంపనలు నమోదయ్యాయి. అయితే, దీని ప్రభావంతో ఏర్పడిన ప్రాణ, ఆస్తి నష్టాల సమాచారం తెలియాల్సి ఉంది. ఉత్తర దిశలో వచ్చిన భూ ప్రకంపనలు దక్షిణ ప్రాంతంలోని శాన్‌ఫ్రాన్సిస్కో వరకు వచ్చాయంటే తీవ్రత అర్థం చేసుకోవచ్చు. భూకంపంతో భవనాల్లోని ప్రజలు ఆందోళనతో భయభ్రాంతులకు లోనయ్యారు. భూకంపం ఆగిన తర్వాత కూడా ప్రకంపనలు వచ్చాయి.



# చక్కని ఆరోగ్యం



## క్యాప్సికమ్ ప్రయోజనాలు తెలుసా?

క్యాప్సికం లో ఉండే గుణాలు కీళ్ల నొప్పులను నియంత్రించేందుకు కూడా కీలక పాత్ర పోషిస్తాయి. ఇందులో ఉండే క్యాప్సైసిన్ యూరిక్ యాసిడ్ ను నియంత్రించేందుకు ఎంతగానో సహాయపడుతుంది. అంతేకాకుండా అనేక రకాల సమస్యలను తగ్గించేందుకు కీలక పాత్ర పోషిస్తుంది. క్యాప్సికం తినాలంటే.. చాలా మంది వెనుకడుగు వేస్తుంటారు. కానీ, క్యాప్సికమ్‌లో దాగివున్న ఆరోగ్య ప్రయోజనాలు తెలిస్తే మాత్రం ఆశ్చర్యపోతారు. ఇందులో శరీరానికి అవసరమయ్యే విటమిన్లు యాంటీ ఆక్సిడెంట్లు అధిక మోతాదులో లభిస్తాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు..ఇందులో విటమిన్ సి కూడా అధికంగా ఉంటుంది. దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడకుండా శరీరాన్ని రక్షించేందుకు కీలక పాత్ర పోషిస్తుంది. క్యాప్సికమ్ తినటం వల్ల కలిగే మరిన్ని లాభాలేంటో ఇక్కడ తెలుసుకుందాం..క్యాప్సికమ్ లో విటమిన్స్ ఎక్కువగా ఉంటాయి. ఇవి శరీరంలోని ఐరన్ లోపాన్ని తగ్గిస్తుంది. రక్తహీనతను కూడా నిరోధిస్తుంది. బరువు తగ్గడానికి క్యాప్సికమ్ చక్కగా ఉపయోగపడుతుంది. క్యాప్సికమ్ లో ఉబకాయాన్ని కరిగించే పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. క్యాప్సికంలో ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మలబద్ధకం, అజీర్ణం వంటి సమస్యలను తగ్గిస్తుంది. క్యాప్సికం లో ఉండే గుణాలు కీళ్ల నొప్పులను నియంత్రించేందుకు కూడా కీలక పాత్ర పోషిస్తాయి. ఇందులో ఉండే క్యాప్సైసిన్ యూరిక్ యాసిడ్ ను నియంత్రించేందుకు ఎంతగానో సహాయపడుతుంది. అంతేకాకుండా అనేక రకాల సమస్యలను తగ్గించేందుకు కీలక పాత్ర పోషిస్తుంది. కంటి ఆరోగ్యానికి క్యాప్సికమ్ ఎక్కువగా పనిచేస్తుంది. క్యాప్సికమ్ లో లుటిన్, జియాక్సంతిన్ పోషకాలు పుష్కలంగా ఉంటాయి. క్యాప్సికంలో ఉంటే బీటా కెరోటిన్ కళ్ళ ఆరోగ్యానికి చాలా మంచిది. కంటి చూపును మెరుగుపరచడమే కాకుండా అన్ని రకాల కంటి సమస్యలను తగ్గించేందుకు ఎంతగానో సహాయపడుతుంది.

## మొలకెత్తిన మెంతులు
## రోజూ గుప్పెడు తినండి చాలు

ప్రతి వంటింట్లోనూ మెంతులు తప్పనిసరిగా ఉంటాయి. కొన్ని ప్రత్యేక వంటకాల్లో తప్పనిసరిగా మెంతుల్ని వాడుతుంటారు. ఇవి ఆ వంటకు చక్కటి రుచిని తెస్తాయి. అయితే.. వీటిలోని ఔషధ గుణాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయంటున్నారు ఆరోగ్య నిపుణులు. మెంతుల్లో ఫోలిక్ యాసిడ్, రాగి, పొటాషియం, ఐరన్, కాల్షియం, రైబోఫ్లావిన్, మాంగనీసుతోపాటు.. విటమిన్లు ఎ, బి6, సి, కె వంటి పోషకాలెన్నో మెండుగా ఉంటాయని చెబుతున్నారు. అయితే.. మెంతులను మొలకెత్తాక తీసుకుంటే రెట్టింపు ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. మొలకెత్తిన మెంతులు రక్తంలో చక్కెర స్థాయిలను కంట్రోల్‌లో ఉండేలా చేస్తాయి.. మధుమేహం బాధితులు రోజు మొలకెత్తిన మెంతులు తీసుకుంటే డయాబెటిస్ నియంత్రణలో ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అలాగే, మెంతులు రక్తంప్రవాహంలోకి గ్లూకోజ్‌ను నెమ్మదిగా విడదల చేస్తుంది. దీంతో, బ్లడ్ షుగర్ లెవల్స్ అకస్మాత్తుగా పెరగవు. మొలకెత్తిన మెంతులు రక్తంలో చక్కెర స్థాయిలను కంట్రోల్‌లో ఉండేలా చేస్తాయి.. మధుమేహం బాధితులు రోజు మొలకెత్తిన మెంతులు తీసుకుంటే డయాబెటిస్ నియంత్రణలో ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అలాగే, మెంతులు రక్తంప్రవాహంలోకి గ్లూకోజ్‌ను నెమ్మదిగా విడదల చేస్తుంది. దీంతో, బ్లడ్ షుగర్ లెవల్స్ అకస్మాత్తుగా పెరగవు. మెంతుల్ని మొలకలుగా చేసుకుని తీసుకోవటం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఎందుకంటే.. మొలకెత్తిన మెంతులలో ఫ్లేవనాయిడ్స్, ఆల్కలాయిడ్స్,



టానిన్లు సమృద్ధిగా ఉంటాయి. మెంతుల మొలకలను తీసుకోవడం వల్ల శరీరంలో యాంటీ బాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ స్థాయిలు మెరుగుపడతాయి. మొలకెత్తిన మెంతుల్లోని పోషకాలు మీ కండరాలు, కీళ్లను ఆరోగ్యంగా ఉంచుతాయి. మొలకెత్తిన మెంతులలో శరీరానికి అవసరమైన పోషకాలు, విటమిన్లు మెండుగా ఉంటాయి. ఇందులోని గెలాక్టోమన్నన్.. మిమ్మల్ని ఎక్కువసేపు కడుపు నిండుగా ఉంచుతుంది. అలాగే వీటిలో యాంటీఆక్సిడెంట్లు మెండుగా ఉంటాయి. ఇవి శరీరంలో ఫ్రీ రాడికల్స్ ఏర్పడకుండా రక్షిస్తాయి, ఫ్రీ రాడికల్స్‌తోనూ పోరాడతాయి. జీర్ణ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నవారికి మొలకెత్తిన మెంతులు దివ్యౌషధంగా పనిచేస్తాయి. మొలకెత్తిన మెంతి గింజలలో జీర్ణక్రియకు సహాయపడే ఎంజైమ్?లు సమృద్ధిగా ఉంటాయి. వీటిని తరచుగా తీసుకోవడం ద్వారా కడుపు ఉబ్బరం, అసిడిటీ, అజీర్ణం వంటి సమస్యలను దూరం చేస్తుంది. జీర్ణక్రియ మెరుగుపడుతుందని నిపుణులు చెబుతున్నారు. మొలకెత్తిన మెంతుల్లో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. ఇది హైపర్‌టెన్షన్‌ను అదుపు చేస్తుంది. అధిక కొలెస్ట్రాల్‌ను కరిగిస్తుంది. రక్తంలో కొలెస్ట్రాల్‌ను నియంత్రించడంలోనూ సహాయపడుతుంది. ఇవి గుండె పోటు ప్రమాదాన్ని తగ్గిస్తాయి. గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి.

## వీటిని తింటే
## జన్మలో క్యాన్సర్ రాదట..

పొలాల్లో.. రోడ్ల పక్కన.. ఎక్కడపడితే అక్కడ కనిపించే రేగు పళ్లు మన చిన్న తనంలో తిన్న జ్ఞాపకాలు ప్రతి ఒక్కరికీ ఉన్నాయి. అయితే వీటిని ఏవో పిచ్చిపళ్లు అనుకుని లైట్ తీసుకుంటే చాలానే నష్టపోతారు. ఎందుకంటే వీటిల్లో పోషకాలు కోట్లు ఖర్చుపెట్టినా దక్కవు మరి.. ఈ పండ్లు గుర్తుపట్టారా? వీటిని తింటే జన్మలో క్యాన్సర్ రాదట.. బోర్ ఫ్రూట్, బేర్ ఫ్రూట్, బుగూరి ఫ్రూట్ ఇలా రకరకాల పేర్లతో పిలిచే పండు.. అదేదో కాదు అదే.. మన పల్లెల్లో కనిపించే రేగిపండు. రేగిపళు తలచుకోగానే మన చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుకువస్తాయి. ముఖ్యంగా శీతాకాలంలో మార్కెట్‌లో ఇవి అందుబాటులోకి వస్తాయి. ఈ పండు రంగు, ఆకారం చూస్తే ఎవరికైనా నోరు ఊరాల్సిందే. రేగిపళ్లు తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఇందులో విటమిన్ ఎ, సి, మినరల్ న్యూట్రీషియన్స్ పుష్కలంగా ఉంటాయి. ఇది కండరాలు, నాడీ వ్యవస్థ, చర్మానికి అవసరమైన అనేక పోషకాలు అందిస్తుంది. రేగిపళ్లలో పొటాషియం, ఫాస్పరస్, మాంగనీస్, ఐరన్, జింక్ వంటి పోషకాలు గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. ఇందులోని ఐరన్ కంటెంట్ హిమోగ్లోబిన్ స్థాయిని పెంచుతుంది. రక్తహీనతను తగ్గిస్తుంది. ఇంకా



వీటి వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఇక్కడ తెలుసుకుందాం.. రేగిపళ్లలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది చర్మానికి మరింత మెరుపును అందించడంలో సహాయపడుతుంది. మొటిమల నుండి కూడా రక్షిస్తుంది. ఈ పండులో ఉండే కాల్షియం, ఫాస్పరస్ కంటెంట్ ఎముకలను పటిష్టం చేయడానికి ఉపయోగపడుతుంది. అలాగే ఈ పండ్లలోని ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మలబద్ధకం, అజీర్ణ సమస్యలను తగ్గిస్తుంది. ఇందులో యాంటీఆక్సిడెంట్ ఫైటోకెమికల్స్, పాలీశాకరైడ్స్, ఫ్లేవనాయిడ్స్, సపోనిన్‌లు కూడా ఉంటాయి. ఇవి మంచి నిద్రకు సహాయపడతాయి. అంతే కాకుండా ఇందులో బ్లడ్ షుగర్ తగ్గించే గుణాలు ఉన్నందున మధుమేహ వ్యాధిగ్రస్తులకు కూడా మేలు చేస్తుంది. మలబద్ధకంతో బాధపడేవారు వీటిని క్రమం తప్పకుండా తీసుకోవాలి. రేగిపళ్లు ఆస్టియో ఆర్థరైటిస్‌ను నివారిస్తుంది. ఈ పండ్లు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడమే కాకుండా రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి. ఇది గుండె ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఈ పండును పేస్ట్‌గా చేసి చర్మానికి అప్లై చేయడం వల్ల గాయం మానడంతో పాటు చర్మం మృదువుగా మారుతుంది. అలాగే ఈ పండులో ఉండే యాంటీమైక్రోబయల్, యాంటీ ఆక్సిడెంట్ గుణాల వల్ల ఇన్ఫెక్షన్లను నివారిస్తుంది. ఇది జీర్ణవ్యవస్థ పనితీరుకు సహాయపడుతుంది.



## థైరాయిడ్ సమస్యకు పరిష్కారం
## ఇలా చేయండి

ఈమధ్య కాలంలో చెడు ఆహారపు అలవాట్లు జీవనశలిలో మార్పుల కారణంగా థైరాయిడ్ సమస్యలు ఎక్కువ అవుతున్నాయి. ఈ సమస్య ఉన్నవారు వివిధ రకాల మెడిసిన్స్ వాడితే సమస్య తగ్గుతుంది. కానీ ఇలాంటి మెడిసిన్ ఖర్చు లేకుండా థైరాయిడ్ సమస్యలకు చెక్ పెట్టే మంచి సొల్యూషన్ ఒకటి ఉంది. అదే కొత్తిమీర... నయా పైసా ఖర్చు లేకుండా థైరాయిడ్ సమస్యకు కొత్తిమీర ద్వారా పరిష్కారం ఎలా అనుకుంటున్నారా..? మెడ భాగంలో బటర్ ఫ్లై ఆకారంలో ఉండే థైరాయిడ్ గ్రంథి అనేక శారీరక విధులకు కీలకంగా పనిచేస్తుంది. మెట్టబోలిజంను ఇంప్రూవ్ చేయడంలో ఎనర్జీ లెవెల్స్ కంట్రోల్ చేయడంలో పాటు మిగతా శరీరా అవయవాళ్ళ పనితీరులో కీ రోల్ పోషిస్తుంది. అందుకే ఈ థైరాయిడ్ గ్రంధికి ఏమైనా అయితే ఓవరాల్ హెల్త్‌పై ఎఫెక్ట్ పడుతుంది. థైరాయిడ్ హార్మోన్‌ని రిలీజ్ చేసే ఈ గ్రంధి సరిగా పనిచేయకపోతే హైపోథైరాయిడిజం సమస్యకు దారితీస్తుంది. ఈ థైరాయిడ్ సమస్యకు పరిష్కారం కోసం చాలామంది వివిధ రకాల మెడిసిన్స్ ఎప్పటికప్పుడు వాడుతూనే ఉంటారు. కానీ పెద్ద ఖర్చు లేకున్నా కేవలం కొత్తిమీర ద్వారా థైరాయిడ్ సమస్యకు చెక్ పెట్టొచ్చని నిపుణులు చెప్తున్నారు. వంటలో గార్నిష్ చేయడానికి కొత్తిమీర ఎక్కువగా వాడుతుంటాం. ఇది వంటలకు స్పెషల్ ఫ్లేవర్ అందించడంతోపాటు హెల్త్‌కి బెనిఫిట్స్ అందిస్తుంది కూడా. దీనిలో కీలకమైన విటమిన్లు.. ఐరన్, మెగ్నీషియం, పొటాషియం ఉంటాయి. థైరాయిడ్ హార్మోన్ లెవెల్స్ బ్యాలెన్స్ చేయడంలో ఇవి ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. అందుకే థైరాయిడ్ సమస్యకు కొత్తిమీర పవర్ఫుల్ రెమిడీగా పనిచేస్తుంది. కొత్తిమీరను వివిధ రకాలుగా డైట్లో చేర్చుకోవచ్చు. రెగ్యులర్‌గా చేసే వంటల్లో యాడ్ చేసుకుంటే ప్రయోజనం ఉంటుంది. అయితే కూరల్లో మిగతా మసాలాలు కూడా ఉంటాయి కాబట్టి అవి కొత్తిమీర ప్రభావాన్ని కాస్త తగ్గించే అవకాశం లేకపోలేదు. అందుకే కొత్తిమీర బెనిఫిట్స్ నేరుగా పొందేందుకు కొన్ని టిప్స్ పాటించాలి. కొత్తిమీర పేస్టుతో మంచి ప్రయోజనాలు పొందవచ్చు. కొత్తిమీర పేస్టుని గోరువెచ్చని నీటిలో కలిపి తాగాలి. ప్రతిరోజు ఈ డ్రింక్ ఓ గ్లాస్ తాగితే థైరాయిడ్ ఆరోగ్యం బాగుపడుతుంది. కొత్తిమీరతో చాయ్ చేసుకుంటే థైరాయిడ్ గ్రంథి ఆరోగ్యానికి మంచిదని నిపుణులు చెబుతున్నారు. కొత్తిమీర ఆకులను నీటిలో వేసి మరిగించి చల్లారిన తర్వాత వడగట్టి తాగవచ్చు. కొత్తిమీర ఆకులకు బదులుగా వాటి విత్తనాలు తింటే అవే బెనిఫిట్స్ పొందవచ్చు. ఓ నెలపాటు ఇలా చేస్తే మరిన్ని ప్రయోజనాలు అందుతాయి ఎలాంటి మెడికల్ ఖర్చు లేకుండా సైడ్ ఎఫెక్ట్స్ రాకుండా సింపుల్‌గా థైరాయిడ్ సమస్యకు చెప్పే సొల్యూషన్ ఇదని నిపుణులు సూచిస్తున్నారు.

## అరటి, బొప్పాయిని కలిపి తింటున్నారా..?

అలాంటి వారు కొన్ని నియమాలను తప్పక తెలుసుకోవాల్సి ఉంటుంది. ఎందుకంటే, కొన్ని రకాల పండ్లను కొన్నింటితో కలిపి తినకూడదు. అలా తింటే ఆరోగ్యం కాదు.. అనారోగ్యం తప్పదంటున్నారు నిపుణులు. అలాంటి వాటిలో అరటి పండు, బొప్పాయి కూడా ఉన్నాయి. పండ్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయనే విషయం మనందరికీ తెలిసిందే. ప్రతి రోజు ఏదో ఒక పూట పండ్లు తినడం వల్ల మంచి ఆరోగ్యంతో పాటు అందంగా కూడా ఉండొచ్చునని డాక్టర్లు కూడా చెబుతుంటారు. అయితే, చాలా మంది కొన్ని రకాల పండ్లను కలిపి ఫ్రూట్ సలాడ్స్ రూపంలో చేసుకుని తింటుంటారు. అలాంటి వారు కొన్ని నియమాలను తప్పక తెలుసుకోవాల్సి ఉంటుంది. ఎందుకంటే, కొన్ని రకాల పండ్లను కొన్నింటితో కలిపి తినకూడదు. అలా తింటే ఆరోగ్యం కాదు.. అనారోగ్యం తప్పదంటున్నారు నిపుణులు. అలాంటి వాటిలో అరటి పండు, బొప్పాయి కూడా ఉన్నాయి.అన్ని రకాల పండ్లు వాటి స్వంత స్వభావం కలిగి ఉంటాయి. విభిన్న స్వభావం గల రెండు రకాల పండ్లను కలిపి తినడం వల్ల అవి ఆరోగ్యానికి హాని చేస్తాయంటున్నారు నిపుణులు. . ఆయుర్వేదం ప్రకారం అరటి, బొప్పాయి పండు కలిపి తినడం ప్రమాదకరం అంటున్నారు. గుండె, పొట్ట ఆరోగ్యానికి అరటిపండు ఎంతో మేలు చేస్తుంది. బొప్పాయి పండు జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. కొలెస్ట్రాల్, మధుమేహానికి మేలు చేస్తుంది. ఈ రెండు పండ్లను విడివిడిగా తినడం వల్ల శరీరానికి మేలు జరుగుతుంది. కానీ కలిపి తినడం వల్ల శరీరానికి హాని చేస్తుందని తెలిస్తే ఆశ్చర్యపోతారు.



ఆయుర్వేదం ప్రకారం, అరటిపండు శరీరాన్ని చల్లబరుస్తుంది. బొప్పాయి శరీరాన్ని వేడి చేస్తుంది. ఈ రెండు పదార్థాలను కలిపి తింటే జీర్ణశక్తి క్షీణించి తలనొప్పి, వాంతులు, తల తిరగడం, అలర్జీ, అజీర్ణం వంటి సమస్యలు రావచ్చు అంటున్నారు నిపుణులు. ఆస్తమా లేదా శ్వాస సమస్యలు ఉన్నవారు బొప్పాయి తినకూడదని చెబుతున్నారు. బొప్పాయి తినడం వల్ల అలర్జీ వస్తుంది. అంతే కాకుండా మొటిమలు, దురద వంటి చర్మ సమస్యలు ఉన్నవారు కూడా బొప్పాయి తినకూడదని చెబుతున్నారు.

## ఖాళీ కడుపుతో ఈ ఆకులను తింటే ఎన్ని లాభాలో

అంతే కాదు ఖాళీ కడుపుతో జామ ఆకులను తీసుకోవడం వల్ల బరువు తగ్గడంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. శరీరంలో అధికంగా పేరుకున్న కొవ్వును కరిగించడంలోనూ జామాకు రసం అద్భుతంగా పనిచేస్తుంది. జామపండ్లు ఆరోగ్యానికి ఎంత మంచివో అందరికీ తెలిసిందే..అలాంటి జామపండ్లు మాత్రమే కాదు.. జామ ఆకుల్లోనూ అలాంటి పోషకాలే పుష్కలంగా ఉంటాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఇందులో శరీరానికి అవసరమైన ఫైబర్‌తో పాటు విటమిన్ A సమృద్ధిగా లభిస్తుంది. దీంతో పాటు ఈ ఆకుల్లో విటమిన్




C, ఫోలిక్ యాసిడ్, పొటాషియం, కాపర్, మాంగనీస్ కూడా ఉన్నాయి. ఇన్ని పోషకాలు నిండివున్న జామ ఆకులను ఉదయాన్నే ఖాళీ కడుపుతో తినడం వల్ల బాడీకి బోలెడు లాభాలు కలుగుతాయంటున్నారు నిపుణులు. ఆ లాభాలేంటో ఇక్కడ తెలుసుకుందాం.. జామ ఆకుల్లో యాంటీ డయాబెటిక్ గుణాలు ఉన్నాయి. అంతేకాదు, ఉదయాన్నే ఖాళీ కడుపుతో జామ ఆకులను నమలడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ఇది అజీర్ణం, మలబద్ధకం, గ్యాస్, అసిడిటీ మొదలైన కడుపు సమస్యల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. కాబట్టి ప్రతిరోజూ ఉదయం జామ ఆకులను నమలండి.

జామ ఆకుల్లో చాలా బయోయాక్టివ్ సమ్మేళనాలు ఉంటాయి. శరీరంలోని షుగర్‌ని తగ్గిస్తుంది.. అంతే కాదు ఖాళీ కడుపుతో జామ ఆకులను తీసుకోవడం వల్ల బరువు తగ్గడంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. శరీరంలో అధికంగా పేరుకున్న కొవ్వును కరిగించడంలోనూ జామాకు రసం అద్భుతంగా పనిచేస్తుంది.



# సినిమా






## ఓటీటీలోకి సూర్య 'కంగువ'

తమిళ అగ్ర కథానాయకుడు సూర్య ప్రధాన పాత్రల్లో నటించిన పీరియాడిక్ యాక్షన్ డ్రామా కంగువ స్టూడియో గ్రీన్ అధినేత కేఈ జ్ఞానవేల్ ఈ సినిమాను నిర్మించగా.. సిరుత్తై శివ దర్శకత్వం వహించాడు. ఈ చిత్రం నవంబర్ 14న ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. ఫస్ట్ షో నుంచే ఈ మూవీకి మిక్స్‌డ్ టాక్ రావడంతో బాక్సాఫీస్ వద్ద ఘోర పరజయం అందుకుంది. విడుదలై నెల కూడా కాకుండానే ఈ చిత్రం ఓటీటీ అనౌన్స్‌మెంట్‌ను పంచుకుంది. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ చిత్రం డిసెంబర్ 08 నుంచి తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ కానున్నట్లు వెల్లడించింది. దిశా పటానీ, బాబీ డియోల్, యోగి బాబు కీలక పాత్రల్లో నటించగా.. దేవిశ్రీప్రసాద్ సంగీతం అందించాడు. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. రష్యాకు చెందిన కొందరు శాస్త్రవేత్తలు కొందరు పిల్లలను బంధించి, వారిపై ప్రయోగాలు చేస్తుంటారు. వారి నుంచి ఓ పిల్లాడు తప్పించుకోవడంతో ఈ కథ మొదలవుతుంది. తప్పించుకున్న పిల్లాడు ఫ్రాన్సిస్(సూర్య) దగ్గరకు చేరతాడు. ఆ పిల్లాడెవరో ఫ్రాన్సిస్‌కి తెలీదు. కానీ ఇబ్బందుల్లో ఉన్నాడని అర్థం చేసుకుంటాడు. రష్యన్ దుండగలు ఆ పిల్లాడ్ని వెంబడిస్తుంటారు. ఫ్రాన్సిస్ కాపాడుతుంటాడు. అసలు ఆ పిల్లాడెవరు? ఫ్రాన్సిస్ దగ్గరకే ఎందుకు చేరాడు? ఫ్రాన్సిస్‌కీ ఈ పిల్లాడికీ ఉన్న సంబంధం ఏంటి? అసలు 'కంగువ' అంటే ఎవరు? ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానమే మిగతా కథ.

## ఆంటోనితో పెళ్లి.. అప్‌డేట్ ఇచ్చిన కీర్తి సురేశ్

అగ్ర కథానాయిక కీర్తి సురేష్ తన చిరకాల మిత్రుడు ఆంటోనితో పెళ్లిపీటలెక్కేందుకు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. ఇటీవల తిరుమల శ్రీవారిని దర్శించుకున్న సందర్భంగా కీర్తి సురేష్ తన పెళ్లి గురించి క్లారిటీ ఇచ్చారు. గోవాలో పెళ్లి జరుగుతుందని, త్వరలో అన్ని వివరాలను వెల్లడిస్తానని చెప్పింది. అయితే, పెళ్లి డేట్ మాత్రం చెప్పలేదు ఈ 'మహానటి'. అయితే, తమిళ మీడియా నుంచి అందుతున్న సమాచారం మేరకు కీర్తి సురేశ్ వివాహం ఈనెల 12న జరగనున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో పెళ్లి టైమ్ దగ్గరపడుతుండటంతో ఈ చెన్నై బ్యూటీ తాజాగా గోవా ఫ్లైట్ ఎక్కేసింది ఓ మేరకు అప్‌డేట్ ఇస్తూ బోర్డింగ్ పాస్‌లను ఇన్‌స్టా స్టోరీస్‌లో షేర్ చేస్తూ KAwedding అని పేర్కొంది. ప్రస్తుతం ఈ ఫొటో వైరల్ అవుతోంది. ఇక కీర్తి సురేష్‌ను పెళ్లాడబోతున్న ఆంటోని ఆమె కాలేజీ స్నేహితుడు. దాదాపు 15 ఏండ్లుగా వీరిమధ్య మంచి స్నేహసంబంధాలున్నాయి. ఇద్దరి కుటుంబాలు కూడా సన్నిహితంగా ఉంటాయని తెలిసింది. ఆంటోని కేరళలో వ్యాపారవేత్తగా రాణిస్తున్నారు. ప్రస్తుతం కీర్తి సురేష్ రివాల్వర్ రీటా, బేబీ జాన్ చిత్రాల్లో నటిస్తున్నది.






## పుష్పరాజ్ డామినేషన్ కంటిన్యూ

### షారుక్ ఖాన్ జవాన్ రికార్డ్ బద్దలు..!

అల్లు అర్జున్–సుకుమార్ కాంపౌండ్ నుంచి వచ్చిన మోస్ట్ ఎవెయిటెడ్ ఫ్రాంఛైజీ ప్రాజెక్ట్ పుష్ప 2 ది రూల్ ఈ పాన్ ఇండియా సినిమా తెలుగు, తమిళం, మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో గ్రాండ్‌గా విడుదలై రికార్డుల వేట మొదలుపెట్టింది. పుష్ప 2 ది రూల్ రిలీజైన అన్ని సెంటర్లలో దాదాపు హౌస్‌ఫుల్ షోలతో విజయవంతంగా స్క్రీనింగ్ అవుతోంది. ఇప్పటికే ఓపెనింగ్ డేన నైజాం ఏరియాలో ఈ చిత్రం రూ. 30 కోట్లు షేర్ రాబట్టి.. ఆర్‌ఆర్‌ఆర్ (రూ. 23.38 కోట్లు)పై ఉన్న రికార్డును అధిగమించినట్టు వార్తలు వచ్చాయి. తాజాగా మరో అరుదైన ఫీట్‌ను ఖాతాలో వేసుకుందని బీటౌన్ సర్కిల్ కథనం. జవాన్ ఫస్ట్ డే రూ. 65 కోట్లు వసూళ్లు రాబట్టగా.. పుష్ప 2 రూ. 67 కోట్లతో రికార్డ్‌ను బీట్ చేసి టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తోంది. ఈ లెక్కన పుష్ప 2 బాక్సాఫీస్ రికార్డుల మోత ఖాయమని పుష్పరాజ్ చెప్పకనే చెబుతున్నాడు. మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్‌తో తెరకెక్కించిన సీక్వెల్‌లో ఫహద్ ఫాసిల్, జగదీష్ ప్రతాప్ బండారి, జగపతిబాబు, ప్రకాశ్ రాజ్, సునీల్, అనసూయ భరద్వాజ్, రావు రమేశ్, ధనంజయ, షణ్ముఖ్, అజయ్, శ్రీతేజ్ ఇతర కీలక పాత్రల్లో నటించారు.

## కాలుతో సైకిల్ స్టాండ్ వేస్తున్న రామ్..

### ఆసక్తి రేకెత్తిస్తోన్న రాపో 22 ఫస్ట్ లుక్

డబుల్ ఇస్మార్ట్ డిజాస్టర్ తర్వాత సినిమాల ఎంపికలో రూటు మార్చేశాడు రామ్ పోతినేని ఈ సారి ఎలాగైనా హిట్టు కొట్టాలని చూస్తున్న రామ్ కంప్లీట్ కొత్త కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి ఫేం పీ మహేశ్ బాబు దర్శకత్వంలో రామ్ నటిస్తోన్న తాజా చిత్రం రాపో 22 మిస్టర్ బచ్చన్ ఫేం భాగ్య శ్రీ బోర్సే ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్ తెరకెక్కిస్తోన్న ఈ సినిమా ఇటీవలే పూజాకార్యక్రమాలతో గ్రాండ్‌గా లాంఛ్ అయింది. మీకు సుపరిచితుడు.. మీలో ఒకడిని పరిచయం చేస్తామని మేకర్స్ చెప్పారని తెలిసిందే. తాజాగా అందరిలో ఒకడు రామ్ పాత్రను పరిచయం చేశారు. చేతిలో నోట్‌బుక్ పట్టుకుని కాలుతో సైకిల్ స్టాండ్ వేస్తున్న రామ్ లుక్ నెట్టింట ట్రెండింగ్ అవుతోంది. ఇంతకీ రామ్ ఈ చిత్రంలో స్టూడెంట్‌గా కనిపించబోతున్నాడా..? లేదంటే టీచర్‌గా మారి పాఠాలు చెప్పబోతున్నాడా.. ? అనేది తెలియాలంటే మరికొన్ని రోజులు వెయిట్ చేయాల్సిందే.

ఈ మూవీలో మిస్టర్ బచ్చన్ ఫేం భాగ్య శ్రీ బోర్సే ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్ తెరకెక్కిస్తోన్న ఈ చిత్రానికి కోలీవుడ్ మ్యూజిక్ డైరెక్టర్ల ద్వయం వివేక్–మెర్విన్ సంగీతం అందిస్తున్నారు. మేరిక్రిస్మస్, మలైకొట్టై వాలిబన్ ఫేం సినిమాటోగ్రఫర్ మధు నీలకందన్ ఈ సినిమాకు పని చేస్తుండటంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. నేషనల్ అవార్డు విన్నింగ్ టెక్నీషియన్ అక్కినేని శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్‌గా వర్క్ చేస్తున్నాడు.







## రూమర్స్‌కు చెక్..

### ఒకే ఫ్రేమ్‌లో ఐశ్వర్య - అభిషేక్ జంట..

బాలీవుడ్ స్టార్ జంట ఐశ్వర్య రాయ్ అభిషేక్ బచ్చన్ విడాకులు తీసుకోబోతున్నారంటూ గత కొంత కాలంగా వార్తలు హల్‌చల్ చేస్తున్న విషయం తెలిసిందే. అయితే, ఈ వార్తలపై ఇద్దరూ ఎప్పుడూ బహిరంగంగా స్పందించలేదు. తాజాగా ఈ రూమర్స్‌కు చెక్ పెడుతూ ఐశ్వర్య – అభిషేక్ జంట ఒకే ఫ్రేమ్‌లో దర్శనమిచ్చారు. వీరిద్దరూ కలిసి తాజాగా ఓ ఈవెంట్‌కు హాజరయ్యారు. ఇద్దరూ బ్లాక్ డ్రెస్‌లు ధరించి ఫొటోలకు ఫోజులిస్తూ సందడి చేశారు. ఐశ్వర్య తల్లి బృంద్య, అను రంజన్‌తో కలిసి ఈ స్టార్ జంట సెల్ఫీలు దిగారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. కాగా, ఐశ్వర్యరాయ్, అభిషేక్ బచ్చన్ జంట విడాకులు తీసుకోబోతున్నదంటూ ఇటీవల వార్తలు తెగ హల్‌చల్ చేస్తున్నాయి. అభిషేక్ నటి నిమ్రత్ కౌర్‌తో రిలేషన్‌లో ఉన్నాడని.. ఈ క్రమంలోనే ఐష్ నుంచి విడిపోనున్నట్లుగా బాలీవుడ్ కోడై కూస్తున్నది. ఈ క్రమంలోనే ఏ పార్టీకి హాజరైనా బచ్చన్ ఫ్యామిలీ కుటుంబంతో సహా హాజరవుతున్నా.. ఐశ్వర్య మాత్రం కూతురు ఆరాధ్యతో కలిసి వేరుగా హాజరవడం ఈ వార్తలకు మరింత ఆజ్యంపోసినట్లయ్యింది. అలాగే, ఒక్కగానొక్క కూతురు ఆరాధ్య బర్త్ డే వేడుకలకు సైతం అభిషేక్ దూరంగా ఉన్నాడు. దీంతో ఈ జంట త్వరలో విడాకులు తీసుకోవడం ఖాయం అని అందరూ భావించారు. ఇంతలోనే ఇద్దరూ ఓ కార్యక్రమానికి హాజరై ఆ రూమర్స్‌కు చెక్ పెట్టారు. అభిషేక్– ఐశ్వర్యరాయ్ 2007లో వివాహం చేసుకున్నారు. 2011లో ఈ జంటకు ఆరాధ్య జన్మించింది. ఇటీవల ఆరాధ్య 13వ పుట్టిన రోజును తల్లి ఐశ్వర్యతో కలిసి సెలబ్రేట్ చేసుకున్నది. అయితే, బర్త్‌డే పార్టీ వేడుకల్లో అభిషేక్ మాత్రం ఎక్కడా కనిపించలేదు. ఐశ్వర్య ఆరాధ్య పుట్టిన తర్వాత ఐదేళ్లు సినిమాలకు దూరంగా ఉంది. 2015లో జబ్బా సినిమాలో మళ్లీ రీ ఎంట్రీ ఇచ్చింది. గత కొన్నేళ్లుగా ఎంపిక చేసిన చిత్రాల్లో మాత్రమే నటిస్తూ వస్తున్నది.

